ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

రాజమహేంద్రవరం

: fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa,Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

17-8-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 198 పేజీలు: 8+4 వెల: 6.50

## సముద్రంలో నిప్పుల తుఫాను

బెంగాల్ అసెంబ్లీ మాజీ డి. స్పీకర్ అనుమానాస్పద మృతి

5

# భోగాపురం నుంచి విమానాల రాకపోకలు షురూ!

**తొలి రోజే హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై ఫ్లైట్స్**

**ప్రయాణికులకు అందుబాటులోకి 31 విమానాల సర్వీసులు**

**విశాఖ ఎయిర్ పోర్ట్ నుంచి షెడ్యూల్ విమానాల నిలిపివేత**



**విజయవాడ, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా భోగాపురంలో కొత్తగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వాణిజ్య విమాన సర్వీసులు ఆదివారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. దీనితో పాటు, విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌లోని (ఐఎన్‌ఎస్ డేగా) సివిల్ ఎన్‌క్లేవ్‌లో వాణిజ్య కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆదివారం అర్ధరాత్రి 12:01 గంటల నుంచి అంటే సోమవారం తొలి గంటల నుంచి భోగాపురం విమానాశ్రయం పూర్తిస్థాయిలో పనిచేస్తుందని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఇప్పటికే అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అన్ని విమానయాన సంస్థలు తమ సేవలను విశాఖపట్నం నుంచి భోగాపురానికి మార్చాయి. తొలిరోజే హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా, తిరుపతి వంటి నగరాలకు 31 సర్వీసులు నడపడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. పాత విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌కు ఉన్న విటిజెడ్ ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ కోడ్‌ను కూడా భోగాపురం విమానాశ్రయానికి బదిలీ చేశారు. అయితే, జాతీయ అత్యవసర పరిస్థితులు, భారత వైమానిక దళం, ఇతర రక్షణ దళాలు, పోలీసు, ప్రభుత్వ ప్రత్యేక విఐపి విమానాల రాకపోకలకు మాత్రం విశాఖ ఎయిర్‌పోర్ట్‌ను వినియోగించనున్నారు.

ప్రధాని నరేంద్ర మోడీ ఆగస్టు 1న ఈ విమానాశ్రయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. సుమారు రూ.4,727 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం కేవలం 31 నెలల్లోనే పూర్తయి, దేశంలో అత్యంత వేగంగా నిర్మించిన విమానాశ్రయాల్లో ఒకటిగా నిలిచింది. షెడ్యూల్ కంటే దాదాపు ఐదు నెలల ముందే దీని నిర్మాణం పూర్తి కావడం విశేషం. ఈ ఎయిర్‌పోర్ట్‌కు ఇప్పటికే డిజిసిఎ ఏరోడ్రోమ్ లైసెన్స్‌తో పాటు అవసరమైన అన్ని భద్రత, అగ్నిమాపక, పర్యావరణ అనుమతులు లభించాయి. మొదటి దశలో యేటా 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించేలా దీన్ని రూపొందించారు. భవిష్యత్తులో దీని సామర్థ్యాన్ని యేటా 4 కోట్ల మంది ప్రయాణికులకు పెంచేలా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. ఈ ప్రాజెక్టు ఉత్తరాంధ్రలోని పూర్వపు విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఆర్థిక వృద్ధి, పర్యాటకం, పారిశ్రామిక పెట్టుబడులు, ఎగుమతులు, లాజిస్టిక్స్, ఏరోస్పేస్, రక్షణ రంగాలను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు. ఈ సమీకృత >>2

# 2025నాటి ఓటర్ల జాబితాతోనే స్థానిక పోరు

**ముందుగా పురపాలక సంఘాల ఎన్నికలు**

**ఆ తర్వాతే గ్రామపంచాయతీల నిర్వహణ**

**రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం యోచన**

**విజయవాడ, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కసరత్తు ఆరంభమైంది. 'సర్' తుది జాబితాతో నిమిత్తం లేకుండా ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం భావిస్తోంది. అక్టోబర్‌లో ఈ ఎన్నికలు నిర్వహించాలన్న ఆలోచనతో ప్రభుత్వం ఉంది. అయితే, ఇటీవల నిర్వహించిన ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) తుది ఓటర్ల జాబితాలతో కాకుండా 2025 నాటి ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్) ఓటర్ల జాబితాల ఆధారంగా ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. అక్టోబర్ 3న సర్ తుది ఓటర్ల జాబితాలు ప్రచురించనున్నారు. వాటిని ప్రామాణికంగా తీసుకుని స్థానిక సంస్థల్లో ఓటర్ల జాబితాలు ప్రచురిస్తే ఎన్నికల నిర్వహణ జాప్యమవుతోందని భావిస్తున్నారు. ఈ కారణంతో 2025 నాటి జాబితాలతోనే ఎలక్షన్స్‌కి వెళ్లాలని రాష్ట్ర ఎన్నికలసంఘం నిర్ణయించింది. ఈ మేరకు ముందుగా పురపాలక, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో ఫొటో గుర్తింపు ఓటరల్ జాబితాల ప్రచురణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ముందుగా పుర, నగరపాలక, నగర పంచాయతీల్లో, ఆ తర్వాత గ్రామ పంచాయతీల్లో ఎలక్షన్స్ జరగనున్నాయి. ఈ ఎన్నికల కోసం ఆశావాహులంతా సన్నద్ధమవుతున్నారు. >>2

# బిసిల సంరక్షణకు ప్రత్యేక చట్టం

**ముసాయిదా సిద్ధమైంది**

**సర్దార్ గౌతు లచ్చన్న స్ఫూర్తితో పరిపాలన**

**బిసిల అభ్యుదయానికి కృషి చేస్తున్నాం: సిఎం నారా చంద్రబాబు నాయుడు**

**గౌతు లచ్చన్నకు ముఖ్యమంత్రి నివాళి**



ఆదివారం అమరావతిలో గౌతు లచ్చన్న చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** బిసిల సంరక్షణను చేపట్టే బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని, దీనికోసం త్వరలోనే చట్టం చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. బిసి సంరక్షణ చట్టం కోసం ముసాయిదా సిద్ధమైందని వెల్లడించారు. స్వాతంత్ర్య సమరయోధులు సర్ధార్ గౌతు లచ్చున్న జయంతి సందర్భంగా తన కార్యాలయంలోని ఆయన చిత్రపటానికి నివాళి అర్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ బిసిల అభ్యున్నతికి సర్దార్ గౌతు లచ్చున్న విశేషకృషి చేసారన్నారు. ఆయన స్ఫూర్తితోనే తమ ప్రభుత్వం బిసిల అభ్యుదయానికి కృషి చేస్తుందన్నారు. "బిసిలకు కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలుస్తోంది. వారి సంక్షేమం కోసం పని చేయడంతోపాటు రక్షణ కల్పించేందుకు చట్టం చేస్తున్నాం. దీనికోసం ముసాయిదా ఇప్పటికే సిద్ధమైంది. ఇక బిసిల సంక్షేమంలో భాగంగా వివిధ వర్గాలను అన్ని రకాలుగా అభివృద్ధి సాధించేలా చర్యలు తీసుకుంటున్నాం. చేపలవేట నిషేధ సమయంలో 1.34 లక్షల మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేల చొప్పున రెండేళ్లలో రూ.505 కోట్లు ఇచ్చాం. వడ్డెరలకు మైనింగ్ లీజులు, గీత కార్మికులకు ఎక్సైజ్ షాపులు కేటాయించాం. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు బిసిలకు 3 కిలో వాట్లకు అదనంగా రూ.20 వేలు సబ్సిడీ ఇస్తున్నాం. రాష్ట్రంలో అందరికీ రూ.2.5 లక్షల >>2



**ఏనుగుల సంచారంపై ప్రజలను**

# అప్రమత్తం చేయండి

**అటవీశాఖ అధికారులకు ఉప ముఖ్యమంత్రి ఆదేశం**

**ఏనుగుల కదలికలపై డ్రోన్లతో నిఘా**

**అటవీ సమీప గ్రామాల్లో రాత్రివేళ గస్తీ పెంచండి**

**రెవెన్యూ, పోలీసు శాఖల సమన్వయంతో ప్రజలకు సమాచారం అందించండి**

**హనుమాన్ బృందాలను మొహరించాలని పవన్ సూచన**

**విజయవాడ, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి జిల్లా చంద్రగిరి సమీప ప్రాంతాల్లోని ఎర్రవారిపాలెం వద్ద ఏనుగుల గుంపు సంచరిస్తున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలని, ధైర్యం చెప్పాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ అటవీశాఖ అధికారులను ఆదేశించారు. ఏనుగుల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ, డ్రోన్ల సహాయంతో వాటి సంచార మార్గాలను గుర్తించి సమీప గ్రామాల ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. శేషాచలం అటవీ ప్రాంతంలోని ఏనుగులు రెండు గుంపులుగా సంచరిస్తూ రాత్రివేళ అటవీ సరిహద్దుల్లోని పంట పొలాలను ధ్వంసం చేస్తున్నాయన్న సమాచారంపై పవన్ కల్యాణ్ అటవీశాఖ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆస్తి, ప్రాణ నష్టాన్ని తగ్గించేందుకు అటవీ, రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, అటవీ సమీప గ్రామాల్లో రాత్రివేళ ప్రత్యేక గస్తీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రజలు రాత్రివేళ పొలాలకు వెళ్లకుండా అవగాహన కల్పించడంతోపాటు అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఏనుగుల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో మైకులు, మొబైల్ సందేశాలు, స్థానికసమాచార వ్యవస్థల ద్వారా హెచ్చరి >>2

# కొనసాగుతున్న జూడాల సమ్మె

**నేటినుంచి అత్యవసర సేవలు బంద్**

**జూడాల సమ్మెకు సిపిఐ మద్దతు**

**సమస్యలు పరిష్కరించాలని సిఎంకు ఈశ్వర్య లేఖ**

**గుంటూరు(మెడికల్), ఆగస్టు 16 ప్రభాతవార్త:** జూనియర్ వైద్యుల జీతభత్యాల సవరణను అమలు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ జూనియర్ వైద్యుల సంఘం చేపట్టిన దశలవారీ ఆందోళన మూడో దశకు చేరుకుంది. ప్రభుత్వం నుంచి ఆగస్టు 15 సాయంత్రం 5 గంటలలోగా సంతృప్తికరమైన లిఖితపూర్వక హామీలేదా నిర్ణయం వెలువడుతుందని ఆశించినప్పటికీ, నిర్దేశిత గడువులోగా స్పష్టమైన హామీ రాకపోవడంతో ఆగస్టు 17 నుంచి మూడో దశ ఆందోళన ప్రారంభిస్తున్నట్లు సంఘం ప్రకటించింది. ఇప్పటివరకు చేపట్టిన దశల్లో అత్యవసరవైద్యసేవలు, అత్యవసర చికిత్స విభాగ సేవలను కొనసాగిస్తూ, అత్యవ సరం కాని వైద్య సేవలను మాత్రమే దశలవారీగా నిలిపివేసినట్లు సంఘం తెలిపింది. ప్రభుత్వానికి సమస్య పరిష్కరించేందుకు తగినసమయం ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈవిధానాన్ని అనుసరించినట్లు పేర్కొంది.

**అత్యవసర సేవలు సైతం నిలిపివేత:**

ఆగస్టు 17 నుంచి అత్యవసరం కాని వైద్య సేవల నిలిపివేత కొనసాగడంతో పాటు, ఆందోళనలో పాల్గొంటున్న జూనియర్ వైద్యులు అత్యవసర వైద్య సేవలను కూడా ఉపసంహరించుకోనున్నట్లు సంఘం ప్రకటించింది. అంత >>2



**నాణ్యత లేమితో అంతర్జాతీయ మార్కెట్‌లో చెడ్డపేరు**

**పురుగు మందుల అవశేషాలు, అఫ్లోటాక్సిన్‌పై అభ్యంతరాలు**

**నాడు చైనా... నేడు శ్రీలంక నుంచి కంటైనర్లు వెనక్కి**

**వరుసగా విదేశీ మార్కెట్లలో తిరస్కరణతో ఎగుమతిదారుల్లో ఆందోళన**

# గుంటూరు మిర్చి 'ఘాట్లు' ఏదీ?

**గుంటూరు(మెడికల్), ఆగస్టు 16 ప్రభాతవార్త:** గుంటూరు మిర్చికి అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న పేరు ప్రతిష్ఠకు నాణ్యతా ప్రమాణాలే ఇప్పుడు అతిపెద్ద సవాలుగా మారుతున్నాయా? ఒకవైపు చైనా నుంచి పురుగుమందుల అవశేషాలపై అభ్యంతరాలు వ్యక్తమై మిర్చి సరుకులు తిరస్కరణకు గురైన ఘటన మరువకముందే.. తాజాగా శ్రీలంకకు వెళ్లిన గుంటూరు మిర్చి సరుకుల విషయంలోనూ నాణ్యతపై అభ్యంతరాలు వ్యక్తమైనట్లు వెలువడుతున్న సమాచారం మిర్చి ఎగుమతి వర్గాల్లో కలకలం రేపుతోంది.గుంటూరు నుంచి చైనాకు ఇటీవల పంపిన మిర్చి సరుకుల్లో అనుమతించిన పరిమితికి మించి పురుగుమందుల అవశేషాలు ఉన్నట్లు అక్కడి అధికారులు గుర్తించి మూడు సరుకులను తిరస్కరించిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై ఎగుమతిదారులు, మిర్చి రంగం ప్రతినిధులు ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసి నాణ్యతా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

ఇదిలా ఉండగానే శ్రీలంకకు గుంటూరు నుంచి వెళ్లిన మిర్చి సరుకుల్లో అధిక తేమ, అఫ్లోటాక్సిన్ సమస్యలను అక్కడి అధికారులు గుర్తించినట్లు సమాచారం. తేమ ఎక్కువగా ఉండటం వల్ల నిల్వ సమయంలో బూజు ఏర్పడి నాణ్యత దెబ్బతినే అవకాశం ఉండటంతో కొన్ని సరుకులపై అభ్యంతరాలు వ్యక్తమైనట్లు తెలుస్తోంది. అయితే శ్రీలంకలో ఎన్ని సరుకులు తిరస్కరణకు గురయ్యాయి, వాటిలో నాణ్యతాపరీక్షల్లో నమోదైన ఖచ్చితమైన పరిమాణాలు ఏమిటన్నది అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది.

**శ్రీలంకలోనూ కఠిన ప్రమాణాలు:**

శ్రీలంకలో మొత్తం మిరపకాయలకు సంబంధించిన నాణ్యతా ప్రమాణాలు కఠినంగానే ఉన్నాయి. మిరపకాయల్లో తేమ 11 శాతానికి మించకూడదని, అఫ్లోటాక్సిన్ బి1కిలోకు 5 మైక్రోగ్రాములు, మొత్తం అఫ్లోటాక్సిన్లు కిలోకు 10 మైక్రోగ్రాములకు మించకూడదని అక్కడి ప్రమాణాలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో ఎగుమతికి ముందు మిర్చి నాణ్యతను పూర్తిస్థాయిలో పరీక్షించడంఅత్యంత కీలకంగా మారింది. ముఖ్యంగా కోతఅనంతరం ఎండబెట్టడం, గోదాముల్లో నిల్వ చేయడం, ప్యాకింగ్, రవాణా సమయంలో తేమ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. >>2

# టీచర్ల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయొద్దు

**విజయవాడలో మెగా డిఎస్సీ-2025 విజేతల ఆత్మగౌరవ ర్యాలీ**




డిఎస్సీలో ఎంపికైప ఉపాధ్యాయులు ఆదివారం విజయవాడలో నిర్వహించిన భారీ ఆత్మగౌరవ ర్యాలీ దృశ్యం

**విజయవాడ, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** మెగా డిఎస్సీ 2025లో ఎంపికైన నూతన ఉపాధ్యాయులు ఆదివారం విజయవాడలో భారీ ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహించారు. తమ నియామకాలపై వైసిపి నేతలు విష ప్రచారం చేస్తున్నారంటూ వారు ఆరోపించారు. తమ ఎంపిక విధానంపై రాద్ధాంతం చేస్తున్న వారి దుష్ప్రచారాన్ని తిప్పి కొడుతూ మెగా డిఎస్సీ 2025లో ఎంపికైన నూతన ఉపాధ్యాయులు ఈ ఆత్మగౌరవ ర్యాలీని నిర్వహించారు. తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా చేస్తున్న ఆరోపణలు వెంటనే ఆపకపోతే వైసిపిని ప్రకాశం బ్యారేజీలో కలిపేస్తామంటూ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి సుమారు 7వేల మందికి పైగా నూతన >>2

# నేటి నుండి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు




**విజయవాడ,ఆగస్టు 16, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ఈనెల 17వ తేది సోమవారం నుండి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు సమాచార శాఖ ఒక బులిటన్ విడుదల చేసింది.ఉదయం .10గం.లకు రాష్ట్ర శాసన మండలి సమావేశాలు ప్రారంభం అవుతాయి. అసెంబ్లీ సమావేశాల ప్రత్యక్ష ప్రసారం(లైవ్ టెలికాలికాస్ట్)ను అసెంబ్లీ మీడియా పాయింట్ తోపాటు సచివాలయ నాల్గవ భవనంలోని ప్రచార విభాగం (పబ్లిసిటీ సెల్)ద్వారా చేయబడుతుంది.తొలి రోజు ప్రశ్నోత్తరాల అనంతరం అసెంబ్లీ సమావేశాల నిర్వహణ తదితరంశాలపై మీటింగ్ జరుగుతుంది.ఈ సమావేశంలో ఎన్నిరోజులు అసెంబ్లీ నిర్వహించాలనే అంశంపై నిర్ణయం తీసుకుంటారు. బిసి సంరక్షణ కోసం ప్రత్యేక పాలసీతో సహా పలు కీలకంశాలపై అసెంబ్లీలో చర్చించనున్నారు. ఇక ఇప్పటికే కూటమి పక్షాలు తమ 175 మంది సభ్యులు తప్పనిసరిగా సమావేశాలకు హాజరు కావాలని ఆదేశించాయి. వైసిపి తమ ప్రతిపక్ష హోదా ఇవ్వనందుకు నిరసనగా శాసనసభకు హాజరు కావట్లేదని ప్రకటించింది.

# పెళ్లికి వెళ్లి తిరిగివస్తూ..

- కాల్వలోకి దూసుకెళ్లిన కారు
- ఆరుగురు విద్యార్థులు గల్లంతు
- ప్రాణాలతో ఒకరు క్షేమం
- నలుగురి మృతదేహాలు లభ్యం
- మరొకరి కోసం ముమ్మర గాలింపు
- పశ్చిమగోదావరి జిల్లాలో విషాద ఘటన

2లో



ఆదివారం న్యూఢిల్లీలో అటల్ బిహారీ వాజ్‌పేయి సమాధివద్ద నివాళులర్పిస్తున్న ప్రధాని మోడీ

# మాజీ ప్రధాని వాజ్‌పేయికి రాష్ట్రపతి, ప్రధాని నివాళి

**న్యూఢిల్లీ, ఆగస్టు 16:** మాజీ ప్రధాని, దివంగత నేత అటల్ బిహారీ వాజ్‌పేయి 8వ వర్ధంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దేశానికి వాజ్‌పేయి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్ వేదికగా పోస్టులు చేశారు.దేశ సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన అసాధారణ రాజనీతిజ్ఞుడు అటల్‌జీ అని ప్రధాని మోడీ కొనియాడారు. వాజ్‌పేయికి అపారమైన దూరదృష్టి ఉందని ప్రశంసించారు. ఆయన మాటలు, కృషి తరతరాలకు స్ఫూర్తినిచ్చాయని పేర్కొన్నారు. మాజీ ప్రధాని నాయకత్వం దేశాన్ని మరింత బలోపేతం చేసిందన్నారు. సుపరిపాలన, ప్రజా సంక్షేమంపై అటల్‌జీ చూపిన దృష్టి ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తుందని ప్రధాని మోడీ చెప్పుకొచ్చారు. మరోవైపు, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయికి ఘనంగా నివాళులర్పించారు. న్యూఢిల్లీలోని సదైవ అటల్ సమాధి వద్దకు ఆమె చేరుకున్నారు. ఈ సందర్భంగా పుష్పాంజలి ఘటించారు. అనంతరం దేశానికి వాజ్‌పేయి అందించిన సేవలను రాష్ట్రపతి స్మరించుకున్నారు.

## ఓటర్ల జాబితాతోనే స్థానిక పోరు

>> రాజకీయ పార్టీలు కూడా అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో పడ్డాయి.ఇక స్థానాల రిజర్వేషన్లపై కూడా ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. బిసి రిజర్వేషన్లకు సంబంధించి డెడికేటెడ్ కమిషన్ ఇప్పటికే నివేదిక ఇచ్చింది. రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయిందంటేనే ఎన్నికలు సమీపించాయని అర్థం అంటూ అధికారులు చెబుతున్నారు. దాంతో ఓటర్ల జాబితా ప్రచురణపై ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. వీలైనంత త్వరగా ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని ఆదేశాలు కూడా జారీ చేసింది.మున్సిపాలిటీల్లో వచ్చే నెల 3లోగా, ఇప్పటి వరకు ఓటర్ల జాబితా సిద్ధం చేయని సుమారు 50 పంచాయతీల్లో ఈ నెల 17వ తేదీలోగా ఓటర్ల జాబితా ప్రచురణ పూర్తి చేయాలని పురపాలక, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలను ఎన్నికల సంఘం ఆదేశించింది. పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాల ఎంపిక, వాటికి సంబంధించిన పబ్లికేషన్ ప్రక్రియ కూడా ఈ నెల 21 నుంచి 31లోగా పూర్తి చేయాలని సూచించింది. ఎన్నికల సిబ్బందికి శిక్షణతో పాటు ఏర్పాట్లు కూడా 30 35 రోజుల్లో పూర్తి చేయాలని ఎన్నికల సంఘం చూస్తోంది.

## ప్రజలను అప్రమత్తం చేయండి

>> కలు జారీ చేయాలన్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చోట హనుమాన్ బృందాలను మోహరించి ప్రజల భద్రతను నిర్ధారించాలి. క్షేత్ర స్థాయి సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉంటూ అటవీశాఖ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని ఉప ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఏనుగులు పంట పొలాలపై దాడి చేసి పంటలను ధ్వంసం చేస్తున్న నేపథ్యంలో, పంట నష్టంపై అధికారులు నివేదికలు రూపొందించిన వెంటనే అటవీశాఖ ద్వారా తక్షణ పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని పవన్ కల్యాణ్ తెలిపారు.

# రాకపోకలు షురూ!

>> ప్రాజెక్టు మొత్తం 2,703.26 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇందులో 2,203.32 ఎకరాలు విమానాశ్రయానికి, 500 ఎకరాలు ఏవియేషన్ హబ్‌కు, 136.63 ఎకరాలు ఏవియేషన్ యూనివర్సిటీ/ఎడ్యుసిటీకి కేటాయించారు. ఎయిర్‌పోర్ట్‌లోని 3,800 మీటర్ల పొడవైన కోడ్‌ఇ రన్‌వే బోయింగ్ 777, బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్, ఎయిర్‌బస్ ఏ330, ఏ340 వంటి భారీ విమానాలను సైతం హ్యాండిల్ చేయగలదు. దేశీయ, అంతర్జాతీయ కార్యకలాపాలకు మద్దతుగా అత్యాధునిక ఎయిర్‌ఫీల్డ్ లైటింగ్, నావిగేషన్ వ్యవస్థలను ఇక్కడ ఏర్పాటు చేశారు. ఈ విమానాశ్రయం ప్రారంభంతో ఉత్తరాంధ్ర అభివృద్ధిలో ఒక నూతన అధ్యాయం ప్రారంభం కానున్నది. పాత రన్‌వే కేవలం ఆరు వేల అడుగులు మాత్రమే ఉండటంతో పెద్ద విమానాల ల్యాండింగ్‌కు ఇబ్బందులు ఎదురయ్యేవి. దీన్ని అధిగమించడానికి 10,007 అడుగుల రన్‌వేను నిర్మించి 2007 జూన్ 15న ప్రారంభించారు. దీంతో బోయింగ్ 737, ఎయిర్‌బస్ ఎ320 వంటి భారీ వాణిజ్య విమానాల రాకపోకలకు మార్గం సుగమమైంది. రూ.95 కోట్లతో సరికొత్త ఇంటిగ్రేటెడ్ ప్యాసింజర్ టెర్మినల్ భవనాన్ని 2009 ఫిబ్రవరి 20న ప్రారంభించారు. ఇన్‌స్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్ (ఐఎల్ఎస్) రాత్రివేళల్లో విమానాలు దిగే సాంకేతికత (నైట్ ల్యాండింగ్) 2012లో అందుబాటులోకి వచ్చింది. అదే సంవత్సరం ఎయిర్ ఇండియా సింగపూర్‌కు మొట్టమొదటి అంతర్జాతీయ సర్వీసు ప్రారంభించడంతో విశాఖ గ్లోబల్ ఏవియేషన్ మ్యాప్‌లో నిలిచింది. ఈ క్రమంలో విశాఖ ఎయిర్ పోర్ట్ నుంచి షెడ్యూల్ విమానాలను నిలిపేస్తున్నట్లు పౌరవిమానయానశాఖ ఇప్పటికే ప్రకటించింది. 30 సంవత్సరాల పాటు వైజాగ్ విమానాశ్రయం నుంచి (ఐఎన్ఎస్ డేగ) సివిల్ ఎన్‌క్లేవ్ నుంచి షెడ్యూల్డ్ కమర్షియల్ విమానాల రాకపోకలను నిలిపేస్తున్నట్లు పేర్కొంది. జాతీయ అత్యవసర పరిస్థితుల్లో ఈ నిబంధనకు మినహాయింపు ఉంటుందని తెలిపింది. భారతీయ వాయుసేన, సాయుధ దళాలు, పోలీసు విమానాలు, ప్రభుత్వ అతిథులు రాకపోకలు సాగించే విమానాలు, లీజ్, వీఐపి ఎయిర్‌క్రాఫ్ట్‌లు ఇక్కడి నుంచి నడుస్తాయని పౌరవిమానయానశాఖ పేర్కొంది. నాన్‌షెడ్యూల్డ్ వాణిజ్య కార్యకలాపాలూ కొనసాగుతాయని తెలిపింది. ఇప్పటి వరకు విశాఖ విమానాశ్రయానికి ఉన్న అంతర్జాతీయ ట్రావెల్‌కోడ్ విటిజెడ్ సోమవారం (ఆగస్టు 17) అర్ధరాత్రి 00:01 గంటల నుంచి అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి బదిలీ అవుతుందని కేంద్రం వెల్లడించింది.

# గుంటూరు మిర్చి 'ఘాటు' ఏదీ?

>> **నాణ్యతలో చిన్న లోపం.. మార్కెట్‌లో భారీ దెబ్బ:**

గుంటూరు మిర్చికి దేశీయంగానే కాకుండా విదేశీ మార్కెట్లలోనూ ప్రత్యేక గుర్తింపు ఉంది. గుంటూరు ప్రాంతం మిర్చి ఉత్పత్తి, వ్యాపారానికి ప్రధాన కేంద్రంగా కొనసాగుతోంది. గుంటూరు సన్నం మిర్చికి భౌగోళిక గుర్తింపు కూడా ఉంది. ఆంధ్రప్రదేశ్ దేశ మిర్చి ఉత్పత్తిలో కీలక వాటా కలిగి ఉండగా, గుంటూరు మార్కెట్ అంతర్జాతీయ ధరలపై కూడా ప్రభావం చూపుతోంది. గుంటూరు మిర్చికి దేశీయంగానే కాకుండా విదేశీ మార్కెట్లలోనూ ప్రత్యేక గుర్తింపు ఉంది. గుంటూరు ప్రాంతం మిర్చి ఉత్పత్తి, వ్యాపారానికి ప్రధాన కేంద్రంగా కొనసాగుతోంది. గుంటూరు సన్నం మిర్చికి భౌగోళిక గుర్తింపు కూడా ఉంది. ఆంధ్రప్రదేశ్ దేశ మిర్చి ఉత్పత్తిలో కీలక వాటా కలిగి ఉండగా, గుంటూరు మార్కెట్ అంతర్జాతీయ ధరలపై కూడా ప్రభావం చూపుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఒకటి రెండు సరుకుల్లో నాణ్యతా లోపాలు గుర్తించినా.. దాని ప్రభావం మొత్తం ప్రాంతం నుంచి జరిగే ఎగుమతులపై పడే అవకాశం ఉంది. విదేశీ కొనుగోలుదారుల్లో గుంటూరు మిర్చిపై నమ్మకం దెబ్బతింటే భవిష్యత్తులో అదనపు పరీక్షలు, ఆలస్యాలు, వ్యయాలు పెరగడంతో పాటు ధరలపైనా ప్రభావం పడే ప్రమాదం ఉందని ఎగుమతి వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

**రైతు నుంచి ఎగుమతి వరకు నాణ్యతా గొలుసు:**

మిర్చి నాణ్యత కేవలం ఎగుమతిదారుడి బాధ్యతతో పూర్తయ్యే అంశం కాదు. పొలంలో పురుగుమందుల వినియోగం నుంచి కోత, ఎండబెట్టడం, నిల్వ, రవాణా, గోదాములు, ఎగుమతికి ముందు నమూనా పరీక్షల వరకు ప్రతి దశలోనూ నాణ్యతను కాపాడాల్సి ఉంటుంది. ఇటీవల చైనా నుంచి వచ్చిన అభ్యంతరాల నేపథ్యంలో ప్రమాదకర పురుగుమందుల వినియోగాన్ని నియంత్రించడంతో పాటు రైతులకు అవగాహన కల్పించాలని మిర్చి ఎగుమతిదారుల సంఘాలు ప్రభుత్వాన్ని కోరిన విషయం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది.

**ఇప్పటికైనా మేల్కొనాల్సిందే:**

గుంటూరు మిర్చి పేరు అంతర్జాతీయ మార్కెట్‌లో మరింత బలపడాలంటే నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ లేకుండా వ్యవస్థను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎగుమతికి సిద్ధం చేసిన ప్రతి సరుకును ముందుగానే నాణ్యతా పరీక్షలకు లోబరచడం, తేమను శాస్త్రీయ పద్ధతుల్లో నియంత్రించడం, పురుగుమందుల అవశేషాలపై క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించడం, రైతులకు సురక్షిత సాగుపై అవగాహన కల్పించడం అత్యవసరంగా మారింది.



ఆదివారం గుంటూరులో ఆందోళన చేస్తున్న ఆంధ్రప్రదేశ్ జూనియర్ వైద్యుల సంఘం

# కొనసాగుతున్న జూడాల సమ్మె

>> గ్గత వైద్యులు, జూనియర్ వైద్యులు, ఉన్నత వైద్య విభాగాల శిక్షణ వైద్యులు, జిల్లా వైద్య శిక్షణలోఉన్న వైద్యులు, సీనియర్ వైద్యులు తదితరులు ఆందోళనలో భాగస్వాములు కానున్నట్లు తెలిపింది. జీతభత్యాల సవరణపై గత అనేక నెలలుగా అధికారులకు పలుమార్లు లిఖితపూర్వకంగా విజ్ఞప్తులు, ప్రతినిధిత్వాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు స్పష్టమైన, లిఖితపూర్వకమైన, కాలపరిమితితో కూడిన నిర్ణయం వెలువడలేదని ఆంధ్రప్రదేశ్ జూనియర్ వైద్యుల సంఘం పేర్కొంది. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని జీతభత్యాల సవరణపై స్పష్టమైన, లిఖితపూర్వక, కాలపరిమితితో కూడిన హామీ లేదా నిర్ణయం ఇవ్వాలని కోరింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్య పరిష్కారానికి ముందుకు వస్తే, రోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణాత్మక చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని సంఘం స్పష్టం చేసింది. ఆందోళన కారణంగా ప్రజలకు, రోగులకు కలగబోయే అసౌకర్యంపై తమకు అవగాహన ఉందని, అయితే సమస్య మరింత తీవ్రం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని పేర్కొంది. జీతభత్యాల సవరణపై ప్రభుత్వం తక్షణమే సంతృప్తికరమైన లిఖితపూర్వక నిర్ణయం తీసుకుని, వైద్య సేవలు సాధారణ స్థితికి తిరిగి వచ్చేలా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ జూనియర్ వైద్యుల సంఘం విజ్ఞప్తి చేసింది.

ఈ నేపథ్యంలో సిపిఐ వారికి మద్దతు ప్రకటించింది.వారి సమస్యలు పరిష్కరించాలని సిపిఐ రాష్ట్ర సమితి కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య సిఎం చంద్రబాబుకు లేఖ రాసారు.ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు లేఖ నకలు జతపరిచారు. జూడాల సమ్మెను వారి డిమాండ్లకు అంగీకరించి, ఉపసంహారణ చేయించాలని ఈశ్వరయ్య తన లేఖలో కోరారు.మన పొరుగు తెలుగు రాష్ట్రమైన తెలంగాణతో పోలిస్తే ఎపిలో జూనియర్ డాక్టర్లకు ఇస్తున్న స్టైపెండ్ చాలా తక్కువగా ఉంది. స్టైపెండ్ పెంపుదలతోపాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు, రక్షణ చర్యలు, మెరుగైన పని వాతావరణం కల్పించాలని జూడాలు కోరుతున్నారు. అతి భారీ పని గంటలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు ఇతోధికంగా వైద్య సేవలందిస్తున్న జూనియర్ డాక్టర్ల శ్రమను, ఒత్తిడిని గుర్తించి తగిన విధంగా వారికి స్టైపెండ్ పెంచాలి. జూడాలు గత 5 రోజులుగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో సోమవారం నుండి అత్యవసర సేవలను బహిష్కరిస్తామంటూ ప్రకటించారు. జూనియర్ డాక్టర్లు చేసిన ప్రకటనతో రోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఫలితంగా ప్రభుత్వ వైద్యరంగం ఒడిదుడుకులు ఎదుర్కొనే ప్రమాదం దాపురించిందని ఈశ్వరయ్య పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, జూనియర్ డాక్టర్లతో చర్చలు జరిపి, వారి సమస్యల పరిష్కారం కోసం తగు చర్యలు చేపట్టవలసిందిగా కోరారు.

# ఆత్మగౌరవాన్ని దెబ్బతీయొద్దు

>> ఉపాధ్యాయులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. విజయవాడ నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి ప్రారంభమైన ఈ భారీ ప్రదర్శన, అంబేద్కర్ స్మృతివనం వరకు కొనసాగింది. "వైసిపి విష ప్రచారం నశించాల్లి", "టీచర్ల ఆత్మగౌరవాన్ని కించపరచొద్దు" అంటూ నినాదాలతో హోరెత్తించారు. రాత్రింబవళ్లు కష్టపడి చదివి ప్రతిభతో ఉద్యోగాలు సాధిస్తే, తమను వైఎస్సార్సీపీ నేతలు అవమానపరుస్తున్నారని ఉపాధ్యాయులు మండిపడ్డారు. డిఎస్సీ నియామకాలపై ఆ పార్టీ ఉద్దేశపూర్వకంగా చేస్తున్న విష ప్రచారం వల్ల ఎన్నో యేళ్ల నిరీక్షణ తర్వాత జాబ్ సాధించామన్న కనీస సంతోషం కూడా తమకు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడితే ఇకపై సహించేది లేదని వారు తేల్చిచెప్పారు. ఈ సందర్భంగా పలు వురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ యేళ్ల తరబడి కష్టపడి చదివి, మెరిట్ ఆధారంగానే ఉద్యోగాలు సాధించామని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ప్రభుత్వ ఉద్యోగం సాధించామన్న కనీస సంతోషాన్ని వైసిపి నేతలు తమ విష ప్రచారంతో దూరం చేస్తున్నారని వాపోయారు. తమ ప్రతిభను శంకించి, నియామకాలపై బురద జల్లడం వల్ల తాము, తమ కుటుంబ సభ్యులు మానసికంగా కుంగిపోతున్నామని తెలిపారు. ఇప్పటికే కర్నూలు, తిరుపతితో పాటు పలు జిల్లాల్లో ఇలాంటి నిరసన ర్యాలీలు నిర్వహించామని, అయినా వైసిపి నేతల తీరు మారకపోవడం దారుణమన్నారు. తమపై విమర్శలు చేస్తున్న వారికి సద్బుద్ధి ప్రసాదించాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి తమ నిరసనను నిర్వహించారు. తమపై విష ప్రచారం తక్షణమే ఆపాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు.



## సినీ నిర్మాత బండ్ల గణేశ్ కుమార్తె వివాహానికి హాజరైన సిఎం చంద్రబాబు

**విజయవాడ.ఆగస్టు 16,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ సినీ నిర్మాత బండ్ల గణేశ్ కుమార్తె జనని వివాహం పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సూర్య తేజతో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ శుభకార్యానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయన సతీమణి భువనేశ్వరి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. సిఎం చంద్రబాబు, భువనేశ్వరిల చేతుల మీదుగా వరుడు సూర్య తేజ మంగళసూత్రం అందుకుని వధువు జననికి తాళి కట్టారు. తన కుమార్తె వివాహానికి హాజరైన చంద్రబాబును చూసి బండ్ల గణేష్ భావోద్వేగానికి గురయ్యారు.ఎపి నుంచి పలువురు రాజకీయ, వాణిజ్య ప్రముఖులు ఈ వివాహానికి హాజరయ్యారు.

**వారం - వర్జ్యం**

17-08-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, శుక్లపక్షం, మఖకార్తె
తి.పంచమి సా.5.05 న.చిత్త తె.4.59
వ.మ.12.14-మ.1.55
దు1. మ.12.36-మ.1.27
దు2. మ.3.08-మ.3.59
రాహు ఉ.7.30-ఉ.9.00
శుభ ఉ.7.00-ఉ.8.00

**వార్తాఫలం**

**మేషం :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. ఏ పనిని చేపట్టినా చికాకు కలిగి స్తాయి. వాహన సౌఖ్యంకలదు.

**వృషభం :** ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం దీర్ఘకాలిక ఋణాలు తీరి ఊపిరి పీల్చు కుంటారు. నూతన ఒప్పందాలు కుదురు తాయి.

**మిథునం :** సాంకేతిక పరిశోధన విషయాలపై ఆసక్తి చూపుతారు. వ్యాపారాలలో స్వల్ప మార్పులు చోటు చేసుకుంటారు.

**కర్కాటకం :** చర్చాగోష్ఠులలో పాల్గొంటారు. పనులు మందకొడిగా సాగుతాయి. నూతన ఒప్పందాలు చేసుకుంటారు.

**సింహం :** దూరప్రాంతాల నుండి ముఖ్య సమాచారం అందుకుంటారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు.

**కన్య :** వివాదాలకు దూరంగా ఉండండి. ఉద్యోగులకు స్థాన చలనం ఉంటుంది. సోదరుల కలయిక. వాహన సౌఖ్యం.

**తుల :** ప్రముఖులతో పరిచయాలు ఏర్పడు తాయి. ఆస్తి వివాదాలు, కోర్ట్ కేసులు పరిష్కార దశకు చేరుకుంటాయి. వస్త్ర లాభం.

**వృశ్చికం :** స్త్రీలతో వివాదాలు ఏర్పడకుండా జాగ్రత్తలు పాటించండి. ఊహించని విధముగా ఉద్యోగావకాశాలు పొందుతారు.

**ధనుస్సు :** జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. స్వల్ప ధనలాభం. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**మకరం :** ఋణబాధల నుండి విముక్తి పొందుతారు. మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. సోదరుల కలయిక.

**కుంభం :** మీలోని సృజనాత్మకత వెలుగు చూస్తుంది. వ్యాపారాభివృద్ధి పట్ల దృష్టి సారిస్తారు. ఇంటా బయటా ప్రోత్సాహం.

**మీనం :** పూర్తిగా ఆశలు వదులుకొన్న కార్య క్రమాలను సానుకూలము చేసుకోవటానికి కృషి చేస్తారు. వాహన సౌఖ్యం కలదు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# పెళ్లికి వెళ్లి తిరిగివస్తూ..

- కాల్వలోకి దూసుకెళ్లిన కారు
- ఆరుగురు విద్యార్థులు గల్లంతు
- ప్రాణాలతో ఒకరు క్షేమం
- నలుగురి మృతదేహాలు లభ్యం
- మరొకరి కోసం ముమ్మర గాలింపు
- పశ్చిమగోదావరి జిల్లాలో విషాద ఘటన

**ఏలూరు, ఆగస్టు 16 పశ్చిమ గోదావరి ప్రభాతవార్త బ్యూరో:** ఇరగవరం మండలం ఐతంపూడి లాకుల సమీపంలో ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అదుపుతప్పిన కారు పెరవలి-నరసాపురం కాలువలోకి దూసుకెళ్లడంతో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు గల్లంతు కాగా వీరిలో ఒకరు క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నారు. వీరంతా శనివారం రాత్రి పెరవలిలో జరిగిన వివాహ వేడుకకు హాజరయ్యారు. తిరిగి అర్ధరాత్రి దాటిన తర్వాత వెళుతుండగా ఓగిడి నుంచి ఐతంపూడి వెళ్లే దారిలో కారు అదుపు తప్పి కాల్వలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం మోరికి చెందిన పోతుల లక్ష్మి భానువికాస్ అభిరామ్ (18), నాగిరెడ్డి దుశ్వంత్ సాయి (18), చెరుకూరి రాజారాం చరణ్ (16), అమలాపురం మండలం చాకూరుకి చెందిన నాగాబత్తుల సాయిసూర్యతేజ (19), పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం చింతపర్రు గ్రామానికి చెందిన వీరమల్లు సాయి వెంకటకిరణ్ (18) ఐదుగురు గల్లంతు కాగా ఆచంట మండలం వల్లూరు గ్రామానికి చెందిన మట్టా సంతోష్ ప్రాణాలతో బయట పడ్డాడు. ఆదివారం సాయంత్రానికి గాలింపు చర్యల్లో భాగంగా ఐతంపూడి లాకుల వద్ద భానువికాస్, మరికొంతదూరంలో సాయివెంకటకిరణ్, నెగ్గిపూడి లాకుల వద్ద దుశ్వంత్ సాయి, తేజసాయిసూర్య మృతదేహాలు లభ్యమయ్యాయి. ఓగిడికి చెందిన మండే గణేష్ తనకు వరుసకు సోదరుడయ్యే జోగా వెంకటదుర్గాప్రసాద్ వివాహానికి తన స్నేహితులను పిలిచాడు. పెరవలిలోని పెళ్లి అనంతరం ఇరగవరం మండలం ఓగిడి గ్రామంలోని పెళ్లికొడుకు నివాసానికి వెళ్లినవారు, అర్ధరాత్రి దాటిన తర్వాత కారులో తిరుగు ప్రయాణమయ్యారు. ఓగిడి నుంచి ఐతంపూడి వైపు వస్తుండగా లాకుల సమీపంలోని మలుపువద్ద కారు అదుపుతప్పి పెరవలి-నరసాపురం కాలువలోకి దూసుకెళ్లింది. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. మట్టా సంతోష్‌ను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు.

**నలుగురి మృతదేహాలు లభ్యం:**

సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టాయి. గజ ఈతగాళ్ల సహాయంతో కాలువలో ముమ్మరంగా గాలింపు నిర్వహించారు. ఆదివారం సాయంత్రానికి పోతుల లక్ష్మీభాను వికాస్ అభిరామ్, నాగిరెడ్డి దుశ్వంత్ సాయి, వీరమల్లు సాయి వెంకటకిరణ్, నాగాబత్తుల సాయి సూర్యతేజ మృతదేహాలను వెలికితీశారు. తోటి విద్యార్థులు మృతి చెందడంతో నరసాపురంలోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలతో పాటు విద్యార్థుల స్వగ్రామాల్లో తీవ్ర విషాదం నెలకొంది. మృతుల కుటుంబ సభ్యుల రోదనలతో సంఘటనా ప్రాంతం విషాదభరితంగా మారింది. వివాహ వేడుకకు వెళ్లి సంతోషంగా తిరిగి వస్తున్న యువకుల ప్రయాణం విషాదంగా మారడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

**ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యేలు:**

ప్రమాద సమాచారం తెలుసుకున్న తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. గల్లంతైన విద్యార్థుల కోసం గాలింపు చర్యలను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ బాధిత కుటుంబాలను పరామర్శించారు. తాడేపల్లిగూడెం డిఎస్పీ యు.రవిచంద్ర, తణుకు రూరల్ సిఐ డి.వెంకటేశ్వర రావు, తణుకు టౌన్ సిఐ జెవి రమణ తదితర అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి సహాయక చర్యలను పర్యవేక్షించారు. మృతదేహాలను తణుకులోని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బిసిల సంరక్షణకు ప్రత్యేక చట్టం

>> చొప్పున యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకువస్తున్నాం. అభివృద్ధితో పాటు సంక్షేమం, సుపరిపాలనను అందించేలా కూటమి ప్రభుత్వం పని చేస్తోంది. పేదలు భోజనానికి ఇబ్బందులు పడకుండా రూ.5 అన్నా క్యాంటీన్లలో భోజనం అందిస్తున్నాం. కొందరు వ్యక్తులు దీనికీ అడ్డం పడి అన్నా క్యాంటీన్లను ఎత్తేశారు. విద్య అందరికీ అందాలన్న లక్ష్యంతో తల్లికి వందనం పథకం కింద ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ.. వారి తల్లుల ఖాతాలో డబ్బులు జమ చేస్తున్నాం. సంక్షేమంతో పాటు అభివృద్ధిపైనా శ్రద్ధ పెడుతున్నాం. గత పాలనలో రోడ్లన్నీ గుంతలే. మన రాష్ట్రాన్ని చూసి ఎగతాళి చేశారు. ఇప్పుడు రోడ్లకు మరమ్మత్తులు చేశాం. పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించాం... రూ.12 లక్షల కోట్ల మేర పెట్టుబడులు ఇప్పటికే గ్రౌండ్ అయ్యాయి. యువతకు ఉద్యోగాలు వచ్చేలా చేస్తున్నాం. అభివృద్ధి-ఉపాధి కల్పించేలా పారిశ్రామికాభివృద్ధి చేస్తున్నాం. రోడ్లు, పోర్టులు, విమానాశ్రయాలు కూడా రాష్ట్రంలో నిర్మించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నాం. గత పాలకుల నిర్వాకం వల్ల ఆర్థిక ఇబ్బందులున్నా.. గడచిన రెండేళ్లలో పేదలను ఆదుకునేందుకు రూ.1.50 లక్షల కోట్లు సంక్షేమం చేశాం. అభివృద్ధి కోసం 2 యేళ్లల్లో రూ.1.34 లక్షల కోట్లు ఖర్చుచేశాం. రోడ్లు సహా ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నాం" అని సిఎం వివరించారు.

# గౌతు లచ్చన్న స్ఫూర్తితో కూటమి పాలన



ఆదివారం సర్దార్ గౌతు లచ్చన్న రాష్ట్ర స్థాయి జయంతోత్సవంలో ఆయన విగ్రహానికి నివాళి అర్పిస్తున్న రాష్ట్రమంత్రులు, ప్రజాప్రతినిధులు

**విజయవాడ, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** సర్దార్ గౌతు లచ్చన్న స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని, బిసిలను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అన్నింటా ముందంజలో నిలబెట్టేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని మంత్రులు సవిత, అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, అచ్చెన్నాయుడు తెలిపారు. గౌతు లచ్చన్న పోరాట స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయాలన్న ఉద్దేశంతోనే ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నామన్నారు. బిసిలను గత ప్రభుత్వం లో వేధిస్తే, సిఎం చంద్రబాబు అక్కున చేర్చుకున్నారన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న రాష్ట్ర స్థాయి జయంత్యోత్సవాన్ని బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు సవిత, అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, అచ్చెన్నాయుడు తొలుత గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మంత్రులు ప్రసంగించారు. గౌతు లచ్చన్న 117వ జయంతిని జరుపుకోవడం ఆనందంగా ఉందని మంత్రి సవిత తెలిపారు. 1909 ఆగస్టు 16న గౌతు లచ్చన్న శ్రీకాకుళం జిల్లా బారువా గ్రామంలో సామాన్య గౌడు కుటుంబంలో జన్మించారన్నారు. తన 21వ యేటనే గాంధీజీ పిలుపు మేరకు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. ఆ ఉద్యమంలో గౌతు లచ్చన్న వెన్నుచూపని పోరాటం చేశారని, జైలు శిక్షలు సైతం అనుభవించిన యోధుడని కొనియాడారు.

అణగారిన వర్గాలు, బీసీలు, రైతులు, కార్మికుల హక్కుల కోసం తుది శ్వాస విడిచిపెట్టే వరకూ పోరాటం చేశారన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా బిసిలు, రైతులు, శ్రామికుల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. గౌతు లచ్చన్న ఆశయాల సాధనే లక్ష్యంగా సిఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారన్నారు. అన్న ఎన్టీఆర్ బిసిల అభ్యున్నతి కోసం పార్టీని స్థాపించారన్నారు. బిసిలకు ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యమిస్తూ పాలన సాగిస్తున్నాయన్నారు. విద్యతోనే బిసిలు అభివృద్ధి చెందుతారని నమ్మిన వ్యక్తి సిఎం చంద్రబాబు అని అన్నారు. అందుకే, రాష్ట్ర వ్యాప్తంగా బిసి గురుకులాలను సిఎం చంద్రబాబు ఏర్పాటు చేస్తున్నారన్నారు. గౌతు లచ్చన్న జయంతిని జరగకుండా గత పార్టీ నేత తన హయాంలో అడ్డంకులు సృష్టించారన్నారు.



# వెలిగొండ ప్రాజెక్టు ట్రయల్ రన్‌కు తొలగుతున్న అడ్డంకి

- చివరి దశకు చేరిన టిబిఎం తొలగింపు
- 22న ప్రాజెక్టు ట్రయల్ రన్‌కు సన్నద్ధం

**మార్కాపురం, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నీటి విడుదల ట్రయల్ రన్‌కు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు సాగిస్తుంది. 1996 మార్చి 5వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. ప్రాజెక్టుకు సంబంధించిన అటవీ అనుమతులు తీసుకొచ్చి తొలిత కోర్ డ్రిల్లింగ్ పనులు చేపట్టారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి మినహా ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు వెలిగొండ నిర్మాణం పట్ల పెద్దగా పట్టించుకోలేదు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబు వెలుగొండ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించారు. అనేక పర్యాయాలు అటు అధికారులతో ఇటు గుత్తేదారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ప్రాజెక్టు పనులు వేగవంతంపై మార్గనిర్దేశం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో ఈ ఏడాదిలోపే వెలుగొండ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో అసంపూర్తిగా ఉన్న పనులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సాధించింది. భారీ నీరు పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెలుగొండ ప్రాజెక్టు పలు పర్యాయాలు సందర్శించి పనులు వేగవంతం పై సమీక్షించారు. 90శాతం పనులు పూర్తికావడంతో ఆగస్టులోపే మీరు ఇవ్వాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర ప్రయత్నాల సాగిస్తుంది. శ్రీశైలం ద్యాంకు వరద నీరు పెద్ద ఎత్తున చేరడంతో ఈ ఏడాదిలోని వెలుగొండ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తుంది. నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పంపిణీ చేస్తూ ఆ గ్రామాల నుంచి తరలించే ప్రయత్నాలకు శ్రీకారం చుట్టింది. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పూర్తిస్థాయిలో చెల్లిస్తేనే తాము ఊరు వదిలి వెళ్తామంటూ నిర్వాసితులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేస్తున్న వారికి నచ్చజెప్పి బయటికి పంపేందుకు ప్రభుత్వం ముమ్మరం ప్రయత్నాల సాగిస్తుంది. నిర్వాసి తుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్న ఎట్టి పరిస్థితుల్లో నెలాఖలోపు నీటిని విడుదల చేసి తీరాలన్న కృత నిశ్చయంతో ప్రభుత్వం ముందుకు సాగుతుంది. అసం పూర్తిగా ఉన్న లైనింగ్, వాల్ పనులను అధికారులు శరవేగంతో పూర్తి చేస్తున్నారు. ఈ క్రమంలోనే రెండో సొరంగం తవ్వేందుకు వినియోగించిన టీబీఎం (టన్నెల్ బోరింగ్ యంత్రం) తొలగింపు పనులు చివరి దశకు చేరుకున్నాయి. టివిఎం విడిభాగాలను పూర్తిస్థాయిలో తొలగించి సొరంగం నుంచి బయటకు తీసుకొచ్చే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. 18.89 కిలోమీటర్ల మేర రెండో సొరంగం తవ్వేందుకు ఈ యంత్రంతో 2009లో పనులు ప్రారంభించారు. 11.84 కిలోమీటర్ల మేర తవ్వకం పనులు 2019 వరకు కొనసాగాయి. ఆ తర్వాత యంత్రంలో తరచూ సాంకే తిక సమస్యలు తలెత్తడంతో దీంతో పనులు నిలిపివేశా రు. ఆ తర్వాత 2వ సొరంగ నిర్మాణ పనులను మాన్యు వల్ ద్వారా పూర్తిచేశారు. సొరంగంలో అక్కడక్కడ పెద్ద రంధ్రాలు వేసి మాన్యువల్ ద్వారా సొరంగ నిర్మాణం పనులు పూర్తిచేశారు. ఒకవైపు నిర్వాసితులకు పరిహారం పంపిణీ చేస్తూనే మరోవైపు ప్రాజెక్టు నీటి విడుదలకు ప్రభుత్వం ముమ్మర ప్రయత్నాలు కొనసాగిస్తుంది. సహజసిద్ధంగా బ్లాస్టింగ్ చేసి కాంక్రీట్ పూతతో మిగతా పనులు చేపట్టారు. ఇవి దాదాపు పూర్తి కాగా, ఈ నెల 22న ట్రయల్ రన్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సొరంగంలో చిక్కుకుపోయిన టిబిఎం యంత్రం బయటకు తీయడం సవాల్ గా మారింది. 180 మీటర్ల పొడవు,1500 టన్నులకుపైగా బరువు ఉన్న ఈ యంత్రాన్ని బయటకు తీసుకురావా లంటే ముక్కలుగా చేసి తరలించడం తప్ప మరో మార్గం లేదు. ఈ పనిని మే 29న ప్రత్యేక నిపుణులకు అప్ప గించారు. వారు యంత్రం వెనుక వైపు నుంచి ఒక్కో భాగాన్ని వెల్డింగ్‌తో తొలగించడం ప్రారంభించారు. అనంతరం ఆ భాగాలను టిప్పర్‌లో బయటకు తీసుకొ స్తున్నారు. 90శాతం పనులు పూర్తయ్యాయి. చివరగా టిబిఎంలో ఉండే కట్టర్ హెడ్‌ను తొలగించాల్సి ఉంది. ఇందుకోసం డైమండ్ కటింగ్‌లో నైపుణ్యం ఉన్న కార్మికు లను తీసుకొచ్చారు. వారంలోగా పనులన్నీ పూర్తిచేసి నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా అధికారులు ముమ్మర చర్యలు చేపట్టారు. అన్ని పనులు పూర్తి చేసి ఈనెల 22వ తేదీ ప్రాజెక్టు ట్రయల్ రన్‌కు సిద్ధం చేస్తున్నారు. ట్రయల్ రన్ ట్రయల్ రన్ విజయవంతం కావడం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా నెలాఖరులోపు పూలు సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేయనున్నారు.

## 'రైతులు, కార్మికుల హక్కుల కోసం గౌతు లచ్చన్న తుది శ్వాస వరకూ పోరాడారు'



**విజయవాడ, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** బడుగు, బలహీన వర్గాలు, రైతులు, కార్మికుల హక్కుల కోసం గౌతు లచ్చన్న తుది శ్వాస విడిచే వరకూ పోరాడారని మంత్రి ఎస్.సవిత తెలిపారు ఆయన స్ఫూర్తిని భావితరా లకు తెలియజేయా లన్న సంకల్పంతోనే గౌతు లచ్చన్న జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నామన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మంత్రి సవిత పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, 1909 ఆగస్టు 16న గౌతు లచ్చన్న శ్రీకాకుళం జిల్లా బారువా గ్రామంలో సామాన్య గౌడు కుటుంబంలో జన్మించారన్నారు. గాంధీ పిలుపు మేరకు స్వాతంత్ర్య ఉద్యమం పాల్గొన్న గౌతు లచ్చన్న, ఆనాటి ఆంగ్లేయ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించారన్నారు. స్వాతంత్ర్య అనంతరం బడుగు, బలహీన వర్గాలు, రైతులు, కార్మికుల హక్కుల సాధనకు పెద్ద ఎత్తున ఉద్యమించారన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా బిసిలు, ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి విశేష కృషి చేశారన్నారు. వెనుబడిన వర్గాల అభ్యున్నతికి గౌతు లచ్చన్న చేసిన సేవలు భావితరాలకు తెలియజే యాలన్న సంకల్పంతో ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తూ గతేడాది కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందన్నారు. గౌతు లచ్చన్న పోరాట స్ఫూర్తి, ప్రజాసేవ, దేశభక్తి నేటి తరం యువతకు ఎంతో ఆదర్శమని మంత్ర సవిత కొనియాడారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని వాజ్‌పేయికి సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ నివాళి

**విజయవాడ, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** భారత దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా వేర్వేరు పోస్టులో సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ నివాళి అర్పించారు. దేశ ఆర్థిక, సాంకేతిక, రక్షణ రంగాల్లో ఆయనది కీలక పాత్ర అని ప్రశంసించారు. వాజ్‌పేయి దేశానికి అందించిన సేవలను స్మరించుకుంటూ ఆ మహనీయుని స్మృతికి నివాళి అర్పిస్తున్నట్లు సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ తమతమ పోస్టులో తెలిపారు. వాజ్‌పేయి సేవలను కొనియాడారు. భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి నివాళి అర్పిస్తున్నామన్నారు. దేశం ఆర్థికంగా, సాంకేతికంగా, రక్షణ పరంగా అభివృద్ధి చెందడంలో వాజ్‌పేయి కీలకపాత్ర పోషించారని శ్లాఘించారు. దేశ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. భారతరత్న వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా దేశానికి వారు అందించిన సేవలను స్మరించుకుందామని పేర్కొన్నారు. భారత రాజకీయాల్లో సౌమ్యుడిగా, గొప్ప వక్తగా పేరుగాంచిన వాజ్‌పేయి, దేశ ప్రగతికి వేసిన బాటలను ఈ తరం గుర్తుంచుకోవాలని తమ సందేశం ద్వారా పిలుపునిచ్చారు.

## టెట్ పాసైన వారికి గుడ్‌న్యూస్

### 6,534 విద్యావలంటీర్ ఉద్యోగాలకు నోటిఫికేషన్

**విజయవాడ, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనను మరింత మెరుగుపరిచేందుకు పాఠశాల విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల (విద్యా వాలంటీర్లు) భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నియామకాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను కొంతవరకు అధిగమించి విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు చర్యలు చేపట్టనున్నారు. పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం మొత్తం 6,534 విద్యా వాలంటీర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిలో 3,597 సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు, 2,937 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయి. ఎంపికైన అభ్యర్థులకు పోస్టును బట్టి నెలవారీ గౌరవ వేతనం చెల్లించనున్నారు. ఎస్‌జిటి పోస్టులకు నెలకు రూ.10,000, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు నెలకు రూ.12,500 చొప్పున స్టైపెండ్ చెల్లిస్తారు. ఈ నియామకాలు రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు కాకుండా అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లుగా సేవలు అందించే విధంగా ఉంటాయి. తగిన విద్యార్హతలు, ఇతర అర్హతలు ఉన్న అభ్యర్థులు ఆగస్టు 21వ తేదీలోగా తమ దరఖాస్తులను సంబంధిత మండల విద్యాశాఖాధికారి కార్యాలయాల్లో సమర్పించాల్సి ఉంటుంది. అభ్యర్థుల ఎంపిక మెరిట్ ఆధారంగా చేపట్టనున్నట్లు నోటిఫికేషన్‌లో విద్యాశాఖ స్పష్టం చేసింది.

**సెప్టెంబర్ 1 నుంచే విధుల్లోకి.. నో ఎగ్జామ్:** మెరిట్ ఆధారంగా ఎంపికైన అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు ప్రస్తుత విద్యా సంవత్సరంలో పాఠశాలల్లో సేవలు అందించాల్సి ఉంటుంది. సెప్టెంబర్ 1 నుంచి ఏప్రిల్ 30 వరకు వారు విధులు నిర్వహించనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ నియామకాలను చేపడుతున్నట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది. పోస్టుల వారీగా విద్యార్హతలు, ఎంపిక విధానం, దరఖాస్తు ఫార్మాట్ తదితర పూర్తి వివరాలను అభ్యర్థులు సంబంధిత అధికారుల నుంచి తెలుసుకోవాలి.


**NOTICE** MAHADHAN

In order to make the Indian Farmers internationally competitive, Mahadhan Agritech Limited, brings to you the following Imported & Indigenous 100% Water Soluble Mixture of Fertilisers as per order dated 24.10.2015, issued by Ministry of Agriculture & Farmers Welfare, Govt. of India, New Delhi.

| Sr.No. | Particulars / Grade | NPK 14-10-28 |
|---|---|---|
| 1 | Moisture percent by weight, maximum | 0.5 |
| 2 | Total Nitrogen percent by weight, minimum | 14 |
| 3 | Total Phosphorous and water soluble phosphorous (as $P_2O_5$) percent by weight, minimum | 10 |
| 4 | Water Soluble Potassium (as $K_2O$) percent by weight, minimum | 28 |
| 5 | Total Chloride per cent by weight, maximum | 1.5 |
| 6 | Matter insoluble in water per cent by weight, maximum | 0.5 |
| 7 | Sodium (as NaCl) per cent by weight, maximum | 0.5 |
| 8 | Lead (as Pb) per cent by weight, maximum | 0.003 |
| 9 | Cadmium (as Cd) per cent by weight, maximum | 0.0025 |
| 10 | Arsenic (as As) per cent by weight, maximum | 0.01 |

Salient Features:
1. 100% Water Soluble
2. Improves Quality and yield of the produce
3. Suitable to use through drip irrigation and foliar application

Packing : Available in 500 gm, 1 Kg, 5 Kg, 10 Kg and 25 Kg Packing
Supply and sales of above Mahadhan WSF grades will be done after 30-35 days.

*Manufactured / Imported & Marketed by -*
MAHADHAN AGRITECH LIMITED
Registered Office : Sai Hira, Survey No. 93, Mundhwa Road, Mundhwa, Pune - 411036.
www.mahadhan.co.in


## ఫారం నెం. VI(ఎ)

(2013వ సంవత్సరము 30 వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్ట పరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014 లో రూల్ 19, సబ్ రూల్ (1) ననుసరించి)

ఆర్వోసి.నెం.507017 /2024(యల్-4) తేది.03-08-2026

### ప్రాథమిక ప్రకటన

ఈ దిగువ షెడ్యూల్ లో చూపబడిన తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం,శింగవరం రెవిన్యూ గ్రామము నందలి భూమి ప్రజాహిత కార్యాలకు అనగా తూర్పు గోదావరిజిల్లాలో నిడదవోలు మండలం శివారు కాల్దరి మరియు నిడదవోలు జంక్షన్ మధ్య ఆర్ ఓ ఆర్ ఫ్లైఓవర్ నిర్మాణం అవసరమై ఉన్నందున కింద చూపిన విధంగా మొత్తం విస్తీర్ణం య37.07 సెంట్లు భూమి అవసరమని శ్రీయుత జిల్లా కలెక్టర్, తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం వారు భావిస్తున్నారు.

### షెడ్యూలు

గ్రామం : శింగవరం మండలం: నిడదవోల

| క్రమ సంఖ్య | సర్వే నెం./స.డి.నెం. | మొత్తం విస్తీర్ణం | సేకరించిన విస్తీర్ణం | వర్గీకరణ | సంబంధిత ఆసామి పేరు పేరు మరియు చిరునామా | సరిహద్దులు ఉత్తరం | పడమర | దక్షిణం | తూర్పు | చెట్లు, కట్టడములు మరియు ఇతరములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 476 | 0.118 | 0.012 | నంజ | ఉప్పులూరి రంగారావు తండ్రి కృష్ణారావు | 477 | 490 | 738 | 475 | |
| 2 | 482 | 0.203 | 0.170 | నంజ | నంబూరి వెంకట ప్రసాద రాజా తండ్రి సత్యనారాయణ రాజా | 481 | 619 | 483 | 481 | |
| 3 | 483 | 1.547 | 0.375 | నంజ | దిలువూరి వెంకట కృష్ణంరాజా తండ్రి చంద్రశేఖరరాజా | 481 482 | 618 | 484 | 480 | |
| 4 | 485 | 0.497 | 0.190 | నంజ | అల్లూరి కాంతి పావని భర్త వంశీమోహనరాజా | 484 | 487 | 487 | 486 | |
| 5 | 486 | 0.337 | 0.240 | నంజ | బొల్లం ముత్యాలు తండ్రి నాగేశ్వరరావు | 485 483 | 485 | 487 488 | 489 | |
| 6 | 488 | 0.389 | 0.200 | నంజ | కామన దీప్తి భర్త సురేశ్ | 486 | 487 | 491 | 489 | |
| 7 | 489 | 0.509 | 0.230 | నంజ | కారింకి సరస్వతి భర్త వెంకట్రావు | 483 | 486 488 | 491 | 490 478 | |
| 8 | 490 | 0.144 | 0.130 | నంజ | కామన దీప్తి భర్త సురేశ్ | 489 | 489 | 491 | 476 477 478 | |
| 9 | 491 | 3.253 | 0.760 | నంజ | ముదునూరి ఈశ్వర్ అజయ్ వర్మ తండ్రి మురళి కృష్ణం రాజా | 487 488 etc | 503 | 500 | 492 | |
| 10 | 492 | 1.015 | 0.092 | నంజ | ముదునూరి శింగ కళ్యాణి భర్త మురళి కృష్ణంరాజా | 475 | 491 | 499 | 497 493 | |
| 11 | 497 | 2.007 | 0.380 | నంజ | సంకు నాగమణి భర్త వెంకట రామ సుబ్బారాయుడు | 493 | 492 499 | 496 | 493 | కొబ్బరి చెట్లు -6 తాటి చెట్లు -1 |
| 12 | 498 | 1.368 | 0.630 | నంజ | బొడ్డు శ్రావణి భర్త రాకేష్ | 499 500 | 501 | 496 | 497 | |
| 13 | 499 | 0.509 | 0.350 | నంజ | గుత్తుకొండ వెంకటలక్ష్మి భర్త రామారావు | 492 | 500 | 498 | 497 | |
| 14 | 500 | 2.489 | 0.390 | నంజ | గుత్తికొండ వెంకట నరసింహారావు తండ్రి రామారావు | 491 | 503 | 501 502 | 499 | |
| 15 | 506 | 0.659 | 0.040 | నంజ | ప్రత్తిపాటి వీర్రాజా తండ్రి వెంకట్రావు | 496 | 505 | 610 | 507 | |
| 16 | 507 | 0.124 | 0.065 | నంజ | బొడ్డు శ్రావణి భర్త రాకేష్ | 496 | 506 | 610 | 509 | |
| 17 | 509 | 0.446 | 0.390 | నంజ | మద్దాల రామకృష్ణ తండ్రి బాపిరాజు | 508 | 507 | 610 | 511 | తాటి చెట్లు-3 |
| 18 | 511 | 0.578 | 0.460 | నంజ | రావమళ్ళ రంగాప్రసాద్ తండ్రి వెంకన్న | 510 | 509 | 610 | 512 | తాటి చెట్లు-4 |
| 19 | 512 | 0.496 | 0.180 | నంజ | గుత్తుకొండ వెంకటలక్ష్మి భర్త రామారావు | 495 | 511 | 609 | 513 | తాటి చెట్లు-5 |
| 20 | 513 | 0.506 | 0.030 | నంజ | గుంపర్తి లక్ష్మి సూర్యకాంత మాణిక్యాంబ భర్త సత్యనారాయణ | 495 | 512 | 609 | 514 | తాటి చెట్లు-1 |
| 21 | 612 | 2.405 | 0.060 | నంజ | పెన్మెత్స పాండు రంగ సత్య సోమరాజా తండ్రి జోగిరాజా | 609 | 613 | 815 | 816 | |
| 22 | 702 | 2.422 | 0.530 | నంజ | శీమకుర్తి కోటేశ్వరరావు తండ్రి వెంకట స్వామి | 1555 | 692 703 | 755 756 | 700 | మామిడి చెట్లు-1, బోరు బావి -1 |
| 23 | 738 | 0.09 | 0.024 | నంజ | గంటా వివేక్ తండ్రి వీర నాగ మురళి కృష్ణ | 476 | 490 | 491 | 475 | |
| 24 | 751 | 3.428 | 0.360 | నంజ | లకంసాని సత్యవతి భర్త అమ్మిరాజా | 700 | 752 | 757 | 621 | కొబ్బరి చెట్లు-1 |
| 25 | 752 | 0.45 | 0.020 | నంజ | దెందుకూరి సూర్యనారాయణ రాజా తండ్రి సీతారామరాజా | 700 | 753 | 751 | 751 | |
| 26 | 753 | 0.467 | 0.080 | నంజ | దెందుకూరి నాగమణి భర్త సత్యనారాయణ రాజా | 700 | 754 | 751 | 752 | |
| 27 | 754 | 1.023 | 0.260 | నంజ | గాదిరాజా నాగ వెంకట సుబ్బసురేష్ వర్మ తండ్రి సర్రాజా | 700 | 755 756 | 751 | 753 | |
| 28 | 755 | 0.434 | 0.010 | నంజ | కోలమూరి రాంబాబు తండ్రి శ్రీరాములు | 700 | 702 | 756 | 754 | |
| 29 | 756 | 0.316 | 0.190 | నంజ | వేదురుపాకల నాగేశ్వరరావు తండ్రి కృష్ణమూర్తి | 755 | 702 | 703 | 754 | |
| 30 | 757 | 2.524 | 0.580 | నంజ | లకంసాని వెంకట సురేష్ తండ్రి అమ్మిరాజా | 751 | 750 | 758 | 621 | |
| 31 | 758 | 1.999 | 0.570 | నంజ | ఇందుకూరి ధాత్రి భర్త రామరాజా | 757 | 750 | 759 | 621 | |
| 32 | 759 | 3.581 | 0.150 | నంజ | పెన్మెత్స : A.R.P.S.B. సోమరాజా తండ్రి సుబ్బరాజా | 758 | 750 | 760 | 621 617 | కొబ్బరి చెట్లు-1, అరటి చెట్లు-4, మామిడి చెట్లు -1 |
| 33 | 816 | 2.356 | 1.100 | నంజ | పెన్మెత్స జోగి వర్మ తండ్రి జోగిరాజా | 609 | 612 | 815 | 817 | |
| 34 | 817 | 1.079 | 0.600 | నంజ | అడ్డాల నాగ వెంకట శివ రామకృష్ణంరాజా తండ్రి సీతారామరాజా | 609 | 816 | 815 823 | 822 818 | |
| 35 | 821 | 3.651 | 0.740 | నంజ | ముదునూరి విజయలక్ష్మి భర్త సూర్య చంద్రరాజా | 607 | 820 822 832 | 833 | 834 | |
| 36 | 822 | 0.965 | 0.330 | నంజ | నసిమండ్ర విజయకుమార్ తండ్రి శాంతారావు | 818 819 | 817 | 823 832 | 821 820 | |
| 37 | 823 | 1.07 | 0.569 | నంజ | ఆత్కూరి సూర్యనారాయణ తండ్రి కృష్ణ | 822 817 | 815 | 824 | 832 | |
| 38 | 831 | 1.009 | 0.350 | నంజ | ముదునూరి కృష్ణవేణి భర్త కృష్ణం రాజా | 832 | 824 | 830 | 821 | |
| 39 | 832 | 1.188 | 0.890 | నంజ | పెన్మెత్స లక్ష్మి దుర్గ భర్త ప్రదీప్ వర్మ | 821 | 822 | 831 | 821 | |
| 40 | 834 | 3.652 | 0.100 | నంజ | ముదునూరి భాస్కర రాజా తండ్రి కృష్ణంరాజా | 607 | 821 | 842 | 835 | |
| 41 | 844 | 2.087 | 0.820 | నంజ | ముదునూరి వెంకట శ్రీనివాసరాజా తండ్రి సూర్యనారాయణరాజా | 843 | 833 | 1032 | 845 | |
| 42 | 1021 | 0.500 | 0.330 | నంజ | అంగర దుర్గాదేవి ప్రవల్లిక వై పార్వతి భర్త శ్రీనివాసు | 1015 | 1031, 1030 | 1028 | 1028 | తాటి చెట్లు-1 |
| 43 | 1025 | 0.05 | 0.010 | నంజ | వంగూరి వెంకట్రావు తండ్రి మునియ్య | 1024 | 1674 | 1026 | 1016 | |
| 44 | 1026 | 0.128 | 0.040 | నంజ | వంగూరి సత్యనారాయణ తండ్రి మునెయ్య | 1025 | 1674, 1027 | 1027 | 1016 | |
| 45 | 1027 | 0.575 | 0.540 | నంజ | కాయల సత్యనారాయణ తండ్రి చంద్రయ్య | 1674 | 1674 | 1550 | 1016 1026 | |
| 46 | 1028 | 0.85 | 0.180 | నంజ | అంగర శ్రీనివాసు తండ్రి చంద్రయ్య | 1015 | 1021 1030 | 1550 | 1674 | |
| 47 | 1031 | 2.11 | 0.010 | నంజ | తిగల అమ్మతాంబ భర్త సూర్యప్రభాకరరావు | 1032 | 1033 | 1035 1030 | 1021 | కొబ్బరి చెట్లు-1, వేప చెట్లు -1 |
| 48 | 1131 | 8.052 | 3.290 | నంజ | గారపాటి శరిష భర్త శ్రీనివాసు | 1550, 1029 | 1128, 1129 | 1176 1175 1174 | 1132 | కొబ్బరి చెట్లు-1 |
| 49 | 1175 | 0.505 | 0.250 | నంజ | యర్రా శివ రామకృష్ణ తండ్రి సూర్యచంద్రరావు | 1131, 1176 | 1177 | 1183 | 1174 | |
| 50 | 1177 | 0.989 | 0.680 | నంజ | వెన్నా వరలక్ష్మి భర్త రామకోటేశ్వరరావు | 1176 | 1179, 1268 | 1181, 1187, 1183 | 1175 | తాటి చెట్లు-3 |
| 51 | 1180 | 0.501 | 0.160 | పుంజ | ఉప్పులూరి రమణి భర్త సూర్యప్రకాశరావు | 1268 | 1221 | 1219 | 1181 | |
| 52 | 1183 | 1.04 | 0.100 | నంజ | ఉప్పులూరి రమణి భర్త సూర్యప్రకాశరావు | 1174, 1175, 1177 | 1187 | 1184, 1185, 1186 | 1164 | |
| 53 | 1187 | 1.42 | 0.430 | నంజ | గోకా వెంకటలక్ష్మిలీల భర్త విజయ్ | 1177 | 1181, 1728 | 1215, 1188 | 1551 | తాటి చెట్లు-4 |
| 54 | 1213 | 3.284 | 1.260 | నంజ | గోవిందవజ్ఝల కాశీ విశ్వనాధ శర్మ తండ్రి సుబ్రహ్మణ్య శాస్త్రి | 1214 | 1288 | 1291, 1292 | 1190 1191 | |
| 55 | 1214 | 4.554 | 2.220 | పుంజ | కేదారిశెట్టి వెంకట లక్ష్మి భర్త కాశీ విశ్వనాధం | 1215 1264 | 1267 | 1213, 1288 | 1189 | కొబ్బరి చెట్లు-3, తాటి చెట్లు-1, వేప చెట్లు -1, బోరు బావి -1 |
| 56 | 1215 | 2.402 | 1.110 | పుంజ | కేదారిసెట్టి సంతోష్ తండ్రి సత్యనారాయణ | 1216, 1217 | 1214 | 1214 | 1188 | |
| 57 | 1216 | 0.579 | 0.040 | నంజ | వంగూరి వెంకట్రావు తండ్రి మునియ్య | 1728, 1218 | 1217, 1219 | 1215 | 1187 | తాటి చెట్లు-4 |
| 58 | 1217 | 0.501 | 0.470 | పుంజ | కాపకాయల స్వామి వివేకానంద తండ్రి వెంకయ్య | 1219 | 1220 | 1215 | 1216 1215 | |
| 59 | 1218 | 0.476 | 0.370 | నంజ | వంగూరి అన్నపూర్ణ భర్త నాగేశ్వరరావు | 1181 | 1219 | 1216 | 1728 | తాటి చెట్లు-4 |
| 60 | 1219 | 1.051 | 0.810 | పుంజ | చింతకుంటల భారతి దేవి భర్త వెంకటేశ్వర్లు | 1180 | 1221, 1220 | 1217 | 1216 1218 | |
| 61 | 1220 | 0.387 | 0.230 | పుంజ | యర్రా రామకృష్ణ తండ్రి వల్లభస్వామి | 1221 | 1215 1263 | 1215 | 1217 | తాటి చెట్లు-2 |
| 62 | 1268 | 0.996 | 0.050 | పుంజ | గంట నాగ రవీంద్ర సతీష్ తండ్రి సత్యనారాయణ | 1179 | 1222, 1221 | 1180 | 1177 1181 | తాటి చెట్లు-3 |
| 63 | 1271 | 1.407 | 0.730 | పుంజ | కట్రెడ్డి సూర్యప్రకాశమ్మ భర్త ఆదినారాయణ | 1272 | 1273, 1274 | 1269 | 1270 | కొబ్బరి చెట్లు-8 |
| 64 | 1272 | 1.696 | 0.030 | పుంజ<br>పుంజ | కట్రెడ్డి సూర్యప్రకాశమ్మ భర్త ఆదినారాయణ<br>సయ్యపురెడ్డి అనంతలక్ష్మి పద్మావతి భర్త కనక దుర్గారావు | 1270 | 1436, 1635 | 1635 | 1280, 1279. | |
| 65 | 1289 | 1.304 | 0.033 | పుంజ | తుట్టగుంట వెంకట సత్య సాయి రామ హనుమరావు శాస్త్రి తండ్రి బుల్లి శక్తిమూర్తి | 1288 | 1287 | 1295 | 1290 | |
| 66 | 1290 | 1.284 | 0.120 | పుంజ | తుట్టగుంట వెంకట స్వరాజ్య లక్ష్మి భర్త చినశక్తి మూర్తి | 1288 | 1289 | 1295 | 1291 | |
| 67 | 1291 | 1.295 | 0.140 | పుంజ | తుట్టగుంట రుక్మిణి భర్త బుల్లి శక్తిమూర్తి | 1213, 1288 | 1290 | 1295 | 1292 | |
| 68 | 1292 | 1.303 | 0.060 | పుంజ | తుట్టగుంట వెంకట స్వరాజ్య లక్ష్మి భర్త చినశక్తి మూర్తి | 1213, 1289 | 1291 | 1295 | 1293 | |
| 69 | 1294 | 2.706 | 0.440 | పుంజ | రాయపురెడ్డి శారద భర్త కిషోర్ బాబు | 1213 | 1293 1292 | 1295 | 1205 | |
| 70 | 1647 | 0.482 | 0.020 | నంజ | రాజులపాటి రాజేష్ తండ్రి పెద్దిరాజా | 847 | 844 | 845 | 846 | |
| 71 | 1662 | 0.163 | 0.160 | పుంజ | అగ్రహారపు కాశీ విశ్వనాధం తండ్రి సత్యనారాయణ | 1437 | 1659 | 1663 | తాళ్ళపాలెం గ్రామం | తాటి చెట్లు-2 |
| 72 | 1674 | 1.405 | 1.290 | నంజ | అంగర పాపారావు తండ్రి చంద్రయ్య | 1015 | 1028 | 1550 | 1026, 1027 etc | |
| 73 | 1728 | 0.106 | 0.020 | నంజ | వంగూరి ముని తండ్రి నాగేశ్వరరావు | 1187 | 1218 | 1216 | 1187 | |
| 74 | 1868 (Old LPM No.484) | 0.558 | 0.225 | నంజ | పెన్మెత్స రాజేష్ వర్మ తండ్రి ప్రసాదరాజా | 483 | 618 | 1869 | 483 | |
| 75 | 1869 (Old LPM No.484) | 0.557 | 0.245 | నంజ | పెన్మెత్స సూర్యరాజా తండ్రి సత్యనారాయణరాజా | 1868 | 618 | 485 | 483 | |
| 76 | 1816 (Old LPM No.845) | 0.881 | 0.530 | నంజ | మారిశెట్టి నాగేశ్వరరావు తండ్రి వెంకన్న | 1647 | 1815 | 1015 | 858 | |
| 77 | 1838 (Old LPM No.1181) | 0.048 | 0.048 | నంజ | శింగంశెట్టి ధనలక్ష్మి భర్త తాండవ కృష్ణమూర్తి | 1177 | 1839 | 1218 | 1187 | తాటి చెట్లు-2 |
| 78 | (Old LPM No.1181) | 0.52 | 0.502 | నంజ | భర్త ముస్సి | 1178 | 1180 | 1219 | 1838 | తాటి చెట్లు-2 |
| 79 | 1813 (Old LPM No.1238) | 0.5 | 0.500 | పుంజ | గోవిందవజ్ఝల కాశీ విశ్వనాధ శర్మ తండ్రి సుబ్రహ్మణ్య శాస్త్రి | 1214 | 1814 | 1289 1290 1291 | 1213 | |
| 80 | 1814 (Old LPM No.1238) | 1.005 | 1.000 | పుంజ | కేదారశెట్టి పద్మావతి భర్త శ్రీ రామచంద్ర ప్రసాదరావు | 1214 | 1267 | 1289, 1290, 1292 | 1813 | |
| 81 | 1920 (Old LPM No.842) | 2.107 | 1.130 | నంజ | రావిపాటి వీర భద్రరావు తండ్రి వీర్రాజు | 834 | 833 | 843 847 | 1919, 841 | |
| 82 | 1923 (Old LPM No.1176) | 2.026 | 0.870 | నంజ | తుమ్మలపల్లి నాగ వెంకట పద్మ ప్రియ భర్త శ్రీరామమూర్తి | 1131 | 1924 | 1177, 1175 | 1131 | |
| 83 | 1922 | 0.196 | 0.190 | పుంజ | పట్టాదారు / బీడు | 1617 | 1436 | 1271 | 1921 | కొబ్బరి చెట్లు-7 |
| 84 | 1921 | 2.15 | 1.610 | పుంజ | బొర్రా సత్యనారాయణ తండ్రి బ్రహ్మస్వామి | 1617 | 1270 | 1271 | 1269 | |
| 85 | 1925 (Old LPM No.481) | 1.53 | 0.120 | నంజ | నంబూరి వినోద్ రాజా తండ్రి సోమరాజా | 452,453 | 619 482 | 480 483 | 454 | కొబ్బరి చెట్లు-4, మామిడి చెట్లు -1 |
| 86 | 1926 (Old LPM No.481) | 1.53 | 0.120 | నంజ | నంబూరి వినోద్ రాజా తండ్రి సోమరాజా | 452 453 | 619 482 | 480 483 | 454 | |
| 87 | 1928 (Old LPM No.833) | 0.496 | 0.320 | నంజ | రావిపాటి నాగ చంద్ర సత్య రాజకుమార్ తండ్రి వెంకట రమణారావు | 821 | 1929 | 843 | 1920 | |
| 88 | 1929 (Old LPM No.833) | 2.50 | 0.260 | నంజ | రావిపాటి నాగ చంద్ర సత్య రాజకుమార్ తండ్రి వెంకట రమణారావు | 821 | 830 | 1032 | 1928 | |
| 89 | 1932 (Old LPM No.847) | 0.679 | 0.130 | నంజ | పెన్మెత్స సూర్య నారాయణ రాజా తండ్రి సూర్యనారాయణ రాజా | 1627 | 843 | 844, 1647 etc | 1628 | |
| | మొత్తం | | 37.07 | | | | | | | |

భూసేకరణ, నష్ట పరిహారం, పునరావాస, పునరుపాధి, కల్పన చట్టం, 2013 నందలి 11 వ విభాగపు, 1 వ ఉప విభాగములోని నిభంధనలననుసరించి ఈ విషయం గురుంచి ఇందుకు సంబంధించి యావన్మందికి ఎరుక నిమిత్తం ఇందు మూలముగా నోటీసు జారి చేయబడినది. ఈ భూసేకరణ వలన నిర్వాసితులైన కుటుంబాలు ఏమియు లేవు.

శ్రీ జిల్లా కలెక్టర్, తూర్పుగోదావరి జిల్లా వారు చట్టంలో విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు శ్రీ సంయుక్త కలెక్టరు, తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం వారికి వారి సిబ్బందికి, పనివారికి ఇందుమూలముగా అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలో సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుంచి శ్రీ జిల్లా కలెక్టర్, తూర్పుగోదావరి/ సంయుక్త కలెక్టరు, తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఈ విధమైన అమ్మకం/కొనుగోలు (క్రయ/విక్రయాలు) లేదా ఏ విధమైన లావాదేవీలు జరపరాదని, తెలియచేయడమైనది.

పై చట్టంలో సెక్షన్ 15 ననుసరించి భూసేకరణ పై ఏమైనా అభ్యంతరములు/ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి/వ్యక్తులు ఈ ప్రకటనలు ప్రచురించబడిన తేది నుండి 60 (అరవది) దినములలోగా శ్రీ జిల్లా కలెక్టర్, తూర్పుగోదావరి/శ్రీ సంయుక్త కలెక్టర్, తూర్పుగోదావరి వారి ఎదుట అభ్యర్ధనలు దాఖలు చేసుకోనవచ్చును.

KIRTHI CHEKURI IAS
జిల్లా కలెక్టర్,
తూర్పుగోదావరి జిల్లా,
రాజమహేంద్రవరం

వార్త

కన్పించే శత్రువు శాపంలా అన్పించవచ్చు. కాని నటించే మిత్రుడు శత్రువు కన్నా ప్రమాదకరం.

- జాన్ గే

# మత్తు వదిలిస్తారా?

గతి తప్పినా, మతి తప్పినా ఏ వాహన చోదకుడైనా వెళ్లేది నేరుగా యమలోకానికే అన్న విషయంలో ఎవరికీ ఏ భిన్నాభిప్రాయమూ ఉండదు. వాహనాలు నడిపేటప్పుడు అది నేల మీదనైనా, గాల్లోనైనా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. ఎంతో మంది ప్రయాణికుల ప్రాణాలు, భవిష్యత్తు వాహన చోదకుల అప్రమత్తత మీదనే ఉంటుంది. వారు ఏ తప్పు చేసినా ప్రయాణికుల ప్రాణాల్లో గాల్లో కలిసిపోతాయి. మాదకద్రవ్యాలు, గంజాయి, మద్యం సేవించిన వారువాహనాలు నడిపినప్పుడు రోడ్డు ప్రమాదాల్లో పడి చనిపోయిన సంఘటనలెన్నెన్నో వింటున్నాము. కుటుంబ జీవనాధారమైన వ్యక్తులు విమాన ప్రమాదాల్లో చనిపోయిన వారి కుటుంబాల పరిస్థితి దిక్కుతోచదు. థాయ్‌లాండ్‌లోని పుకెట్-ఢిల్లీ ఎయిర్ ఇండియా విమానం గాల్లో ఉండగానే 300 అడుగులు కిందకు పడిపోయిన ఘటనలో 'బ్లాక్ బాక్స్' డేటా చెప్పిన విషయాలు అవలోకిస్తే కొంత ఆశ్చర్యమూ కొంత దిగులు కలుగుతుంది. విమానంలోని మూడు హైడ్రాలిక్ వ్యవస్థలు ఒకేసారి విఫలమవడంతో దాదాపు 4 సెకెన్లతోపాటు ఫ్లైట్ కంట్రోల్స్ పూర్తిగా మొరాయించాయని విమాన తయారీ సంస్థ ఎయిర్‌బస్ తన ప్రాథమిక నివేదికలో వెల్లడించింది. ప్రధానంగా చెప్పుకోవాల్సిన విషయం మరొకటి ఉంది. పైలట్ గంజాయి తీసుకున్నట్లు రెండుసార్లు చేసిన డోపింగ్ పరీక్షలో తేలింది. మాదకద్రవ్యాల ప్రభావంతోనే పైలెట్లు గతి తప్పి విమానాలు ప్రమాదాలకు గురై ఎన్నోప్రాణాలు గాల్లో కలిసిపోయిన సంఘటనలు వింటున్నాము. మత్తు ఎంత ప్రమాదమో అందరికీ తెలిసిందే.ప్రభుత్వాలు అప్రమత్తం చేస్తున్నా, ప్రభుత్వ ఉద్యోగులు, విమాన చోదకులు మాదకద్రవ్యాలు తీసుకోరాదని నిబంధనలున్నా ఎవరూ పాటించడం లేదు. వాటి నిషేధాన్ని అమలు పెట్టాల్సిన అధికారులు కూడా పట్టించుకోరు. ఈభయంకర సత్యాల నేపథ్యంలో ఎయిర్ ఇండియా పైలెట్లకు డోపింగ్ పరీక్షలను తప్పనిసరి చేసింది. ఏ-320 నియోవిమానం హఠాత్తుగా 300 అడుగుల కిందకుపడిపోయి తీవ్ర సంచలనం సృష్టించింది. ప్రయాణికులు ఎంతగానో గాభరాపడ్డారు. ప్రతి విమానంలోనూ ఉన్నట్లే ఈ విమానంలోకూడా 'డిజిటల్ ఫ్లైట్ డేటా రికార్డర్' సమాచారాన్ని విశ్లేషించిన అనంతరమే పైలెట్ల వ్యవహారశైలి, తీసుకున్న మాదకద్రవ్యాల వివరాలు వెల్లడయ్యాయి. విమానంలోని అసాధారణ పరిస్థితుల వల్లనే విమాన గమనాన్ని ఎత్తును నియంత్రించే ఎలివేటర్లు, అలైరౌన్లు స్పాయిలర్లు నాలుగు సెకన్లపాటు పైలెట్ ప్రమేయం లేకుండా తమంతటతామే కదిలాయని విశ్లేషణలో తేలింది. విమానం రెక్కలుగాల్లో తగినంత లిఫ్ట్ ఇవ్వలేకపోతున్నాయని 'స్టాల్'హెచ్చరికలు వచ్చాయి. ప్రయాణికుల భద్రత, నమ్మకమే ప్రధానంగా ఎయిర్ ఇండియా యాజమాన్యం కఠిన నిర్ణయం తీసుకుంది. ఒక ప్రమాదం జరగడం దాని విశ్లేషణ, పరిణామాలను బట్టి నిర్ణయాలు తీసుకోవడంవల్లన పోయిన ప్రాణాలు తిరిగిరావు. దాదాపు ప్రపంచంలో ఎలాంటి వాహన చోదకతలో లోపాలున్నాయన్న అయినా విమర్శలకు గురికాకుండా ప్రమాదం వాటిల్లకుండా ముందుజాగ్రత్తలతో పైలెట్లకు డోపింగ్ తప్పనిసరి చేయడం ఆహ్వానించదగినదే. ప్రమాదానికి గురైన విమాన ప్రధాన పైలట్ సుదీప్ విశిష్ట్ విచిత్ర వ్యవహారశైలి, తడపాటు, నడవలేక తూలుతున్నవైనాన్ని బట్టి మూత్ర నమూనాల పరీక్ష చేయిస్తే అసలు విషయం బయటపడింది. ఈ విమానం కిందకు దిగేక్రమంలో ప్రయాణికులు తీవ్ర ఒత్తిడికిగురయ్యారు.దాదాపు ప్రయాణికులు కుదుపునకు గురై విమానంపై కప్పునుబలంగా ఢీకొట్టారు. విమానాన్ని నడిపే పైలట్ సరైన మానసికస్థితిలో కానీ శారీరక పటుత్వంతో కానీ లేకుంటే జరిగే ప్రమాదాలకు, దుస్సంఘటనలకు ఆ విమాన సంస్థే బాధ్యత వహించాల్సిందే. విమానాల వర్కింగ్ కండిషన్ బాగుంటేనే అవి సజావుగానడుస్తాయి. తాజాగా ఎయిర్ ఇండియా తీసుకున్న నిర్ణయం వలన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన 5వేల మంది పైలెట్లు డోపింగ్ టెస్ట్ చేయించుకోవాల్సి ఉంటుంది. పైలెట్లు, సిబ్బంది డోపింగ్ టెస్ట్‌లో నిషేధిత ఆహార పదార్థాలున్న సంకేతాలు కానీ,ఆనవాళ్లు కానీ కనబడితే, నిర్ధారణ పరీక్షల్లో పాజిటివ్‌గా వస్తే అది ప్రమాదాలను సూచిస్తుంది. ఘటన జరిగినప్పుడే కాస్త హడావుడి.మళ్లీ మామూలే. ముందుగా విమాన భద్రతా లోపం కన్పిస్తే జాగ్రత్తపడేందుకు ఎన్నో అవకాశాలున్నాయి. విమానయాన సంస్థలు యేటాకనీసం10శాతం ఫ్లైట్ క్రూను యాదృచ్ఛికంగా సైకోయాక్టివ్ ప్రమాదాలు పడుతుంటాయి. ఒక పరీక్షల్లో పాజిటివ్ వచ్చినంత మాత్రాన శరీరం రోగగ్రస్థమని అనుకోనక్కర్లేదు. ఈ పరీక్షలను ఒక్క పైలట్‌లకే సబ్ స్టాన్సస్ పరిమితం చేయడం తప్పు.డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఏవియేషన్ నిబంధనల ప్రకారంయేడాదికి 10శాతం మంది పైలట్లకు మాత్రమే యాదృచ్ఛికంగా డ్రగ్స్ పరీక్షలు నిర్వహిస్తుంటారు. ఆధునిక విమానయాన రంగంలో సిబ్బందిపై విపరీత పనిభారం, సక్రమంగా లేని రోస్టర్ వేళలు,తగినంత విశ్రాంతి దొరక్కపోవడం వంటిఅంశాల్లో వారి మానసిక ఒత్తిడివారి ఆరోగ్యం మీద పడుతోంది. డ్రగ్స్ వాడకాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించకూడదు. విమానం నడిపే పైలట్ చేతిలో వందలకొద్దీ ప్రాణాలుంటాయి.ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా అంతే సంగతులు.ఎయిర్ ఇండియా వంటి విమానయాన సంస్థలు మరికొన్ని తమ సర్వీసులను నడిపిస్తున్నాయి. ఆ సంస్థలు కూడా తమ పైలట్‌లు ఇటువంటి నిబంధనలు పాటించేటట్లు చూసుకోవాలి. నిన్నమొన్నటి విమాన ప్రమాదం మొదటిది కాకున్నా, ఇలాంటి ప్రమాదం మరొకటి జరుగకుండా అప్రమత్తంగా ఉండాలి.



ప్రతి ఒక్కరూ ఇది చెడు అని చెప్పగలరు. అయితే అందులో నుంచి బయటపడే మార్గం చెప్పగలిగినవాడే నిజమైన మిత్రుడు.

స్వామి వివేకానంద



సాధారణంగా ప్రతి వారు 'నాకు' ముక్తి కావాలనుకుంటారు. ఇది సరికాదు. 'నాకు' అనే పదం నుండి విముక్తి కావాలి.

రమణ మహర్షి

## ప్రజావాక్కు

### మానవ వివేచన ముఖ్యం

**కృత్రిమ** మేధస్సు వేగంగా విస్తరిస్తున్న కొద్దీ ఉద్యోగ ప్రపంచం స్వరూపం కూడా గణనీయంగా మారుతోంది. ఏఐ ఆధారిత కోర్సులకు బిజినెస్ స్కూళ్లు,ఉన్నత విద్యా సంస్థలు ప్రాధాన్యం ఇవ్వడం అవసరమే. అయితే సాంకేతికనైపుణ్యాలకే పరిమితమైతేభవిష్యత్ ఉద్యోగ ప్రపంచాన్ని ఎదుర్కొనే సమగ్ర సామర్థ్యం విద్యార్థుల్లో పెరగదు. సాంకేతిక పరిజ్ఞానంతో పాటు మానవీయ నైపుణ్యాలను పెంపొందించడంపైనే విద్యాసంస్థలు దృష్టి సారించాలి. కమ్యూనికేషన్, బృందంగా పనిచేయడం, విమర్శనాత్మక ఆలోచన, సమస్య పరిష్కారం, నిర్ణయ సామర్థ్యం వంటి నైపుణ్యాలు ఏఐ విస్తరిస్తున్నా తమ ప్రాధాన్యాన్ని కోల్పోవు. యంత్రం సమాచారాన్ని వేగంగా విశ్లేషించగలదు. కానీ ఆ సమాచారానికి సందర్భాన్ని జోడించడం, దాని విశ్వసనీయతను పరిశీలించడం, నైతిక పరిణామాలను అంచనా వేయడం, తుది నిర్ణయం తీసుకోవడం మానవ వివేచనపైనే ఆధారపడి ఉంటుంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### మౌలిక సదుపాయాలు కల్పించాలి

**ప్రస్తుతం** రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల భవనాలు దాదాపుగా ఆధునీకరించబడినవి. ఏప్రభుత్వ కార్యాలయం అయినా మార్పులు చేసేటప్పుడు ప్రధానంగా పారిశుధ్యపు వసతి, నీటి సరఫరా, విద్యుత్ కలిపే చేస్తారు. మరి మహిళలకు ఒకటి వేరేగా వాష్‌రూమ్ ఉంటేనే సిబ్బంది, మహిళ విద్యార్థినీలకు ఇబ్బంది లేకుండా ఉంటుంది.ఇవి లేనందున కొందరుఅమ్మాయిలు వేరే ప్రైవేట్ పాఠశాలకు వెళ్ళే ప్రయత్నం చేస్తున్నారు. ఇది అతి సహజమైనది. కొందరు బడి మానివేయడం బాధాకరం. వీరు చెప్పే ధైర్యం లేక అలా చేస్తున్నారు.ఇది చిన్న సమస్య. విద్యాశాఖ ఈ వసతి కూడా లేని పాఠశాలల్లో వాష్‌రమ్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి.

- బి. మేఘనాదం, విశాఖపట్నం

### యూరప్ సంక్షోభం!

**నిజానికి** మొరాకోలో పేదరికం తగ్గింది అయితే యువకులలో నిరుద్యోగం పెరిగింది.అది ఎంతగా అంటే దేశంలో ఉన్న మొత్తం నిరుద్యోగం కంటే మూడింతలు ఎక్కువ నిరుద్యోగంఉంది.అందుకేకొన్నినివేదికలప్రకారం స్పెయిన్ లోను, గ్రీస్‌లోను ఇటలీలోకి వలసలు పెద్ద మొత్తంలో ఉన్నాయి. అభివృద్ధి అనేది ఉపాధి రహితంగా ఉంది.

-భారత అవినాష్, జనగామ

### పరిశుభ్రత ప్రతి పౌరుడి కర్తవ్యం

**నేడు** కొందరు ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడం, ప్లాస్టిక్ సీసాలు,కవర్లు, ఆహార అవశేషాలు రోడ్లపై పడేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. చెత్తను నిర్లక్ష్యంగా పారేయడం వల్ల దుర్వాసన, దోమలు, ఈగలు పెరిగి అనేకవ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది. మన ఇల్లు ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో,మన వీధులు,పార్కులు, బహిరంగ ప్రదేశాలుకూడా అంతేశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది. పరిశుభ్రత ప్రభుత్వ బాధ్యతే కాదు, ప్రతి పౌరుడి కర్తవ్యం కూడా. పరిశుభ్రమైన పరిసరాలతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం. ఇతరులకు ఆదర్శంగా నిలుద్దాం.

- ఎన్. కృష్ణ, హైదరాబాద్

### అన్నదాత పట్ల చొరవ చూపాలి

**ఆరుగాలం** శ్రమించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక కుదేలవుతున్న రైతన్న కష్టాలువర్ణనాతీతం.అనాది నుంచి కర్షకుడికి అతివృష్టి, అనావృష్టి అవినాభావ సంబంధం అంటే అతిశయోక్తికాదు. అగ్నికిఆజ్యం పోయకుండా కల్తీ విత్తనాలు, ఎరువులు తదితర వ్యవసాయ సంబంధిత వనరులతో మూలిగే నక్కమీదతాటికాయపడినట్లు ఈ యేడాది రుతుపవనాలు ఆలస్యానికి కారణమయిన ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం వల్ల పంటలకు కోలుకోలేని దెబ్బ. మొత్తం దేశం సాగుకు గుదిబండ దాంతోఅప్పుల బాధతో ఆగని ఆత్మహత్యలు. దేశానికి వెన్నెముఖ శ్రామికుడు కళ్లలో మెరుపులు చూసినప్పుడే ప్రజలు సుభిక్షం. కావున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాత పట్ల మరింత చొరవ చూపాలి.

- ఆర్. వెంకటేష్, బెంగళూరు

### వినియోగదారుల రక్షణ నైతిక బాధ్యత

**వాట్సాప్** ప్రతిపాదించిన యూజర్‌నేమ్ ఫీచర్‌పై దేశవ్యాప్తంగా జరుగుతున్న చర్చ ఒక కీలకఅంశాన్ని వెలుగులోకి తెచ్చింది.వినియోగదారుల సౌలభ్యం ఎంతముఖ్యమో, వారి భద్రత అంతకంటే ముఖ్యమనే విషయాన్ని ఈవివాదం గుర్తు చేస్తోంది. ఫోన్ నంబర్‌కు బదులుగా యూజర్‌నేమ్ ఆధారంగా సంభాషించే అవకాశం కల్పించడం గోప్యతకు మేలు చేసినా, అదే సమయంలో నకిలీగుర్తింపులు, వ్యక్తుల పేర్లను అనుకరించడం,ఆర్థికమోసాలు, సైబర్ నేరాలకు అవకాశం కల్పిస్తుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం భద్రతాపరమైన అంశాలపై వివరణ కోరుతూ జాగ్రత్త వైఖరిని అవలంబించడం సముచితమే.

-సి.సాయి, నల్గొండ జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# యువత వికాసమే అభివృద్ధికి కొలమానం

*యువతుల విషయంలో భద్రత, ప్రయాణ సౌకర్యం, పిల్లల సంరక్షణ, అనువైన పని విధానాలు కల్పించి వారు స్థిరమైన ఆదాయం పొందేపరిస్థితులను సృష్టించాలి. అలాగే గ్రామీణ, చిన్న పట్టణ యువతకు నాణ్యమైన విద్య, ఇంటర్నెట్, గ్రంథాలయాలు అందుబాటులో ఉంచి ఆర్థిక పరిస్థితి అడ్డంకిగా మారకుండా విద్యా రుణాలు, ఉపకార వేతనాలను విస్తరించాలి. 2036 నాటికి యువత జనాభా 34.55 కోట్లకు తగ్గే అవకాశం ఉన్నందున ప్రస్తుత దశలో తీసుకునే నిర్ణయాలు దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతాయి. యువత సంఖ్యను మానవ సామర్థ్యంగా మార్చడానికి విద్యతోపాటు నైపుణ్యం, ఉపాధి, మానసిక ఆరోగ్యం, ఆర్థికభద్రత, మహిళల భాగస్వామ్యం అవసరం. యువతను కేవలం దేశ 'భవిష్యత్తు' అని పిలవడంతో సరిపెట్టకుండా వారు తమ సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకునే వాతావరణాన్ని నిర్మించడమే ప్రభుత్వ విధానాల ప్రధాన లక్ష్యం కావాలి.*

డి. జయరాం

నేటి యువత ఆకాంక్షలను కేవలం ఒక ఉద్యోగానికి మాత్రమే పరిమితం చేయడం సరిపోదు. ఆర్థిక స్వావలంబన, స్థిరమైన ఆదాయం, నాణ్యమైన ఉద్యోగం, వ్యక్తిగత స్వేచ్ఛ, నిరంతర అభ్యాసం, పని వ్యక్తిగత జీవితాల మధ్య సమతుల్యత వారి ప్రధాన ప్రాధాన్యతలుగా మారాయి. గ్రామీణ యువతకు స్థిరమైన ఉపాధిమార్గాలు, పట్టణ యువతకు వృత్తిపరమైన పురోగతి, యువతులకు ఆర్థిక స్వాతంత్ర్యంతో పాటు భద్రత, ప్రయాణ సౌకర్యాలు, అనుకూలమైన పని వాతావరణం ప్రధాన అవసరాలుగా కనిపిస్తున్నాయి. జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవడంతో పాటు తమ జీవిత నిర్ణయాలను స్వతంత్రంగా తీసుకునే స్వేచ్ఛను వారుకోరుకుంటున్నారు. 2026 నాటికి భారత దేశంలో 15 నుండి 29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత జనాభా సుమారు 36.74 కోట్లకు చేరింది. 2021 నాటికి ఈ సంఖ్య 37.14 కోట్లుగా ఉండగా, దేశ జనాభాలో యువత వాటా 27.2 శాతంగా నమోదైంది. 2031 నాటికి ఇది 35.66కోట్లకు,2036 నాటికి 34.55 కోట్లకు తగ్గుతుందని ప్రభుత్వ అంచనాలు చెబుతున్నాయి. ప్రస్తుతం భారత్ వద్ద ఉన్న ఈ భారీ యువ జనాభా ఒక ప్రత్యేకమైన ఆర్థిక అవకాశం. విద్య, నైపుణ్యాలు, ఉపాధి, ఆరోగ్యం, ఆర్థిక భద్రత వంటి అంశాలను సమర్థంగా అనుసంధానించగలిగితేనే ఈ జనాభా ఉత్పాదక శక్తిగా మారుతుంది. ఈ మారిన ఆకాంక్షలకు ఆర్థిక పరిస్థితులు పెద్ద సవాలుగా నిలుస్తున్నాయి. 2026 డెలాయిట్ సర్వేప్రకారం భారత జెన్ జెడ్ స్పందించిన వారిలో 54 శాతం మంది ఆర్థిక అనిశ్చితి కారణంగా ముఖ్యమైన జీవిత నిర్ణయాలను వాయిదా వేసుకున్నట్లు తెలిపారు. అలాగే 37 శాతం మందికి సొంత ఇల్లు కొనుగోలు చేయడం అందుబాటులో లేకపోగా, 29శాతం మంది ఆర్థిక అసురక్షిత భావనను వ్యక్తం చేశారు.మరో 27శాతం మందికి నిరుద్యోగమే ప్రధానఆందోళనగా మారింది. ఈ గణాంకాలు యువత జీవితంలో ఆర్థిక స్థిరత్వం ఎంత కీలకంగా మారిందో స్పష్టం చేస్తున్నాయి. అందువల్ల నేడు ఉద్యోగ ఎంపికలో వేతనంతో పాటుఉద్యోగ భద్రత, నైపుణ్యాల పెంపు, వ్యక్తిగత సమయానికి ప్రాధాన్యత పెరుగుతోంది. యువత ఆకాంక్షలకు విద్య నుంచి ఉపాధికి జరిగే మార్పు విధానమే కీలకమైన పరీక్షగా నిలుస్తోంది. ఉన్నత విద్య విస్తరిస్తున్నప్పటికీ, విద్యార్థులు పొందుతున్న విద్యకు, ఉద్యోగ మార్కెట్ కోరుతున్న నైపుణ్యాలకు మధ్య అంతరం కొనసాగుతూనే ఉంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ, ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమన్ డెవలప్‌మెంట్ సంయుక్తంగా రూపొందించిన ఇండియన్ ఎంప్లాయిమెంట్ రిపోర్ట్ 2024 కూడా భారత కార్మిక మార్కెట్‌లో యువత ఉపాధి, నైపుణ్యాలే కీలక అంశాలని తెలిపింది. విద్యార్థులు పట్టా పొందిన వెంటనే ఉద్యోగానికి సిద్ధంగా ఉండేలావిద్యా వ్యవస్థలో మార్పులు రావాల్సిన అవసరం ఉంది.దీనికోసం కళాశాలలు, విశ్వవిద్యాలయాలు పరిశ్రమలు, పరిశోధనా సంస్థలతో అనుసంధానాన్ని పెంచుకోవాలి. ఇంటర్న్‌షిప్‌లు, ఆచరణాత్మక ప్రాజెక్టులు ఉన్నత విద్యలో అనివార్య భాగం కావాలి. నైపుణ్య శిక్షణకు ఇచ్చే ధ్రువీకరణ పత్రాల సంఖ్య కంటే ఉద్యోగ ప్రాప్తి, ఆదాయ పెరుగుదల,వ్యాపార స్థాపన వంటి ఫలితాల ఆధారంగా ప్రమాణాలను కొలవాలి. కోర్సు




ఎంచుకునే ముందే అభ్యర్థులకు మార్కెట్ డిమాండ్‌పై స్పష్టమైన వృత్తి మార్గదర్శకత్వం అందడం వల్ల ఏ రంగంలో అవకాశాలున్నాయో ముందే తెలుస్తుంది.చదువు పూర్తయ్యాక స్థిరమైన ఉద్యోగం కోసం పోటీ పడే యువతకు అవకాశాలు పరిమితంగా కనిపించినప్పుడు ప్రభుత్వ ఉద్యోగాలపై ఆకర్షణ పెరుగుతుంది. అయితే మొత్తం యువతకు సరిపడా ప్రభుత్వ ఉద్యోగాలు సాధ్యం కావు. కాబట్టి తయారీ, నిర్మాణం, ఆరోగ్యం, పర్యాటకం, రవాణా, ఆధునికవ్యవసాయం, సంరక్షణ సేవలు, డిజిటల్ రంగాల వంటి అధిక ఉపాధి సృష్టించే రంగాలను విస్తరించాలి. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రుణాలు, సాంకేతికత సులభంగా అందేలా చూస్తూ, యువ పారిశ్రామికవేత్తలకు ఆర్థిక సహాయంతో పాటు సరియైన మార్గదర్శకత్వం అందించాలి. అదే సమయంలో ప్రభుత్వ నియామకాలు, పోటీపరీక్షల నిర్వహణలో పారదర్శకత అత్యంత అవసరం. నియామకాల్లో జాప్యం, పరీక్షల నిర్వహణపై అనుమానాలు యువత భవిష్యత్తును తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ప్రతి శాఖ ఖాళీలను ముందుగానే ప్రకటించి నిర్ణీత కాలపరిమితిలో నియామక ప్రక్రియ పూర్తిచేయాలి. పరీక్షా విధానంలో సాంకేతిక భద్రతను పెంచి, కష్టపడి చదివే అభ్యర్థికి తన శ్రమకు తగిన న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని కల్పించాలి.ఉపాధి పోటీ, విద్యా ఒత్తిడి, ఆర్థిక అనిశ్చితి యువత మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. యునిసెఫ్ ప్రకారం 18-29 సంవత్సరాల యువతలో 7.3 శాతం మంది మానసిక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటుండగా, ఎన్‌సీఈఆర్‌టీ సర్వేలో 11శాతం మంది విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నట్లు వెల్లడైంది. ప్రతిలక్ష జనాభాకు కేవలం 0.75 మంది మానసిక వైద్యులు మాత్రమే ఉండటం సేవల కొరతను సూచిస్తోంది. అందుకే పాఠశాలలు, కళాశాలల్లో గోప్యతతో కూడిన సలహా కేంద్రాలను ఏర్పాటుచేసి, మానసిక ఆరోగ్య సేవలను సంక్షోభం వచ్చినప్పుడు మాత్రమే కాకుండా ముందస్తు సహాయ వ్యవస్థగా మార్చాలి. మరోవైపు, కృత్రిమ మేధ ఉపాధి ప్రపంచాన్ని వేగంగా మార్చుతోంది. 2026 డెలాయిట్ సర్వే ప్రకారం భారత జెన్ జెడ్, మిలీనియల్స్‌లో90 శాతానికి పైగా ప్రతిరోజూ ఎఐని ఉపయోగిస్తున్నారు. కేవలం సాంకేతిక వినియోగమే కాకుండా డేటా రక్షణ, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. విద్యా సంస్థలు, పరిశ్రమలు కలిసి నిరంతర నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా ఉద్యోగంలో చేరిన తర్వాత కూడా కొత్త విజ్ఞానాన్ని నేర్చుకునే అవకాశం లభిస్తుంది. యువతుల విషయంలో భద్రత, ప్రయాణ సౌకర్యం, పిల్లల సంరక్షణ, అనువైన పని విధానాలు కల్పించి వారు స్థిరమైన ఆదాయం పొందేపరిస్థితులను సృష్టించాలి. అలాగే గ్రామీణ, చిన్న పట్టణ యువతకు నాణ్యమైన విద్య, ఇంటర్నెట్, గ్రంథాలయాలు అందుబాటులో ఉంచి ఆర్థిక పరిస్థితి అడ్డంకిగా మారకుండా విద్యా రుణాలు, ఉపకార వేతనాలను విస్తరించాలి. 2036 నాటికి యువత జనాభా 34.55 కోట్లకు తగ్గే అవకాశం ఉన్నందున ప్రస్తుత దశలో తీసుకునే నిర్ణయాలు దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతాయి. యువత సంఖ్యను మానవ సామర్థ్యంగా మార్చడానికి విద్యతోపాటు నైపుణ్యం,ఉపాధి, మానసిక ఆరోగ్యం,ఆర్థికభద్రత, మహిళల భాగస్వామ్యం అవసరం. యువతను కేవలం దేశ 'భవిష్యత్తు' అని పిలవడంతో సరిపెట్టకుండా వారు తమ సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకునే వాతావరణాన్ని నిర్మించడమే ప్రభుత్వ విధానాల ప్రధాన లక్ష్యం కావాలి. ●

# డిజిటల్ శబ్దంలో ప్రకృతి స్వరం వినిపిస్తుందా?

ఫిరోజ్ ఖాన్

స్వాతంత్ర్య దినోత్సవ వైభవం ముగిసింది. దేశం సాధించిన విజయాలను గర్వంగా స్మరించుకున్నాం. అయితే ఆ సంబరాల తర్వాత కూడా మన ముందున్న ఒక ప్రశ్నను విస్మరించలేం. అభివృద్ధి ఫలితాలు ప్రతి పౌరుడి దైనందిన జీవితంలో ఎంతవరకు ప్రతిఫలిస్తున్నాయి? స్వతంత్రం అంటే కేవలం విదేశీపాలన నుంచి విముక్తి మాత్రమే కాదు. ప్రతి పౌరుడు ఆరోగ్యకరమైన, సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణంలో జీవించే అవకాశమూ దాని విస్తృత భావనలో భాగమే. ఇది ఏ ప్రభుత్వానికీ, ఏ రాజకీయ పార్టీకీ వ్యతిరేకమైన ప్రశ్న కాదు. అభివృద్ధి, ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యతను ఎలా సాధించాలనే అంశంపై సమాజం చేసుకోవాల్సిన ఆత్మపరిశీలన. భారత రాజ్యాంగంలోని 48ఏ అధికరణం పర్యావరణం, అడవులు,వన్యప్రాణుల పరిరక్షణకు రాష్ట్రం కృషి చేయాలని సూచిస్తే, 51ఏ(జి) అధికరణం ప్రకృతి పట్ల కరుణతో వ్యవహరించడం ప్రతి పౌరుడి కర్తవ్యంగా పేర్కొంటుంది. న్యాయవ్యవస్థ కూడా జీవించేహక్కును ఆరోగ్యకరమైన పర్యావరణంతో అనుసంధానిస్తూ వచ్చిన నేపథ్యంలో, అభివృద్ధిని కేవలం ఆర్థిక గణాంకాలతో కాకుండా పౌరుడు పీల్చే గాలి, తాగే నీరు, పిల్లలు పెరిగే పరిసరాలు, నగరాల్లో పచ్చదనం వంటి అంశాలతోనూ అంచనా వేయాల్సిన అవసరం ఉంది. ప్రజాస్వామ్యంలో రాజకీయ చర్చ అనివార్యం. ఎన్నికలు, విధానాలు, అధికార-ప్రతిపక్ష వాదనలు ప్రజా జీవితంలో సహజమైన భాగాలే. అయితే డిజిటల్ వేదికలపై ఏఅంశం ఎంత వేగంగా వైరల్ అవుతుందో,అదే అంశం ప్రజా చర్చలో ఎంతకాలం నిలుస్తుందో కూడా మారుతోంది.రాజకీయ అంశాలు తక్షణ దృష్టిని ఆకర్షిస్తున్న సమయంలో గాలి, నీరు, అడవులు, వాతావరణ మార్పు, ప్రజారోగ్యం వంటి దీర్ఘకాలిక సమస్యలు వెనుకబడే అవకాశం ఉంది. రాయిటర్స్ ఇన్‌స్టిట్యూట్ డిజిటల్ న్యూస్ రిపోర్ట్ 2026లో భారత్‌కు సంబంధించిన సర్వేలో వార్తలపై విశ్వాసం 39



శాతంగా నమోదైందని, ఆన్‌లైన్‌లో తప్పుడు లేదా తప్పుదారి పట్టించే సమాచారంపై ఆందోళన వ్యక్తం చేసిన వారి వాటా 58శాతంగా ఉందని పేర్కొంది. సామాజిక మాధ్యమాలను పూర్తిగా ప్రతికూలంగా చూడటం కూడా సరైంది కాదు. అవే వేదికలు పర్యావరణ అవగాహన, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, స్థానిక సమస్యలకుప్రజా దృష్టి తీసుకురావడంలో ఉపయోగపడుతున్నాయి. అసలు అవసరం వైరల్ సమాచారాన్ని వెంటనే నిజమని నమ్మడం కాదు. మూలాలను పరిశీలించడం, శాస్త్రీయ ఆధారాలను గౌరవించడం, ధృవీకరించిన సమాచారాన్నే ముందుకు తీసుకెళ్లడం. దేశంలో రహదారులు, పరిశ్రమలు, పట్టణాలు, డిజిటల్ సేవలు విస్తరిస్తున్న కొద్దీ వాటి పర్యావరణ ప్రభావాలను ముందుగానే అంచనా వేసి తగ్గించడం కూడా అవసరం. ప్రపంచ ఆరోగ్యసంస్థ వాయు కాలుష్యాన్నిప్రజారోగ్యానికి ప్రధాన ప్రమాద కారకంగా గుర్తిస్తోంది. సూక్ష్మకణకాలుష్యం, ముఖ్యంగా పీఎం 2.5, ఆరోగ్యంపై చూపే ప్రభావాలపై ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం ద్వారా నగరాల్లో గాలినాణ్యత మెరుగుదల, కాలుష్య నియంత్రణ, స్థానికస్థాయి కార్యాచరణకు ప్రాధాన్యం ఇస్తోంది. ఇటువంటి కార్యక్రమాల అసలు ఫలితం వాటి అమలు,పర్యవేక్షణ,ప్రజలకు అందుతున్నప్రయోజనాల్లో కనిపించాలి.వాహనాల ఉద్గారాలు,నిర్మాణ ధూళి, రోడ్డు ధూళి, వ్యర్థాల దహనం, పారిశ్రామిక ఉద్గారాలు వంటి కాలుష్య వనరులపై నిరంతర పర్యవేక్షణ అవసరం. అభివృద్ధి ఆగాల్సిన అవసరం లేదు. పర్యావరణ పరిరక్షణను అభివృద్ధికి వ్యతిరేకంగా చూడకుండా, అభివృద్ధి నాణ్యతను నిర్ణయించే ఒక ముఖ్యమైన ప్రమాణంగా చూడాల్సిన సమయం ఇది. దేశాభివృద్ధిని ఇకపై కేవలం జీడీపీ, హైవేలు, భవనాలు,పెట్టుబడుల పరిమాణంతోనే కొలవడం సరిపోదు.అభివృద్ధి మధ్యఒక సాధారణ పౌరుడి జీవన నాణ్యత ఎంత మెరుగుపడిందన్నదీ అంతేముఖ్యమైన ప్రమాణం కావాలి. దేశం ఎంత ఎత్తుకు ఎదిగిందన్నదే కాదు, ఆఎదుగుదల ప్రతిపౌరుడికి ఎంత ఆరోగ్యకరమైన,స్వచ్ఛమైన,జీవితం అందించిందన్నదే నిజమైన ప్రగతికి కొలమానం. ●

# సాగునీరు లేక ఎండిపోతున్న కృష్ణా డెల్టా

కె. శ్రీనివాస్

కృష్ణా డెల్టాకు జూన్ 15 నుండి సాగునీరు విడుదల చేస్తామని ప్రకటించడంతో కొద్దిపాటి వర్షాలు, కాలువకు వచ్చిన నీరుతో రైతులు నారుమళ్ళు వేసుకున్నారు.కృష్ణా డెల్టాలో ఇప్పుడు వరి వేయవద్దు అంటూ ప్రచారం చేయడంతో రైతులు, కౌలు రైతులు గందరగోళ స్థితిలోఉన్నారు. కృష్ణా డెల్టా పరిధిలో ఖరీఫ్‌లోనే వరి సాగు చేసే పరిస్థితి ఉంది. సాగునీరు లేక రబీ కాలంలో రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకుంటున్నారు. ఖరీఫ్, రబీ కాలాల్లో ఆరుతడి పంటలు సాగు చేసుకోమని చెప్పడం వలన కృష్ణా డెల్టా రైతులకు, కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు ఉపాధి లేక వలసలు పోవాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా డెల్టాకు సాగునీటి సమస్యపై దృష్టి సారించి అందుకు తగులు చర్యలు ప్రకటిస్తే రైతులు కాస్త ఊపిరి పీల్చుకుంటారు. పట్టిసీమ, పులిచింతల ద్వారా కృష్ణా డెల్టాకు సాగునీరు ఇచ్చే అవకాశం ఉంది. ఏలూరు మండలంలో 10వేల ఎకరాలకు పోణంగి పుంత కాలువ ద్వారా గోదావరి జలాలు గోదావరి ఏలూరు కాలువ నుండి అందించవచ్చు. కానీ పోణంగి కాలువకు గోదావరి నీళ్లను విడుదల చేయడం లేదు. అందుకు గోదావరి మెయిన్ కెనాల్ ఆధునీకరించకపోవడం వలన పోణంగి పుంత కాలువకు గోదావరి నీరు అందడం లేదని అధికారులు చెప్తున్నారు. గోదావరి మెయిన్ కెనాల్‌ను ఆధునీకరణ చేయకుండా అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి రైతులను బలి చేస్తున్నారు. పట్టిసీమ కాలువ నీళ్లను కృష్ణా, గోదావరి మెయిన్ కాలువలకు మళ్లించే అవకాశం ఉంది. పట్టిసీమకు గోదావరి నుండి 80టీఎంసీల నీరు తోడుకునే అవకాశం ఉంది. ఇట్లాంటి పరిస్థితుల్లో గోదావరి వరద జలాలను సముద్రం పాలు చేయకుండా కృష్ణా డెల్టా రైతులకు సాగునీరు అందించే పరిస్థితి ఉన్నా పెడచెవిన పెడుతున్నారు. అందుకు తగిన చర్యలు ప్రభుత్వం ఎందుకు తీసుకోవడం లేదో అర్థం కాని పరిస్థితి. శ్రీశైలం, నాగార్జున సాగర్‌లకు పెద్దఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. జలాశయాలు నిండుతున్నాయి. పులిచింతల వద్ద నీటి నిల్వలు ఉన్నాయి. ఎల్‌నినో ప్రభావం తగ్గుతోందని శాస్త్రవేత్తలు చెబుతుంటే అందుకు విరుద్ధంగా ప్రభుత్వం మాట్లాడుతున్నది. వందల టిఎంసిల గోదావరి వరద నీరు సముద్రం పాలు అవుతున్నది. రైతులు, కౌలు రైతులు ఎకరాకు రూ. 10 వేలు నుండి రూ. 15 వేలు వరకు పెట్టుబడులు పెట్టి నారుమళ్ళు వేశారు. కొన్నిచోట్ల నాట్లు కూడా వేశారు. ఈ పరిస్థితుల్లో కృష్ణా కెనాల్, గోదావరి ఏలూరు మెయిన్ కెనాల్ రెండు కూడా సమాంతర కాలువలుగా ఉన్నాయి. ఏలూరు పరిధిలోని కృష్ణా డెల్టా ఆయకట్టుకు గోదావరి జలాలు నేరుగా అందించే అవకాశం ఉంది. గతంలో అనేక సందర్భాల్లో కృష్ణాజిల్లా తేలప్రోలు వరకు కృష్ణా డెల్టాకు గోదావరి జలాలను అందించారు. అయితే ఇప్పుడు కృష్ణా, గోదావరి ప్రధాన కాలువలు ఆధునీకరణ జరగకపోవడంతో ఈ కాలువలు శివారు ప్రాంతానికి సాగునీరు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఇందుకు ప్రభుత్వం, ఇరిగేషన్ శాఖ



అధికారులదే బాధ్యత. ఇప్పటికైనా మేల్కొని కృష్ణా,గోదావరి ప్రధాన కాలువలను ఆధునీకరణ చేయాలి. ఇరిగేషన్ శాఖ ప్రణాళికా లోపం చాలా స్పష్టంగా కనబడుతున్నది. రైతులు నారుమళ్ళు వేసుకుని, నాట్లు వేసుకునే సమయంలో నీరు ఇవ్వలేమని చేతులెత్తేయడం భావ్యంగా లేదు. ఖరీఫ్, రబీ రెండు పంట కాలాల్లో అపరాలు సాగు చేస్తే పశువులకు మేత దొరకదు. పైగా పనులు దొరికే పరిస్థితి లేక కౌలు రైతులు,వ్యవసాయ కార్మికులు ఉపాధి కోసం వలసలు పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కృష్ణా డెల్టా ఆయకట్టు భూములకు సాగునీరు విడుదల చేయాలని రైతాంగం కోరుతున్నారు. కొన్ని ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కృష్ణ డెల్టాకు సాగునీరు అందించే పరిస్థితి ఉంది. ఉదాహరణకు ఏలూరు రూరల్ మండలంలోని కృష్ణా డెల్టా పరిధిలోని 10వేల ఎకరాలకు పోణంగి పుంత కాలువ ద్వారా గోదావరి జలాలు అందించవచ్చు. పట్టిసీమ ఎత్తిపోతలు కాలువ నీళ్లను పెదవేగి మండలం జానం పేట వద్ద తమ్మిలేరులోకి, ఇతర చోట్ల నుండి మళ్లించి కృష్ణా డెల్టా శివారు భూములకు సాగునీరును గతంలో అందించారు. గోదావరి కాలువకు తూర్పు లాకుల వద్ద మోటార్లు పెట్టి నీరు తోడి గోదావరి జలాలు అందించే అవకాశం ఉన్నది. రైతులు, కౌలు రైతులు వేసిన వరి నారు మళ్ళు, నాట్లు ఎండిపోకుండా సాగునీరు అందించి పంటలను కాపాడాలి. ఇప్పటికైనా ప్రభుత్వం తగు ప్రణాళిక రూపొందించి, నిధులు కేటాయించి కృష్ణా, గోదావరిప్రధాన కాలువలను, ఇతర పంట కాలువలను ఆధునీకరణ చేయాలి. సాగునీటి కోసం కృష్ణా డెల్టా రైతులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నారు. ఏలూరు కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. అనేక చోట్ల నిరసనలు తెలియజేస్తున్నారు. అయినా ప్రభుత్వం స్పందించడం లేదు. కదలడం లేదు. ఎల్‌నినో ఉంది ప్రత్యామ్నాయ పంటలు వేసుకోమని వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు ప్రచారం చేస్తున్నారు. అదే శాస్త్రవేత్తలు ఎల్‌నినో ప్రభావం తగ్గుతోందని చెబుతున్నారు. మరోవైపు కృష్ణానది లోని జలాశయాలకు పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. కృష్ణా డెల్టా ఆయకట్టు స్థిరీకరణకు పులిచింతల ప్రాజెక్టు నిర్మాణం జరిగింది. అయినా కృష్ణా డెల్టా సాగుకు నీటి కొరత ఎదుర్కోవాల్సిన పరిస్థితులే ఉన్నాయి. లక్ష కోట్లు పెట్టి గోదావరి బనకచర్ల ప్రాజెక్టు నిర్మిస్తామని ఆర్భాటంగా ప్రచారం చేస్తున్నారు. ఉట్టికి ఎగురలేని అమ్మ.. ఆకాశానికి ఎగురుతా అన్నట్లుగా మన పాలకుల మాటలు ఉన్నాయి. కాలువల్లో గుర్రపు డెక్క, తూడు, కర్ర నాచు తొలగించలేని ప్రభుత్వాలు లక్షల కోట్లతో కొత్త సాగు నీటి ప్రాజెక్టులు నిర్మాణం చేస్తామని చెప్పడం ఇవి ప్రజలను మభ్యపెట్టడం తప్ప మరొకటి కాదు. కళ్ళ ఎదుట ఉన్న పంట కాలువల్లో నీరు పారడం లేదు కానీ, ఎక్కడికో నీళ్లు ఇస్తాం.. సస్యశ్యామల చేస్తాం.. అని చెబుతుంటే ఇది రైతులకు అర్థం కాదని ప్రభుత్వాలు భావించడం వారి అవివేకం అవుతుంది. కృష్ణా డెల్టా సాగు నీటి హక్కులను కూడా కాపాడలేకపోతున్నారు. పార్టీలకు అతీతంగా రైతులు తమ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా డెల్టా రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్ పరిణామాలు మరో విధంగా ఉంటాయి. అందుకు పాలకులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పని పరిస్థితులు ఏర్పడతాయి. ఇప్పటికైనా కృష్ణా డెల్టా రైతుల గోడు వినాలి. సాగునీటి సమస్యలు పరిష్కరించాలి. కృష్ణా డెల్టా ఎడారిగా మారకుండా సాగునీటి కోసం కృష్ణా డెల్టా రైతులకు ఉద్యమ మార్గం తప్ప మరో మార్గం లేదు. ●

# సముద్రంలో నిప్పుల తుఫాను!




❖70యేళ్ల రికార్డ్ బ్రేక్ దిశగా ఎల్ నినో ❖మారుతున్న వాతావరణ సరళి ❖వర్షపాతం, ఉష్ణోగ్రతలు, కరవుపై ప్రభావం, ❖నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్పియరిక్ అడ్మినిస్ట్రేషన్ అంచనా ❖ ఇక ఆశలన్నీ ఈశాన్యపవనాలపైనే

**న్యూఢిల్లీ, ఆగస్టు 16:** వర్షాకాలం ప్రారంభమై దాదాపు రెండు నెలలు కావోస్తోంది. కానీ వర్షాలు మాత్రం 'ఒక్కసారి వచ్చిపోమ్మ మెరుపుతీగ్గ' అన్నట్టు ఇలా వచ్చి అలా వెళ్తున్నాయి. ఇక ముందైన వర్షాలు రాకపోతాయా? అని ఓ పక్క రైతులు ఆకాశంవైపు దిగాలుగా చూస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్పియరిక్ అడ్మినిస్ట్రేషన్ (ఎన్ఓఎఎ) చేదు వార్తతో పాటు శుభవార్త కూడా చెప్పింది. వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఎల్ నినో బిగ్ షాక్ ఇచ్చింది. ఉష్ణమండల పసిఫిక్ మహాసముద్రంలో ఈ ఎల్ నినో భూతం వేగంగా బలపడుతోంది. ఇది 2026 అక్టోబర్-డిసెంబర్ నాటికి, 1950 తర్వాత నమోదైన మిగతా ఎల్ నినోల తీవ్రత కంటే 69శాతం ఎక్కువగా ఉండొచ్చని నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్పియరిక్ అడ్మినిస్ట్రేషన్ వెల్లడించింది. ఎన్ఓఎఎ అంచనా ప్రకారం, ప్రస్తుతం ఏర్పడుతున్న సూపర్ ఎల్ నినో ఇప్పటివరకు నమోదైన వాటిలో అత్యంత బలమైన సంఘటనగా నిలిచేందుకు దాదాపు 69శాతం అవకాశం ఉంది. గతంలో, ఈ సంఘటన "చారిత్రక రికార్డులలోని అతిపెద్ద ఎల్ నినో సంఘటనలలో ఒకటిగ్గా నిలిచే అవకాశం ఉందని ఎన్ఓఎఎ అంచనా వేసింది. ఈ ఎల్ నినో ఎంత వేగంగా తీవ్రమవుతోందనే దానితో పాటు, ఇది శరదృతువు చివరిలో, శీతాకాలం ప్రారంభంలో గతంలో అనుకున్న దానికంటే బలమైన స్థాయిలో గరిష్ట స్థాయికి చేరుకుం టుందని కంప్యూటర్ మోడల్ మార్గదర్శకాలు దాదాపు ఏకగ్రీవంగా చూపించడం వల్ల, అంచనాలో ఈ మార్పు ప్రధానంగా వచ్చింది. ఎల్ నినో అనేది మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్‌లో సగటు కంటే ఎక్కువ వేడి సముద్ర ఉష్ణోగ్రతలతో కూడిన ఒక వాతావరణ చక్రం. ఈ వెచ్చని నీరు మేఘాలు, భారీ వర్షపాతం ద్వారా వాతావరణంలోకి అధిక పరిమాణంలో వేడిని బదిలీ చేస్తుంది. దీని ఫలితంగా, ప్రపంచవ్యా ప్తంగా వాతావరణ సరళి మారుతుంది. ఇది ఇండోనేషియా, ఆస్ట్రేలియాలో కరువుకు, దక్షిణ అమెరికాలోని కొన్ని ప్రాంతాలలో వరదలకు, ఇతర ప్రాంతాలలో అనేక ఇతర ప్రభావా లకు దారితీస్తుంది. ఉష్ణమండల పసిఫిక్‌లోని ఒక ప్రామాణిక ప్రాంతంలో సగటుతో పోలిస్తే సముద్రపు ఉష్ణోగ్రతలు ఎంత వేడిగా ఉన్నాయనే దాని ఆధారంగా ఎల్ నినో తీవ్రతను నిర్ణయిస్తారు. ఈ సంఘటన, దాని తీవ్రతలో మునుపటి రికార్డు హోల్డర్‌గా ఉన్న 1982-83 మధ్య సంభవించిన భారీ సూపర్ ఎల్ నినోను కూడా మించిపోతుందని ఎన్ఓఎఎ అంచనా వేస్తోంది. ఇదే విషయాన్ని భారత భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ పార్లమెంటు ముందు సైతం తీసుకొచ్చింది. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది చివరి త్రైమాసికంలో తీవ్ర వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది.

**నైరుతి రుతుపవనాల్లో కనిపించని వర్షపాతం**

పసిఫిక్ మహాసముంద్రంలోని నీరు వేడెక్కడం నైరుతి రుతుపవనాలపై ప్రతికూల ప్రభావం చూపిస్తోంది. ఈ కారణంగానే గతంలో పోల్చు కుంటే ఈ ఏడాది వర్షపాతం చాలా తక్కువగా నమోదైంది. భారత వాతావరణ శాఖ గణాంకాల ప్రకారం, దేశంలో జూన్ 1 నుంచి ఆగస్టు 14 మధ్య కాలంలో దీర్ఘకాలిక సగటులో కేవలం 90శాతం మాత్రమే నమోదయ్యే అవకాశం ఉంది. అంటే ఇది సాధారణం కంటే చాలా తక్కువ అని ఐఎండి స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా మరో శుభవార్త కూడా చెప్పింది. ఈ ఎల్‌నినో ప్రభావం సాధారణంగా నైరుతి రుతు పవనాల వర్షాలను తగ్గించినప్పటికీ, అక్టోబర్-డిసెంబర్ మధ్య దక్షిణ భారతదేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రాంతాలలో ఈశాన్యరుతుపవనాల రాక కొనసాగుతుంది. ఆ రుతుపవ నాలపై ఇది పెద్దగా ప్రభావం చూపకపోవచ్చని అంచనావేసింది. అంటే రాబోయే రోజుల్లో ఈశాన్య రుతుపవనాలతో వర్షాలు పెరిగే అవకాశంఉంది. ప్రస్తుతం హిందూ మహాసముద్రంలో బలపడుతున్న పాజిటివ్ ఇండియన్ ఓషన్ డైపోల్ పరిస్థి తులను వాతావరణ శాస్త్రవేత్తలు నిశితంగా గమనిస్తున్నారు. ఒక వేళ ఈ ఓషన్‌డైపోల్ కనుక అక్కడే స్థిరపడితే దక్షిణాది రాష్ట్రాలపై ఎల్‌నినో చూపే ప్రతికూల ప్రభావం తగ్గి,వర్షాలకు అనుకూలమైన వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని చెబుతున్నారు. అంటే రాబోయే రోజుల్లో మనకు వర్షాలు వచ్చే అవకాశం ఉన్నట్టే సూచనలు కనిపిస్తున్నాయి.




## మా పైలట్లను బంధించిన ఖతార్

### ఇరాన్ తాజా ఆరోపణ, ఆ ప్రచారంలో నిజంలేదన్న ఖతార్

**దోహా, ఆగస్టు 16:** తమ సైన్యానికి చెందిన ముగ్గురు పైలట్లను ఖతార్ బంధించిందని, వారిని వెంటనే విడిచిపెట్టాలని ఇరాన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఖతార్ ప్రభుత్వానికి సూచించింది. అయితే, ఇరాన్ ఆరోపణలను ఖతార్ ఖండించింది. తాము పైలట్లను బంధించలేదని, ఈ ప్రచారంలో నిజం లేదని పేర్కొంటూ అధికారిక ప్రకటన విడుదల చేసింది. అమెరికా, ఇరాన్ యుద్ధం ప్రారంభమై దాదాపు ఆఉ నెలలు కావస్తోంది. ఇజ్రాయెల్, అమెరికా కలిసి దాడి చేశాయి. ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌తోపాటు అమెరికా సైనిక బేస్ కలిగిన ఇతర గల్ఫ్ దేశాలపై దాడులకు దిగిన సంగతి తెలిసిందే. దుబాయ్, యుఎఇ, సౌదీ, ఖతార్, బహ్రెయిన్ వంటి దేశాలలోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ దాడులు చేసింది. ఈ క్రమంలో గత ఏప్రిల్‌లో ఖతార్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ వైమానిక దాడులకు దిగింది. యుద్ధ విమానాలతో దాడి చేసింది. అయితే, ఖతార్‌లోని అమెరికా సైన్యం ఈ విమానాల్ని కూల్చివేసింది. ఈ ఘటనలో ముగ్గురు పైలట్లు, విమానాల నుంచి దూకి తమను తాము రక్షించుకున్నారని ఇరాన్ చెబుతోంది. అయితే, ఖతార్ భూభాగంలో దిగిన ముగ్గురు పైలట్లను ఆ దేశం బంధించిందని ఇప్పుడు ఇరాన్ ఆరోపిస్తున్నది. నెలలు గడుస్తున్నా వారిని తమకు అప్పగించడం లేదని చెబుతోంది. ఇరాన్‌కు చెందిన ఎస్‌యు-24 విమానాల్ని ఖతార్ కూల్చివేయడంతో, ఆ విమానాల్లోని జావేద్ సలేహి, అబ్దోల్మాజిద్ దష్తియన్, ఒస్మన్ బెహ్రావేషియన్ అను ముగ్గురు పైలట్లు ఖతార్ సైన్యానికి చిక్కారని, వారిని విడిచిపెట్టాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. అయితే, ఇరాన్ వాదనను ఖతార్ కొట్టేసింది. తమ వద్ద ఇరాన్ సైనికులు ఎవరూ లేరని చెబుతోంది. ఈ మేరకు ఖతార్ విదేశాంగ శాఖ ప్రతినిధి మాజెద్ అల్ అన్సారీ సోషల్ మీడియా వేదికగా ప్రకటన చేశారు. తాము విమానాలు కూల్చిన ఘటనలో సైనికుల కోసం పూర్తి స్థాయిలో సోదాలు, సహాయక చర్యలు చేపట్టామని వివరించింది. అయితే, తమకు ఏ ఒక్క సైనికుడు దొరకలేదని చెప్పింది. ఇదే సమయంలో ఒక సైనికుడికి సంబంధించిన అస్థికలను గతంలోనే ఇరాన్‌కు అందజేశామని పేర్కొంది. అంతేకాదు ఈ ఆరోపణలు గతంలోనే వచ్చాయన్నారు. అప్పుడు ఇరాన్‌కు ఒక ప్రతిపాదన పంపినట్లు పేర్కొన్నారు. ఇరాన్ అధికారులు, ఖతార్‌లో పర్యటించి, పూర్తిస్థాయి సోదాలు జరుపుకోవచ్చని చెప్పామన్నారు. కానీ, ఈ అంశంపై ఇరాన్ ఇంకా స్పందించలేదని చెప్పారు. ఇరాన్.. ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు చేస్తుందని విమర్శించారు. ఈ విషయంపై కొంతకాలంగా వివాదం కొనసాగుతున్నా ఇరు దేశాలు తమ వాదనకు కట్టుబడి ఉన్నాయి.

## భారత స్వాతంత్ర్య వేడుకలు గిన్నిస్ రికార్డు




**న్యూయార్కు, ఆగస్టు 16:** అమెరికాలో భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. న్యూయార్క్ ట్రైస్టేట్ ప్రాంతంలోని భారతీయ అమెరికన్ సమాజం నిర్వహించిన ఓ ప్రత్యేక కార్యక్రమం ప్రపంచ రికార్డును సొంతం చేసుకుంది. అమెరికా 250వ వార్షికోత్సవం, భారత 80వస్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యూజెర్సీలోని పార్సిపానీ వెటరన్స్ మెమోరియల్ పార్క్‌లో 1,300కు పైగా అమెరికా జెండాలను ఏర్పాటు చేశారు. భారత త్రివర్ణ పతాకాల మధ్య వాటిని 250 అనే సంఖ్య ఆకారంలో అమర్చారు. దీంతో అత్యధిక సంఖ్యలో జెండాస్తంభాల ఏర్పాటు విభాగంలో గిన్నిస్‌వరల్డ్ రికార్డు నమోదైంది. భారత స్వాతంత్ర్య దినోత్సవం, అమెరికా 250వ వార్షికోత్సవం ఒకేసారి రావడంతో ఈ ఏడాది వేడుకలకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. ఈ నేపథ్యంలో భారత్ 80, అమెరికా 250 పేరుతో ఆ కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత్, అమెరికా మధ్య స్నేహబంధానికి, రెండు దేశాల ప్రజలను మరింత దగ్గర చేయడంలో భారతీయ అమెరికన్ సమాజం పోషిస్తున్న పాత్రకు ఈ కార్యక్రమం నిదర్శనంగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. భారత టెక్నాలజీ సంస్థ జోహో మద్దతుతో న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్ జనరల్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అసోసియేషన్స్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. భారీ సంఖ్యలో జెండాలను ఒక ప్రత్యేక ఆకృతిలో ఏర్పాటు చేయడం ద్వారా భారత్, అమెరికా మధ్య ఉన్న బంధాన్ని చాటే ప్రయత్నం చేశారు. భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యూయార్క్ ట్రైస్టేట్ ప్రాంతంతో పాటు అమెరికాలోని వలు ప్రాంతాల్లో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్, ఐక్యరాజ్యసమితిలోని భారత శాశ్వత మిషన్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు జరిగాయి. వీటికి పెద్ద సంఖ్యలో ప్రవాస భారతీయులు హాజరయ్యారు. టైమ్స్ స్క్వేర్‌లో ఎఫ్ఐఎ నిర్వహించిన వార్షిక వేడుకల్లో భారత త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. భారతీయ సంస్కృతి, వారసత్వాన్ని ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అమెరికాలోని పలు ప్రముఖ కట్టడాలు భారత త్రివర్ణ పతాకపు రంగుల్లో వెలిగిపోయాయి. న్యూయార్క్‌లోని ఎంపైర్ స్టేట్ బిల్డింగ్, బోస్టన్‌లోని ప్రుడెన్షియల్ సెంటర్ వంటి ప్రముఖ భవనాలు త్రివర్ణ రంగుల్లో దర్శనమిచ్చాయి. అమెరికాలోని పలు రాష్ట్రాల గవర్నర్లు కూడా ఆగస్టు 15ను భారత దినోత్సవం గా ప్రకటిస్తూ ప్రత్యేక ప్రకటనలు జారీ చేశారు. అమెరికా సెనేటర్లు, గవర్నర్లు, చట్టసభ సభ్యులు, వివిధ నగరాలు, పట్టణాలు భారతీయఅమెరికన్ సమాజం అందిస్తున్న సేవలను ప్రశంసించాయి.

## ఆత్మీయ నేస్తాలతో గడిపిన ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 16:** జెన్ జీ స్టైల్లో ప్రధాని మోడీ పూర్తిగా సోషల్ మీడియాపై ఫోకస్ పెట్టారు. ఇటీవల ఆయన చేస్తున్న ఇన్స్టాగ్రామ్ పోస్టులే ఇందుకు నిదర్శనం. తాజాగా సోషల్ మీడియా స్టార్ల తరహా డైలీ రొటీన్ ను పోస్ట్ చేసినట్లు మోడీ కూడా తన దినచర్యలో కీలక ఘట్టాన్ని మన ముందుకు తీసుకువచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి జాతిని ఉద్దేశించి ప్రసంగించడానికి కొద్ది నిమిషాల ముందు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన అధికారిక నివాసంలో అత్యంత ఆత్మీయమైన క్షణాలను గడిపారు. 7 లోక్ కల్యాణ్ మార్గ్‌లోని తన నివాస ప్రాంగణంలో రోజువారీ దినచర్యలో భాగంగా నెమళ్లు, ఆవులకు ఆహారం తినిపిస్తున్న అరుదైన దృశ్యాలను ఆయన సామాజిక మాధ్యమ వేదికగా పంచుకున్నారు. దేశవ్యాప్తంగా ఘనంగా జరుగుతున్న 80వ స్వాతంత్ర్య వేడుకల వేళ ఈ భావోద్వేగపూరిత వీడియో నెటిజన్ల మనసులను అమితంగా ఆకట్టుకుంటోంది. తన నివాసంలోని మూగ జీవాలు తన కుటుంబ సభ్యులతో సమానమని ప్రధాని మోడీ తరచూ చెబుతుంటారు. ప్రతి రోజూ ఉదయాన్నే వాటికి దాణా అందించడం ఆయన నిత్యకృత్యం. స్వాతంత్ర్య దినోత్సవం కావడంతో ఎప్పటికంటే ముందే ఆయన ఎర్రకోటకు బయలుదేరాల్సి వచ్చింది. ఈ మార్పును గ్రహించినట్లుగా ఆవులు, అందమైన నెమళ్లు ఆయన కంటే ముందే దగ్గరకు వచ్చి వీడ్కోలు పలికాయని మోడీ పేర్కొన్నారు. నా మిత్రులకు ఆహారం అందించడం రోజూ ఫేవర్ కానీ నన్ను ఉదయం నేను తొందరగా వెళ్లాల్సిన గ్రహించి అవి నన్ను కలిసేందుకు వచ్చాయంటూ ఆయన ఇన్స్టాగ్రామ్‌లో రాసుకొచ్చారు. పీఎం నివాసంలో కనిపిస్తున్న పశువులలో ఆంధ్రప్రదేశ్ ప్రాచీన, అరుదైన రకానికి చెందిన పుంగనూరు జాతి ఆవులు కూడా ఉండటం గమనార్హం. వీటితో పాటు అందమైన నెమళ్లకు ఆయన సొంత చేతులతో ధాన్యాన్ని, దానాను అందిస్తున్న దృశ్యాలు ప్రధాని వ్యక్తిత్వంలోని మరొక భావోద్వేగ కోణాన్ని ఆవిష్కరించాయి. గతంలో కూడా ఆయన తన ప్రశాంతమైన ఉదయపు నడక సమయంలో వీటితో గడిపిన సందర్భాలను సోషల్ మీడియాలో పంచుకున్నారు.

### అమెరికాలో వరుస కాల్పుల కలకలం

## నిందితుడు సహా ఆరుగురు దుర్మరణం



**వాషింగ్టన్, ఆగస్టు 16:**అమెరికాలో వరుస కాల్పుల ఘటనలు కలకలం రేపాయి. కెంటకీ రాష్ట్రంలోని లెక్సింగ్టన్‌లో గల ఓ పార్కులో జరిగిన ఈ కాల్పుల్లో ఐదుగురు మృతి చెందారు. మృతుల్లో 16 యేళ్ల బాలుడు సహా నలుగురు పెద్దలు ఉన్నారు. మరో 13యేళ్ల బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. తొలుత ఓ నివాసంలోకి ప్రవేశించిన దుండగుడు విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో ముగ్గురు మృతి చెందారు. తర్వాత అక్కడి నుంచి పరారై మరో ఇంటికి వెళ్లి కాల్పులు జరపడంతో మరో వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఆ తర్వాత సమీప అటవీ ప్రాంతంలో మరో మహిళ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఈ ఘటనకు పాల్పడినట్లు అనుమానిస్తున్న వార్ హిక్‌మన్ (39) మృతదేహం కూడా అదే అటవీ ప్రాంతంలో లభ్యమైంది. దాంతో ఈ ఘటనలో నిందితుడి ప్రమేయంపై దర్యాప్తు కొనసాగుతోంది. డెట్రాయిట్‌కు సుమారు 170 మైళ్ల (270 కిలోమీటర్ల) దూరంలోని ఓ ఇంట్లో కాల్పులు జరిగినట్లు సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఇంట్లో తనిఖీలు చేపట్టిన అధికారులు 16 యేళ్ల బాలుడు, 45 యేళ్ల వ్యక్తి, 40 యేళ్ల మహిళ మృతదేహాలను గుర్తించారు. అదే ఇంట్లో 13 యేళ్ల బాలిక కూడా తుపాకీ గాయాలతో కనిపించింది. ఆమెను వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు. కాల్పుల తర్వాత నిందితుడు అక్కడి నుంచి పారిపోయినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో అతని కోసం మిస్సౌరీ కౌంటీలో భారీగా గాలింపు చేపట్టారు. నిందితుడి కోసం గాలింపు కొనసాగుతున్న సమయంలో మరో ఇంట్లో 53 యేళ్ల వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. అతడు కూడా తుపాకీ గాయాలతో మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. దాంతో నిందితుడే ఈ హత్య కూడా చేసి పరారయ్యాడని భావించిన పోలీసులు, అతడి కోసం విస్తృతంగా గాలించారు. హిక్‌మన్ ఎలా మృతి చెందాడు? కాల్పులకు కారణమేంటి? అనే విషయాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## బెంగాల్ అసెంబ్లీ మాజీ డి.స్పీకర్ అనుమానాస్పద మృతి

### టిఎంసి కార్యాలయంలో ఆయన మృతదేహాన్ని కనుగొన్న పోలీసులు



**కోల్‌కత్తా, ఆగస్టు 16:** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో తీవ్ర విషాదం, కలకలం చోటుచేసుకుంది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) సీనియర్ నాయకుడు, రాష్ట్ర అసెంబ్లీ మాజీ డిప్యూటీ స్పీకర్ ఆశిష్ బెనర్జీ (80) అనుమానాస్పద స్థితిలో మరణించారు. బీర్భూమ్ జిల్లా రాంపూర్‌హాట్‌లోని తన నివాసానికి సమీపంలో ఉన్న పార్టీ కార్యాలయంలో ఆయన మృతదేహం ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. ఈ ఘటనతో అధికార టీఎంసీ వర్గాలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్ట్‌మార్టం నిమిత్తం రాంపూర్‌హాట్ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు. ఇది ఆత్మహత్యా లేక దీని వెనుక ఏదైనా కుట్ర ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆశిష్ బెనర్జీకి బెంగాల్ రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. రాంపూర్‌హాట్ నియోజకవర్గం నుంచి ఆయన ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. మమతా బెనర్జీ ప్రభుత్వంలో విద్య, వ్యవసాయ శాఖల మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా కూడా సేవలు అందించారు. అయితే, ఈ ఏడాది మొదట్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన బీజేపీ అభ్యర్థి ధృవ సాహా చేతిలో ఓటమి పాలయ్యారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత, జూన్‌లో బీర్భూమ్ జిల్లా టీఎంసీ కోర్ కమిటీ ఛైర్మన్ పదవికి కూడా ఆశిష్ బెనర్జీ రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఆయన రాజకీయంగా కొంత ఒత్తిడిలో ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో టీఎంసీకి కంచుకోటగా ఉన్న బీర్భూమ్ జిల్లాలో ఇటీవలి ఎన్నికల్లో బీజేపీ అనూహ్యంగా 6 స్థానాలు గెలుచుకోవడం టీఎంసీకి పెద్ద ఎదురుదెబ్బగా మారింది. ఈ రాజకీయ పరిణామాలు కూడా జిల్లా నేతలపై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. ఆశిష్ బెనర్జీ మరణవార్త తెలియగానే ఆయన నివాసం వద్దకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీగా చేరుకోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోస్ట్‌మార్టం నివేదిక వచ్చిన తర్వాతే మృతికి గల కచ్చితమైన కారణాలు తెలుస్తాయని పోలీసులు వెల్లడించారు.

## వందేమాతరం గీతాన్ని అవమానించారంటూ సోనియాపై ఫిర్యాదు

**మంగుళూరు, ఆగస్టు 16:** వందేమాతరం గేయాన్ని అవమానించారంటూ కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీపై కేసు నమోదైంది. కర్ణాటకలోని మంగళూరుకు చెందిన బీజేపీ నాయకుడు వికాస్ పుట్టూర్ స్థానిక ఉర్వా పోలీస్ స్టేషన్‌లో



ఫిర్యాదు చేశాడు. శనివారం ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకల సందర్భంగా వందేమాతరం గేయాన్ని సోనియా అవమానపరిచారని, ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొ న్నారు. వెంటనే ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరాడు. ఒకవేళ పోలీసులు లేదా రాష్ట్ర ప్రభుత్వం తగిన రీతిలో స్పందించకుంటే కర్ణాటక హైకోర్టును ఆశ్రయిస్తానని పేర్కొన్నాడు. వందేమాతరం గేయాన్ని కాంగ్రెస్ అవమానించి, చారిత్రకంగా తప్పు చేసిందని బీజేపీ నేత పుట్టూర్ అన్నారు. జాతీయ పతాకం ఎగరేసే సమయంలో వందేమాతరం ప్లే అవుతున్నప్పుడు సోనియా గాంధీ ఆటంక పరిచారని, గేయాన్ని అవమానించారని విమర్శించాడు. ఈ గేయాన్ని అవమానించిన వారి హోదాకు, స్థాయికి అతీతంగా చర్యలు తీసుకోవాలని తన ఫిర్యాదులో కోరినట్లు వివరించాడు. రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా ఈ కేసుపై విచారణ జరపాలని పోలీసుల్ని కోరాడు. ప్రస్తుతం ఈ కేసుకు సంబంధించిన అంశాల్ని పోలీసులు పరిశీలిస్తున్నారు. సోనియా గాంధీకి వ్యతిరేకంగా ఇప్పటివరకు ఇంకా ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని తెలుస్తోంది. భారత న్యాయ వ్యవస్థపై తనకు నమ్మకం ఉందని, పుట్టూర్ స్పష్టం చేశాడు.

## కోటి ఇస్తే అసోం సిఎంను హతమారుస్తానన్న నిందితుడి అరెస్టు

**గువాహతి, ఆగస్టు16:** తనకు కోటి రూపాయిలు ఇస్తే అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మను హత్య చేస్తానని అందుకు తన సెల్ నంబర్‌ను సంప్రదించాలంటూ ప్రకటన చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి తండ్రి, సోదరుడితోపాటు మరో వ్యక్తిని అరెస్ట్ చేశామని అస్సాం పోలీసులు వెల్లడించారు. మోరిగావ్ జిల్లాలో శనివారం రాత్రి ఈ ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. సీఎం శర్మ హత్యకు సోషల్ మీడియాలో ప్రకటించిన సెల్ నంబర్ ఆధారంగా ఈ కేసు దర్యాప్తు చేపట్టినట్లు వారు వివరించారు. దీనిపై విచారణ చేపట్టగా ఆ నంబర్ అబ్దుల్ ముతాలేబ్ పేరు మీద ఉందని అన్నారు. అతడు వృత్తిరీత్యా టైలర్‌గా జీవనంగా సాగిస్తున్నారని పేర్కొన్నారు. 80వ స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని గువాహతిలోని



ఖానాపారాలో శుక్రవారం సీఎం హిమంత బిశ్వ శర్మ రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి మీడియాలో లైవ్‌లో ప్రసంగించారు. ఈ సందర్భంగా అస్సాం సీఎంను తాను హత్య చేస్తానని ప్రకటించాడు. అందుకు కోటి రూపాయిలు ఇస్తే ఆ పని చేస్తానని వెల్లడించారు. అందుకు తన సెల్ నంబర్ సంప్రదించాలని సోషల్ మీడియాలో ప్రకటించాడు. అదే సమయంలో పాకిస్థాన్‌ను అనుకూలంగా భారత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశాడు. దీంతో ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. దాంతో భూరగావ్ పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో సెల్ నంబర్ ఆధారంగా దర్యాప్తు చేపట్టి అబ్దుల్ ముతాలేబ్‌ను అరెస్ట్ చేశారు. అనంతరం అతడి తండ్రి, సోదరుడితోపాటు మరో వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారందరిని పోలీసులు విచారిస్తున్నారు. ఈ ప్రకటన అబ్దుల్ ముతాలేబ్ ఒక్కరే చేశారా లేకుంటే దీని వెనుక ఎవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. సోషల్ మీడియాలో వచ్చిన బెదిరింపు ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు చెప్పారు. ఆ కేసుకు సంబంధించి అందుబాటులో ఉన్న డిజిటల్ ఆధారాలను కూడా పరిశీలిస్తున్నట్లు పోలీస్ ఉన్నతాధికారులు వివరించారు.

## జార్ఖండ్ కూటమి ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించండి

### రాహుల్ గాంధీకి నిరసనకారుల అల్టిమేటమ్

**రాంచి, ఆగస్టు 11:** జార్ఖండ్‌లో జేఎంఎం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతు ఉపసంహరించాలని ఆ పార్టీ నేత రాహుల్ గాంధీని విద్యార్థి నిరసనకారులు డిమాండ్ చేశారు. ఆగస్ట్ 20న సీఎం హేమంత్ సోరెన్ నివాసాన్ని ముట్టడిస్తామని వారు స్పష్టం చేశారు. జార్ఖండ్‌లో నిర్వహించిన నియామక పరీక్షలలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న విద్యార్థులు గత 22 రోజులుగా నిరసనలు కొనసాగిస్తున్నారు. దేశ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాంచిలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. తమ డిమాండ్లపై స్పందించని సీఎం హేమంత్ సోరెన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్ట్ 20న ముఖ్యమంత్రి నివాసాన్ని మేం ముట్టడిస్తాం. జేఎంఎం, కాంగ్రెస్ రెండూ మాతో రాజకీయాలు చేస్తున్నందున ఆయన రాజీనామాను మేం కోరుతున్నాం. ఒకవేళ ముఖ్యమంత్రి మా మాట వినకపోతే, జేఎంఎం నేతృత్వంలోని కూటమికి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ మద్దతు ఉపసంహరించుకోవాలని కూడా మేము



డిమాండ్ చేస్తున్నామని జేపీఎస్సీ జేఎస్ఎస్సీ రిఫార్మ్స్ మంచ్ నాయకుడు రవీంద్ర పాశ్వాన్ అన్నారు. 24 జిల్లాల్లోనూ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మలను దహనం చేస్తామని నిరసనకారులు తెలిపారు.

# సంక్షిప్త వార్తలు

## జార్ఖండ్‌లో ఆటోరిక్షా బైక్ ఢీ: ఆరుగురు మృతి

**రాంచీ, ఆగస్టు 16:** జార్ఖండ్ రాష్ట్రంలో ఘోరరోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. లతేహార్ జిల్లాలో ఓ కంటైనర్ ట్రక్కు అదుపు తప్పి ఆటో రిక్షా, బైక్‌ను ఢీకొట్టడంతో చిన్నారి సహా ఆరుగురు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల నప్రకారం వేగంగా వచ్చిన ట్రక్కు ఆటో, బైక్‌ను ఢీకొట్టడంతో చంద్వాపోలీస్ స్టేషన్ పరిధిలోని దేద్ తంగవాలోయలో పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ రగిబ్‌ఖాన్ (35),అఫసారి ఖాటూన్(40), ఆమె కుమారుడు అస్జాద్ (7)ఉన్నారని, మరో ముగ్గురి వివరాలు తెలియాల్సి ఉందని చంద్వా పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ మనోరంజన్ ప్రసాద్ తెలిపారు.

## బర్త్‌డేకేక్‌లో చచ్చిన బల్లి: 11 మందికి అస్వస్థత



**ముంబై, ఆగస్టు16:** బర్త్‌డే కేక్‌లో చచ్చిన బల్లి కనిపించింది. ఆ కేక్ తిన్న 11మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని ఆసుపత్రిలో చేర్పి చికిత్స అందించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు దీనిపై దర్యాప్తు చేపట్టారు. మహారాష్ట్రలోని నలసోపారాలో ఈసంఘటనజరిగింది. ఒకరి పుట్టిన రోజు వేడుక పలువురిని ఆసుపత్రి పాలు చేసింది. బర్త్‌డే కేక్‌లో చచ్చిన బల్లి కనిపించింది. అది తిన్నతర్వాత 11మంది ఫుడ్‌పాయిజనింగ్‌కు గురయ్యారు. ఏడుగురుపిల్లలు, నలుగురు మహిళలు కడుపు, ఛాతిలో నొప్పితో బాధపడ్డారు.

## ప్రధాని మోడీపై అనురాగ్ కశ్యప్ సెటైర్లు




**ముంబయి, ఆగస్టు 16:**స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట వేదికగా ప్రధాని నరేంద్ర మోడీచేసిన దిమాగీ నక్సల్ (మేధో నక్సల్) వ్యాఖ్యలపై ప్రముఖ సినీ దర్శకుడు అనురాగ్ కశ్యప్ తీవ్రంగా స్పందించారు. యువతపై రాజకీయ ముద్రలు వేయడం కన్నా,వారికి విద్యా బుద్ధులు నేర్పడం, విమర్శనాత్మక ఆలోచనలను ప్రోత్సహించడం, అవసరమైతే థెరపీ ద్వారా వారిని అర్థం చేసుకోవడం ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడి యాలో పెద్ద చర్చకు దారితీశాయి. సోషల్ మీడియా వేదికగా ప్రధాని వ్యాఖ్యలపై అనురాగ్ కశ్యప్ స్పందిస్తూ, నేటి రాజకీయ భాష యువతరం ఆందోళనలను, వారి ఆలోచనా విధానాన్ని ప్రతిబింబిస్తోందా అని ప్రశ్నించారు.

## మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది ఇంటిపై జాతీయ జెండా



**శ్రీనగర్, ఆగస్టు 16:** జమ్మూ కశ్మీర్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఓఆసక్తికరమైన దృశ్యం అందరి దృష్టిని ఆకర్షించింది. భద్రతాదళాల మోస్ట్‌వాంటెడ్ లిస్ట్‌లో ఉన్న లష్కరే తోయిబా టాప్‌కమాండర్ అబిద్ రంజాన్ షేక్ తల్లిదండ్రులు తమ ఇంటిపై మువ్వన్నెలజెండాను ఎగరేసి దేశభక్తిని చాటుకున్నారు. షోపియాన్‌లోనివారి నివాసంపై తల్లి,తండ్రి ఇద్దరూ కలిసి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) నుంచి కార్య కలాపాలు సాగిస్తున్న అబిద్ రంజాన్ షేక్, లోయలో జరిగిన అనేక ఉగ్రవాద దాడుల్లో కీలక సూత్రధారిగా ఉన్నాడు.

## భార్యను హత్యచేసిన బిఎస్‌ఎఫ్ జవాన్



**చండీగడ్, ఆగస్టు 16:** బోర్డర్ సెక్యూరిటీఫోర్స్ (బీఎస్ఎఫ్)జవాన్‌గా పని చేస్తున్న అమర్‌జిత్ సింగ్ సెలవుపై ఇంటికి వచ్చి భార్య రమాతో గొడవ నేపథ్యంలో ఆమెను కొట్టడంతో మరణించింది. అయితే టెర్రస్ పైనుంచి కిందపడి తీవ్రంగా గాయపడినట్లు భార్య కుటుంబ సభ్యులకు సమా చారమిచ్చాడు. ఆమహిళ శరీరంపై పలు గాయాలు ఉండటంతో అను మానించిన ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పంజాబ్‌లోని హోషియార్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది.

## ఎయిర్‌పోర్టులో ప్యాసింజర్‌వద్ద గన్‌పేలి ఇద్దరికి గాయాలు

**వారణాసి, ఆగస్టు 16:** వారణాసి ఎయిర్‌పోర్టులో ఒక ప్యాసింజర్ గన్ తీసుకెళ్తుండగా, అధికారులు తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఉన్నట్లుండి గన్‌పేలిపోయింది. ఈఘటనలో ఇద్దరికి గాయాల య్యాయి. వారణాసిలోని లాల్‌బహదూర్ శాస్త్రిఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో ఆదివారం ఉదయం 9.30గంటలకు ఈఘటన జరిగింది. అజాంగడ్‌కు చెందిన కమ్లేష్ రాయ్ అనే ప్రయాణికుడు తనభార్యతో కలిసి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఐఎక్స్1810 అనే విమానంలో ముంబై వెళ్లేందుకు ఎయిర్పోర్టుకు వచ్చాడు.

# సనాతన ధర్మ పరిరక్షణ, ప్రాచీన ఆలయాల పూర్వవైభవమే లక్ష్యం

**• దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి • ఆత్మకూరులో శ్రీ అలగనాథ స్వామి కళ్యాణ మండపం వైభవంగా ప్రారంభం**

**ఆత్మకూరు (నెల్లూరు), ఆగస్టు 16 ప్రభాతవార్త:** రాష్ట్రంలో సనాతన ధర్మ పరిరక్షణ, ఆధ్యాత్మిక సంప్రదాయాల పరిరక్షణతో పాటు చారిత్రక ఆలయాల పునరుద్ధరణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆత్మకూరులో చారిత్రాత్మక నేపథ్యం గల శ్రీ అలగనాథ స్వామివారి ఆలయంలో రూ.80 లక్షల దేవాదాయ శాఖ నిధులతో నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపాన్ని మంత్రి వైభవంగా ప్రారంభించారు. తొలుత ఆలయానికి విచ్చేసిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ఆలయ మర్యాదలతో అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆలయాల్లో నిత్య ధూపదీప నైవేద్యాలు కొనసాగేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలోనే ధూపదీప నైవేద్య పథకంపై ఆలోచన చేశారని తెలిపారు. అర్చకులు, వేద పండితులు లేని ప్రాంతాల్లో స్థానికంగా ఉన్న పాఠశాల ఉపాధ్యాయులు, బ్రాహ్మణ కుటుంబాలు లేదా మహిళలు కూడా ఆలయంలో దీపం



వెలిగించి పూజలు నిర్వహించేలా ప్రోత్సహించేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం సుమారు 6,800 ఆలయాలకు ధూపదీప నైవేద్య పథకాన్ని అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందులో ఆత్మకూరు నియోజకవర్గంలోని 135 దేవాలయాలకు ధూపదీప నైవేద్య పథకం కింద సుమారు రూ.1.62 కోట్లను ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. శ్రీ అలగనాథ స్వామివారి ఆలయాన్ని కూడా ఈ పథకంలో చేర్చామని తెలిపారు. రాష్ట్రంలో ఆలయాలు లేని ప్రాంతాల్లో కొత్తగా భజన మందిరాలు, ఆలయాలను నిర్మించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందని మంత్రి తెలిపారు. విలువలతో కూడిన విద్య, సనాతన ధర్మ సంప్రదాయాలు, వైదిక ధర్మాలు, ఆగమ శాస్త్రాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. పిల్లల్లో క్రమశిక్షణ, సంస్కారం, నైతిక విలువలను పెంపొందించేందుకు కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో ఆత్మకూరు పరిధిలో ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం నియోజకవర్గంలో అనువైన ప్రాంతంలో ఐదు ఎకరాల భూమిని సేకరించి మఠం నిర్మాణానికి ఏర్పాటు చేస్తామని తెలిపారు. దేవాలయాలు కేవలం పూజా స్థలాలు మాత్రమే కాదని, అవి మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మికత, విద్యా విజ్ఞానాలకు కేంద్రాలని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. జిల్లాలో ఆధ్యాత్మిక అభివృద్ధికి మరింత ఊతమిస్తూ, సనాతన ధర్మాన్ని, వైదిక సంప్రదాయాలను, ఆలయ సంస్కృతిని రాబోయే తరాలకు సురక్షితంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. తెలుగుదేశం నాయకులు ఆనం కైవల్యా రెడ్డి, వేలూరు కేశవ చౌదరి, తాళ్లూరు గిరినాయుడు, తుమ్మల చంద్ర రెడ్డి, సుంకర పెంచల చౌదరి, ఇత విజయ భాస్కర్ రెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు కుడుముల సుధాకర్ రెడ్డి, కెవి శేషారెడ్డి, నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మాస్టర్స్ స్విమ్మింగ్‌లో ఓవరాల్ ఛాంప్ ఎన్టీఆర్ జిల్లా




**విజయవాడ, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఇంటర్ డిస్ట్రిక్ట్ 7వ మాస్టర్ ఛాంపియన్ షిప్ ట్రోఫీలో ఎన్టీఆర్ జిల్లా స్విమ్మర్లు సత్తా చాటారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసారావుపేటలో జరిగిన పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించారు. ఈ సందర్భంగా విజేతలను పలువురు అభినందించారు. ఓవరాల్ గా 23 స్వర్ణాలు, 10 రజతాలు, 8 కాంశ్య పతకాలను సాధించిన టీమ్ స్విమ్మర్ల ప్రతిభను కొనియాడారు. 235 పాయింట్లతో ఎన్టీఆర్ జిల్లా అగ్రస్థానంలో నిలవగా, తదుపరి కృష్ణా జిల్లా స్విమ్మర్లు 179 పాయింట్లతో రెండోస్థానంలో నిలిచారు. విజేతల్లో జి శ్రీకాంత్ 6 గోల్డ్, డి యుగంధర్ 4 గోల్డ్, 2 రజత పతకాలు దక్కించుకున్నారు. కే.ప్రవీణ్ కుమార్, జేఎస్ శరత్‌చంద్ర, ఎస్.రమేశ్ 3 చొప్పున బంగారు పతకాలు అందుకున్నారు. ఎం శ్రీకాంత్ 2 గోల్డ్ పతకాలు దక్కించుకోగా, వి శ్రీనివాసరావు, కే కిషోర్, పి దుర్గారావు, వై రామారావు ఒక్కో బంగారు పతకం సహా వివిధ పతకాలు సాధించి సత్తా చాటారు. ఇక మహిళల విభాగంగలో వి సుహాసిని మూడు పతకాలు అందుకున్నారు. అందులో ఒకటి గోల్డ్ ఉంది. విజేతలను ఎన్టీఆర్, కృష్ణా జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రతినిధులు ఇంకా ఇన్చార్జ్ అనిల్ కుమార్, సిమ్మింగ్ కోచ్‌లు మాల్యాద్రి, లక్ష్మణ్ రావు తదితరులు అభినంందించారు. తదుపరి జాతీయ స్థాయి పోటీల్లో కూడా మంచి ప్రతిభ కనబరచాలంటూ ప్రోత్సహించారు.

# తిరుపతిలో నేటి నుండి ఆధ్యాత్మిక సేవలపై జాతీయ సదస్సు

**తిరుమల, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి నిర్వహణలో తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో టిటిడి ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలోనేటి నుండి 19వ తేదీ వరకు మూడు రోజులు వైష్ణవ ఆచార్యుల ఆధ్యాత్మిక సేవలపై జాతీయ సదస్సు జరగనుంది. ఈ సదస్సులో రామానుజాచార్యులు, పుండరీకాక్షులు, గోవింద భట్టర్, దాశరథి (ముదళియాండాన్) జీవితం, ఆధ్యాత్మిక సేవలు, విశిష్టాద్వైత సిద్ధాంత ప్రచారం, ఆలయ ఆచార-సంప్రదాయాల పరిరక్షణలో వారు చేసిన విశిష్ట కృషిపై పరిశోధనాత్మక చర్చలు జరుగనున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 25 మంది పరిశోధకులు, పలువురు పండితులు ఈ సదస్సులో పాల్గొని పరిశోధనా పత్రాలను సమర్పించనున్నారు. వైష్ణవ సంప్రదాయ వికాసంలో ఆచార్యుల పాత్ర, వారి ఆధ్యాత్మిక సేవలు, దివ్యప్రబంధ ప్రచారం తదితర అంశాలపై లోతైన చర్చలు నిర్వహించనున్నారు. నేటి ఉదయం 10 గంటలకు తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి మంగళాశాసనాలతో సదస్సు ప్రారంభమవుతుంది. భక్తి, ఆధ్యాత్మికత, పరిశోధనలను సమన్వయం చేస్తూ వైష్ణవ సంప్రదాయ వైభవాన్ని మరింతగా వెలుగులోకి తీసుకురావడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశ్యం.

# మెరుగైన విద్యుత్తు సరఫరా చేసేందుకు కృషి

**• రూ. 520 కోట్లతో 104 సబ్‌స్టేషన్ల నిర్మాణం • ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి**



**తిరుపతి, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిఎస్‌పిడిసిఎల్ పరిధిలో విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్తును సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. ఎస్‌పిడిసిఎల్‌లో వివిధ అభివృద్ధి పనులపై ఆదివారం సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి డైరెక్టర్లు పి.అయూబ్ ఖాన్, కె. గురవయ్యలతో సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎండి మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన సేవలందించడంలో భాగంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. లో ఓల్టేజ్ సమస్యను అధిగమించడం, 24 గంటలూ నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయడం కోసం సంస్థ పరిధిలోని 9 జిల్లాల్లో గత యేడాది అక్టోబరు నుండి సుమారు రూ.520 కోట్ల వ్యయంతో 104 సబ్ స్టేషన్ల నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. ఎపిఎస్‌పిడిసిఎల్ పరిధిలోని నెల్లూరు జిల్లాకు 8 సబ్ స్టేషన్లు, తిరుపతి 14, చిత్తూరు 11, అన్నమయ్య 13, కడప 7, కర్నూలు 6, నంద్యాల 8, అనంతపురం 14, శ్రీసత్యసాయి జిల్లాకు 14, కుప్పం రెస్కాకు 9 సబ్ స్టేషన్లను మంజూరు చేశామన్నారు. వాటిలో 29 సబ్ స్టేషన్ల నిర్మాణాన్ని పూర్తిచేసి వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. మరో 13 సబ్ స్టేషన్ల నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయని, వాటిని త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని వివరించారు. అందులో 50 సబ్‌స్టేషన్ల నిర్మాణానికి సంబంధించి టెండరు ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన 12 సబ్‌స్టేషన్ల పనులను సంబంధించి టెండరు ప్రక్రియను పూర్తి చేయాల్సి వుందన్నారు. సబ్ స్టేషన్ల నిర్మాణ అంశంలో సంబంధిత కాంట్రాక్టర్లు నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు వీలుగా సంబంధిత అధికారులు కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

**నేడు డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి:** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేడు (సోమవారం) ఉదయం 10గంటల నుండి నుంచి మధ్యాహ్నం 12.30 గంటలవరకు 'డయల్ యువర్ సిఎండి' కార్యక్రమాన్ని ఎస్‌పిడిసిఎల్ నిర్వహించనుంది. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు 89777 16661 నంబర్‌కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చు. ఈ కార్యక్రమం ద్వారా తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురాదలచిన వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. కాగా సర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8:30 గంటల నుండి నుంచి 9:30గంటల వరకు 'డయల్ యువర్ ఎస్ఇ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లా స్థాయిలో తమ విద్యుత్ సమస్యలను ఎస్ఇల దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా వినియోగదారులు తిరుపతి: 87126 52679, చిత్తూరు: 79931 47979, నెల్లూరు: 08612 320427, అన్నమయ్య: 94408 17449, కడప: 08562 242457, కర్నూలు: 73826 14308, నంద్యాల: 73826 18976, అనంతపురం: 91547 90350, శ్రీసత్యసాయి: 99637 07847 నంబర్లకు ఫోన్‌చేసి తెలియజేయాలి.

# హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో జ్యుడీషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు



**విజయవాడ, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జ్యుడీషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు రాష్ట్ర హైకోర్టు కార్యాలయం నందు రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ రాష్ట్రంలో న్యాయధికారుల పనితీరు, పరిస్థితుల గురించి సానుకూలంగా చర్చించారు. సిజెను కలిసిన వారిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జ్యుడీషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చక్రపాణి, రమేష్ నాయుడు, శైలజ కంపల్లి, శ్రీనివాసరావు, బెజవాడ రాధారాణి, వెన్నెల, వెంకట శేషాద్రి తదితరులు ఉన్నారు.

## తిరుమల సమాచారం



### వరుస సెలవులతో తిరుమలలో భారీ రద్దీ

**తిరుమల, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** వరుససెలవులు... వారాంతం కలిసి రావడంతో ఏడుకొండలు భక్తులతో కిటకిటలాడుతోంది. శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటల సమయం నిరీక్షణ తప్పడంలేదు. ఆదివారం ఉదయానికే వైకుంఠం క్యూ కాంప్లెక్స్ కంపార్ట్‌మెంట్లు నిండిపోయి వెలుపల లైన్లు ఆక్టోపస్ భవనం వరకు చేరాయి. ఇష్టదైవమ్ వేంకటేశ్వర స్వామి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో తిరుమల గిరులు భక్తజనసందోహంతో కిటకిట లాడుతున్నాయి. భక్తుల రద్దీ పరిస్థితులను టిటిడి అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. క్యూ లైన్లలో గంటల తరబడి వేచి ఉంటున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగు నీరు, పాలు, అన్నప్రసాదాలను నిరంతరాయంగా అందజేస్తున్నారు. శనివారం ఒక్కరోజే స్వామివారిని 90,293 మంది భక్తులు దర్శించుకున్నారు. 53,090 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ.3.81 కోట్లు లభించింది. రానున్న రోజుల్లో రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నందున, వృద్ధులు, చిన్నపిల్లలతో వచ్చే భక్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని టిటిడి విజ్ఞప్తి చేసింది.

### నవంబర్ నెల సేవా టికెట్ల కోటా విడుదల



**తిరుమల, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఈ యేడాది నవంబర్ నెలకు సంబంధించిన శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లు, దర్శన టోకెన్లు, వసతి గదుల ఆన్‌లైన్ కోటా విడుదల షెడ్యూల్‌ను టిటిడి వెల్లడించింది. భక్తులు ఆయా రోజుల్లో దర్శన టిక్కెట్లను ఆన్‌లైన్‌లో ముందస్తుగా బుక్ చేసుకోవాలని సూచించింది. భారీ డిమాండ్ ఉండే సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన వంటి ఆర్జిత సేవల కోసం ఎలక్ట్రానిక్ డిప్ (లక్కీ డిప్) విధానంలో టికెట్లను కేటాయించనున్నారు. ఇందుకోసం భక్తులు 18వ తేదీ (రేపు) ఉదయం 10 గంటల నుండి 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో పేర్లను నమోదు చేసుకోవచ్చు. లక్కీ డిప్‌లో టిక్కెట్లు పొందిన భక్తులు ఆగస్టు 22వ తేదీ మధ్యాహ్నంలోగా నిర్ణీత రుసుము చెల్లించి తమ టిక్కెట్లను ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. ఇతర సేవా టికెట్లను 21న విడుదల చేయనున్నారు. ఆ రోజు ఉదయం 10గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టిక్కెట్లు అందుబాటులోకి వస్తాయి. మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవల కోటాను టిటిడి విడుదల చేస్తుంది. 24న ఉదయం 10గంటలకు అంగప్రదక్షిణం టోకెన్లు, ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్ట్ బ్రేక్ దర్శనం టిక్కెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దివ్యాంగుల ప్రత్యేక దర్శన టోకెన్ల కోటాను విడుదల చేస్తారు. 25న ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు, మధ్యాహ్నం 3గంటలకు తిరుమల, తిరుపతిలోని వసతి గదుల బుకింగ్ కోటాను అందుబాటులో ఉంచుతారు. భక్తులు టిటిడి అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే టికెట్లను బుక్ చేసుకోవాలని స్పష్టం చేశారు.

# వైట్‌బోర్డుతో తిరుమలకు ట్యాక్సీ సేవలు

# సర్కార్ ఆదాయానికి గండి

**• వెయ్యికిపైగా సొంత వాహనాలే • పట్టించుకోని రవాణాశాఖ**



**తిరుపతి, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** పుణ్యక్షేత్రం తిరుమలకు యాత్రికుల సౌకర్యార్థం తిరుపతి నుండి పలురకాలుగా తిరుగుతున్న నాలుగువేల వాహనాల్లో వెయ్యికిపైగా వైట్‌బోర్డు వాహనాలు యాత్రికుల సేవలో తరిస్తున్నాయనేది ప్రధాన ఆరోపణ. దీనివల్ల ప్రభుత్వానికి రావలసిన ఆదాయానికి భారీ గండిపడుతుందని పలువురు ట్యాక్సీ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ తిరుమల నుండి తిరుపతికి నిర్ధేశిత నంబర్లతో వైట్‌బోర్డుతో తిరుమలకు యాత్రికులను చేరవేసున్నారనేది దుమారం రేపుతోంది. ట్యాక్సీ వాహనాలు తిరుమలకు వస్తున్నా ప్రతి మూడునెలలకోసారి పన్ను చెల్లించాల్సి ఉందని, అంతేగాక తిరుమలలో ట్యాక్సీలు ఔటర్‌రింగురోడ్డుమీదుగానే తిరిగి యాత్రికులను ఎక్కించుకోవడం, దించడం వంటివి చేమాల్సి ఉంటుందని వాపోతున్నారు. వైట్ బోర్డు వాహనాలను తిరుమలలోపల సిఆర్‌ఒ, రాంభగీచా అతిథిగృహాలు, పద్మావతి విచారణ కార్యాలయం, ఎంబిసి తదితర ప్రాంతాలకు అనుమతిస్తుండటంతో యాత్రికులు కూడా వాటిపై ఆధారపడుతున్నట్లు తెలుస్తోంది. వైట్‌బోర్డు కార్లు, ఇన్నోవాలు, వంటి ఇతరత్రా వాహనాలు ట్యాక్స్ చెల్లింపు కూడా తక్కువేనని,అయితే ట్యాక్సీల ఆదాయానికి గండికొడుతున్నారని పలువురు ట్యాక్సీ డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైట్‌బోర్డుతో తిరుపతి- తిరుమల, తిరుమల- తిరుపతి మధ్యనేగాక స్థానిక ఆలయాలు, కాణిపాకం, శ్రీకాళహస్తి, తమిళనాడు వేలూరు బంగారుగుడి వంటి ప్రాంతాలకు కూడా టోల్‌గేట్ ఫీజుల్లో మినహాయింపు ఉంటుందని చెబుతున్నారు. ప్రతిరోజూ 1,500 వరకు వైట్‌బోర్డు వాహనాలు తిరుమలకు వెళ్తుండటం చూస్తే దీనివెనుక ఆంతర్యం ఏమిటని అర్థమవుతుంది. రవాణాశాఖ అధికారులు అలిపిరి టోల్‌గేట్‌లో, జిఎన్‌సి టోల్‌గేట్‌లో ఆకస్మిక దాడులు చేస్తే వైట్‌బోర్డుతో ట్యాక్సీలుగా తిరుగుతున్నట్లు గుర్తించి ఆశ్చర్యపోయారు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి ట్యాక్స్ రూపంలో భారీగా నష్టం వస్తుందనేది రవాణాశాఖ వర్గాల సమాచారం. అంతేగాక ఇలా ట్యాక్సీలుగా తిరుగుతున్న వైట్‌బోర్డు వాహనాలపై మెరుపుదాడులు చేస్తే అధికార కూటమి పార్టీల నేతల నుండి రవాణాశాఖ అధికారులపై ఒత్తిళ్ళు తీవ్రంగా ఉంటున్నాయనేది కూడా ప్రధాన సమాచారం. దీనివల్ల రవాణాశాఖ అధికారులు కూడా వైట్‌బోర్డు వాహనాలను పట్టుకోవాలంటే వెనుకడుగువేయాల్సి వస్తోందని తెలుస్తోంది. పైగా ట్యాక్సీల్లో సీటింగ్ కెపాసిటీకి మించి ఒకరు ఎక్కువ వున్నా భారీ జరిమానా విధించి అలిపిరి టోల్‌గేట్‌లో నో ఎంట్రీ (నాట్ అలవుడ్) పెడుతున్న పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది కూడా వైట్‌బోర్డు వాహనాలను పట్టించుకోవడం లేదనేది ప్రధాన ఆరోపణ. దేశవిదేశాల నుండి తిరుమలకు యాత్రికులు వస్తున్నారు. రోజుకు 90వేలమంది వరకు యాత్రికులు వస్తుండగా తిరుపతి నుండి ఐదారు వేల మంది వరకు యాత్రికులు వైట్‌బోర్టు వాహనాల్లోనే తిరుమలకు వెళ్తున్నారనేది రవాణాశాఖ వర్గాల కథనం. దీనివల్ల ట్యాక్సీడ్రైవర్లకు నష్టం కలుగుతోంది. ఇప్పటికైనా తిరుమలకు ట్యాక్సీల పేరుతో తిరుగుతున్న వైట్‌బోర్డు వాహనాలపై చర్యలు తీసుకుంటే తప్ప ప్రభుత్వ ఆదాయం కూడా చేరదని కొందరు డ్రైవర్లు వ్యాఖ్యలు.



## రెండుసార్లు గరుడ వాహన సేవ

**నేడు గరుడ పంచమి • 28న శ్రావణ పౌర్ణమి**

**తిరుమల, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో నేడు సోమవారం గరుడ పంచమి పర్వదినం జరుగనుంది. ఈ సందర్భంగా రాత్రి 7 నుండి 9 గంటల వరకు మలయప్పస్వామి తనకెంతో ఇష్టవాహనమైన గరుడునిపై తిరుమాడ వీధులలో ఊరేగి భక్తులను అనుగ్రహించనున్నారు. ప్రతి యేటా తిరుమలలో గరుడ పంచమిని టిటిడి వేదోక్తంగా నిర్వహిస్తుంది. నూతన దంపతులు తమ వైవాహిక జీవితం ఆనందదాయకంగా ఉండేందుకు, స్త్రీలు తమకు పుట్టే సంతానం గరుడునిలాగా బలశాలిగా, మంచి వ్యక్తిత్వం గలవాడిగా ఉండేందుకు "గరుడపంచమి" పూజ చేస్తారని ప్రాశస్తం. ఇక ఆగస్టు 28న శ్రావణ పౌర్ణమి రోజున గరుడసేవను నిర్వహించనుంది. ఈ సందర్భంగా ఆరోజు మలయప్పస్వామి తన ఇష్టవాహనమైన గరుడవాహనంపై శనివారం రాత్రి 7 నుండి 9 గంటల నడుమ భక్తులను అనుగ్రహించనున్నారు.

# అలిపిరి నడక మార్గంలో ధూమపానం

**• పోలీసులకు ఫిర్యాదు... సెక్యూరిటీ సిబ్బందిపై వేటు**

**తిరుమల, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎంతో భక్తితో పవిత్రంగా తిరుమలకు వచ్చే భక్తులు ప్రశాంతంగా గోవింద నామస్మరణ చేసుకుంటారు. అలాంటిది ఆదివారం ఉదయం ఉన్నపళంగా భక్తుని వేషంలో ఓ వ్యక్తి ఏకంగా ధూమపానం సేవించి పొగను భక్తుల మధ్య వదలడంతో దుమారం రేపింది. అలిపిరి మెట్ల మార్గంలో భక్తులతో నడుస్తూ పొగతాగడంతో తోటి భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. నడకమార్గంలో నిశిత తనిఖీలు చేయాల్సిన భద్రత సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందని పై అధికారులు తేల్చారు. దీంతో నిరక్ష్యం వహించిన సెక్యూరిటీ సిబ్బందిపై వేటువేశారు. తిరుమల పవిత్రతను కాపాడాలని భక్తులకు టిటిడి ప్రసారసాధనాల ద్వారా ప్రచారం చేస్తుంది. అలిపిరి నడకమార్గంలో ఓ వ్యక్తి పొగతాగడం తీవ్ర వివాదానికి దారితీసింది. భక్తుల మనోభావాలను దెబ్బతీసే ఈ చర్యను టిటిడి తీవ్రంగా పరిగణించింది. నిబంధనలను ఉల్లంఘించిన ఆ వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంది. తిరుమల క్షేత్ర పవిత్రతను కాపాడేందుకు కాలినడక మార్గాల్లో, ఘాట్‌రోడ్డులో. తిరుమలకొండపై మద్యపానం, ధూమపానం, మాంసాహారం, మత్తుపదార్థాల వినియోగంపై పూర్తి నిషేధం అమలులో ఉంది. ఈ విషయం తెలిసినా ఆ వ్యక్తి నిబంధనలను అతిక్రమించి పవిత్రమైన నడకమార్గంలో ధూమపానం చేయడంతో సంచలనంగా మారింది. ప్రవేశ మార్గాల వద్ద తనిఖీలను మరింత కట్టుదిట్టం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.



## తిరుమలకు నూతన అగ్నిమాపక వాహనం

**తిరుమల, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన అగ్నిమాపక వాహనాలు కొరత ఉంది. ఈ నేపథ్యంలో రానున్న సెప్టెంబర్‌లో జరగనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముందే ఆదివారం ప్రభుత్వం నూతన అగ్నిమాపక వాహనాన్ని అందించింది. ఈ వాహనం 5వేల లీటర్ల నీటి సామర్థ్యం కలిగి ఉంది. ఇక్కడ అగ్నిమాపక కేంద్రంలో రెండు ఉన్నాయి. తిరుమలలో అటు ఆలయం, ఇటు పోటుతోబాటు ఎక్కడ అగ్నిప్రమాదాలు సంభవించినా, అత్యవసర సేవలకు, వివిఐపిల పర్యటనలో వీటి వినియోగం ఉంటుంది. ఆదివారం ప్రభుత్వం నుండి నూతన వాహనం రావడంతో పాత వాహనం స్థానంలో దీన్ని వినియోగించుకునే అవకాశం కలిగింది.




## తిరుమలలో పలాస భక్తుడు అదృశ్యం

**తిరుమల, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన బండారి సంతోష్ సంతు (28) తిరుమలలో అదృశ్యమైనట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. భార్య బండారి శ్రావణి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈనెల 8వ తేదీ తిరుమల శ్రీవారి దర్శనం క్యూ లైన్ నుండి సంతోష్ తన కుటుంబ సభ్యుల నుండి విడిపోయాడు. సిసిటివి పరిశీలనలో ఎలిఫెంట్ గేట్ వద్ద భద్రతా సిబ్బందితో వాగ్వాదం అనంతరం క్యూలైన్ నుండి బయటకు వెళ్లి, ఆ తరువాత మ్యూజియం వెనుక కనబడినట్లు గుర్తించారు. కుటుంబ సభ్యులు తిరుమల, తిరుపతి పరిసర ప్రాంతాలలో వెతికారు. అతని ఆచూకీ లేనందున తిరుమల వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు గానీ, తిరుమల 1 టౌన్ పోలీస్ స్టేషన్‌కు 94407 96771, 94407 96769, 08772 289027 సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# ఎచ్చెర్ల టిడిపి 'ఇన్‌ఛార్జ్' పీఠం ఎవరిది?

- ఐవీఆర్ఎస్ సర్వేలతో అధిష్ఠానం ముమ్మర కసరత్తు
- నియోజకవర్గ కేడర్‌లో తీవ్ర ఉత్కంఠ
- కుల సమీకరణాల కంటే సమన్వయ నాయకత్వానికే మొగ్గు చూపాలని కేడర్ డిమాండ్




**రణస్థలం (శ్రీకాకుళం జిల్లా), ఆగస్టు 16 ప్రభాతవార్త :** రాష్ట్రంలో తెలుగుదేశం–బీజేపీ–జనసేన కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నా, శ్రీకాకుళం జిల్లాలోని అత్యంత కీలకమైన ఎచ్చెర్ల నియోజకవర్గంలో తెదేపా ఇన్‌ఛార్జ్ పదవి ఇంకా కొలిక్కి రాలేదు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పొత్తు ధర్మంలో భాగంగా ఎచ్చెర్ల అసెంబ్లీ సీటును బీజేపీకి కేటాయించడంతో, అప్పటి నుంచి ఇక్కడ తెదేపాకు ఇన్‌ఛార్జ్ నియామకం వాయిదా పడుతూ వచ్చింది. నియోజకవర్గ స్థాయి బాధ్యుడు లేకపోవడంతో క్షేత్రస్థాయిలో పార్టీ పనులు, సంక్షేమ పథకాల సమన్వయం కుంటుపడి కార్యకర్తల్లో తీవ్ర నిరుత్సాహం నెలకొంది. **చారిత్రక కంచుకోటలో నాయకత్వ శూన్యత :** 1967 నియోజకవర్గాల పునర్విభజన అనంతరం రణస్థలం, లావేరు, ఎచ్చెర్ల, జి సిగడాం మండలాలు కలిపి ఎచ్చెర్ల నియోజకవర్గంగా ఏర్పడింది. ఎచ్చెర్ల నియోజకవర్గం మూడు దశాబ్దాలకు పైగా తెలుగుదేశం పార్టీకి బలమైన కంచుకోటగా గుర్తింపు పొందింది. పార్టీ చరిత్రలోనే ప్రత్యేక గుర్తింపు ఉన్న ఈ నియోజకవర్గానికి ఇన్‌ఛార్జ్‌ను నియమించడంలో పార్టీ అధిష్ఠానం ఇంతటి జాప్యం చేయడం శ్రేణులను కలవరపెడుతోంది. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో, సరైన నాయకత్వం లేకపోతే క్షేత్రస్థాయిలో పార్టీ తీవ్ర రాజకీయ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని కేడర్ హెచ్చరిస్తోంది. **ఐవీఆర్ఎస్ సర్వే వెనుక అధిష్ఠానం వ్యూహం:** గతంలో మాదిరిగా కేవలం పైస్థాయి నాయకుల సిఫార్సులు, పైరవీలపై ఆధారపడకుండా పార్టీ అధిష్ఠానం నేరుగా గ్రామస్థాయి కార్యకర్తల అభిప్రాయాల సేకరణకు పూనుకున్నారు. ఐవీఆర్ఎస్ ఆటోమేటెడ్ ఫోన్ కాల్స్ ద్వారా నియోజకవర్గంలోని బూత్ స్థాయి కార్యకర్తలు, స్థానిక నాయకుల ఓటింగ్ అభిప్రాయాలను సేకరిస్తున్నారు. పొత్తులో భాగంగా ఎమ్మెల్యే బీజేపీకి చెందినవారైనందున, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, స్థానిక అభివృద్ధి పనుల్లో తెదేపా కార్యకర్తలకు న్యాయం జరిగేలా సమన్వయం చేసుకోగల సమర్థుడైన సారథి కోసం పార్టీ అన్వేషిస్తోంది. కేడర్ చెదిరిపోకుండా కాపాడుతూ, పార్టీ ఉనికిని బలంగా నిలబెట్టే 'కమాండర్' ఎంపికే లక్ష్యంగా ఈ కసరత్తు సాగుతోంది. పోటాపోటీగా సీనియర్లు, యువ రక్తం : సర్వే ప్రక్రియ ముమ్మరం కావడంతో నియోజకవర్గంలో రాజకీయ వేడి తారస్థాయికి చేరింది. **ఆశావహుల్లో రోజురోజుకు పెరుగుతున్న ఉత్కంఠ :** ఎచ్చెర్ల తెదేపా ఇన్‌చార్జ్ పదవి కోసం ఆశావహుల్లో ఉత్కంఠత నెల్కొంది. దశాబ్దాల తరబడి పార్టీ జెండాను మోసి, ఆటుపోట్లను తట్టుకుని నిలబడిన తమ అనుభవానికి అధిష్ఠానం ప్రాధాన్యత ఇస్తుందా, దూకుడు, ఆర్థిక పరిపుష్టి ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తుందా అన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. అయితే పదవి కోసం ఆశావహులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. కుల సమీకరణాలా? సేవా దృక్పథమా? కులాల ప్రాతిపదికన మాత్రమే పదవులు కేటాయించే పాత పద్ధతులకు కాలం చెల్లిందని, సేవా తత్పరతతో నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే వారికే పగ్గాలు ఇవ్వాలని పార్టీ వర్గాలు గట్టిగా కోరుతున్నాయి. కుల మతాలకు అతీతంగా అందరినీ కలుపుకుపోయే వ్యక్తికి బాధ్యతలు అప్పగిస్తేనే పార్టీకి ప్రజాదరణ, విశ్వసనీయత పెరుగుతాయని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ఐవీఆర్ఎస్ నివేదిక ఆధారంగా పార్టీ అధిష్ఠానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందో ఎచ్చెర్ల తెదేపా సారథ్య పగ్గాలు ఎవరికి దక్కుతాయో మరి కొద్ది రోజుల్లో తేలనుంది.

## అల్లాబక్ష్‌పై పిడి యాక్ట్ నమోదు



**చిత్తూరు, ఆగస్టు 16 ప్రభాతవార్త:** పలు నేర కేసుల్లో పలుమార్లు పాల్గొని ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న చిత్తూరు వైయస్సార్ నగర్ కు చెందిన అల్లాబక్ష్ (36) పై పోలీసులు పిడి యాక్ట్ నమోదు చేశారు. ఎస్పీ తుషార్ డుడి ఆదేశాల మేరకు ఆదివారం అల్లాబక్ష్ ను పోలీసులు కడప సెంట్రల్ జైల్ కు తరలించారు. అల్లాబక్ష్ పలుమార్లు నేరపూరిత కార్యక్రమాల్లో పాల్గొనడం, ఎన్డి పి ఎస్ కేసుల్లో పలుమార్లు పట్టుబడటంతో పోలీసులు హెచ్చరించిన అల్లాబక్ష వారి మాటలు వినలేదు. సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా అల్లాబక్ష ప్రవర్తన ఉండడం, అలాగే అల్లాబక్షు యువతను మాదకద్రవ్యాల వైపు మళ్లించే అవకాశం ఉండడంతో అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖ నిర్ణయించింది. ఆర్థిక ప్రయోజనాల కోసం నేరపూరిత కార్యకలాపాలకు పాల్పడడం, ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం, అనేకమార్లు నేరపూరిత కార్యకలాపాల్లో పాల్గొనడం, ఎన్ డి పి ఎస్ కేసుల్లో పలుమార్లు పట్టుబడిన అతనిలో మార్పు రాకపోవడం కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ తుషార్ డూడిల సిఫార్సు మేరకు అల్లాబక్ష పై పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఎఆర్‌హెచ్‌సి 198 జి. విజయ్ ప్రకాష్ మృతి



**ముత్తుకూరు (నెల్లూరు), ఆగస్టు 16, ప్రభాతవార్త :** ముత్తుకూరు మండలంలోని జంగాలకండ్రిగ గ్రామంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏఆర్ హెచ్‌సి 198 జి. విజయ్ ప్రకాష్ మృతి చెందారు. పోలీసులు కథనం మేరకు వివరాలిలా వున్నాయి. నెల్లూరు జిల్లా ఏఆర్‌కు చెందిన ఏఆర్ హెచ్‌సి 198 జి. విజయ్ ప్రకాష్ విధులు ముగించుకుని ఏపీ 39 ఎల్‌హెచ్ 0608 నంబర్ గల స్కూటీపై ముత్తుకూరు వైపు వెళ్తుండగా శనివారం రాత్రి సుమారు 12.01 గంటల మధ్య జంగాలకండ్రిగ గ్రామంలోని భారత్ పెట్రోలియం బంక్ ఎదురుగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ప్రాథమిక సమాచారం మేరకు ఆయన ప్రయాణిస్తున్న స్కూటీ అదుపుతప్పి రోడ్డుకు ఎడమవైపుకు వెళ్లి స్కిడ్ కావడంతో ఆయన కింద పడిపోయారని పోలీసులు తెలిపారు. రోడ్డుపై పడిపోయిన ఆయనను స్థానికులు గుర్తించి వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి, చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారన్నారు. అయితే, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ జి. విజయ్ కుమార్ మృతి చెందారని ఎస్ఐ తెలిపారు. ఇదే విషయమై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## కాకరపల్లి థర్మల్ 1108జీవో రద్దు వెంటనే చేయాలి



**సంతబొమ్మాళి, (శ్రీకాకుళం జిల్లా) ఆగస్టు 16, ప్రభాతవార్త :** శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం కాకరపల్లి థర్మల్ ప్లాంట్ 1108 జీవోను రద్దుచేసి ఆ భూములను మత్స్యకార సొసైటీకి లీజుకివ్వాలని థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ ప్రభుత్వానికి డిమాండ్ చేస్తూ తీర్మానం చేసింది. వడ్డీతాండ్రలోని థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ నిర్వహిస్తున్న దీక్ష శిబిరానికి 5842రోజులు పూర్తవుతున్న సందర్భంగా (17వ సంవత్సరంలో అడుగుపెడుతున్న వేళ)ఆదివారం దీక్ష శిబిరం వద్ద ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మత్స్యకారులపైన, థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకత్వంపైన, కార్యకర్తలపైన అక్రమంగా బనాయించిన పోలీసు కేసులను తక్షణమే రద్దు చేయాలని, కాకరాపల్లి తంపర భూముల్లో ప్రైవేటు వ్యక్తులు అక్రమంగా ఏర్పాటు చేసుకున్న చేపల చెరువులను వెంటనే రద్దు చేయాలని కాకరాపల్లి థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ డిమాండ్ చేసింది. అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, స్థానిక రైతు సంఘం నాయకులు కోత మధుసూదనరావు, మత్స్యకార సొసైటీ నాయకులు మాట్లాడారు. ముందుగా ప్రధాన వక్తగా సన్నశెట్టి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమాచార సేవలో ప్రతిభకు పురస్కారం..

**విజయవాడ.ఆగస్టు16,ప్రభాతవార్తప్రతినిధి:** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా విధి నిర్వహణలో అంకితభావం, సమర్థతతో ఉత్తమ పనితీరు కనబరిచిన జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ(ఐఅండ్‌పీఆర్) అధికారులు, విశ్రాంత అధికారికి ప్రశంసా పత్రాలు లభించాయి. విజయవాడలో మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో నిన్న జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ చేతులు మీదుగా డివిజనల్ పీఆర్‌వో కె.రవి, అసిస్టెంట్ ఇంజనీర్ కె.ధనుంజయ రాజు, ఏపీఎస్ (రిటైర్డ్) వి.వి.ప్రసాద్‌లకు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ప్రముఖుల పర్యటనలతో పాటు వివిధ కార్యక్రమాలకు సంబంధించి పత్రికా ప్రకటనల రూపకల్పన, ప్రభుత్వ కార్యక్రమాలు–అభివృద్ధి కార్యక్రమాల సమాచారాన్ని మీడియాకు సమర్థవంతంగా చేరవేయడంలో ఉత్తమ పనితీరు కనబరిచిన డివిజనల్ పీఆర్‌వో కె.రవికి ప్రశంసా పత్రం అందజేశారు. అలాగే పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టమ్ నిర్వహణలో కీలకంగా వ్యవహరిస్తున్న కె.ధనుంజయ రాజుకు, మీడియా కోఆర్డినేషన్‌లో ఉత్తమ సేవలు అందించిన వి.వి. ప్రసాద్‌కు ప్రశంసా పత్రాలు అందజేశారు.

## ఇన్‌స్పెక్టర్ గోవిందరావుకు (మెరిటోరియస్) పురస్కారం

**విజయవాడ.ఆగస్టు 16,ప్రభాతవార్తప్రతినిధి:** పోలీసుశాఖలో విశేష సేవలందించిన ఇన్‌స్పెక్టర్ మామిడి గోవిందరావు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన యోగ్యత (మెరిటోరియస్) పురస్కారాన్ని అందుకున్నారు. 2025 సంవత్సరానికి గాను ప్రకటించిన ఈ పురస్కారాన్ని రాజధాని అమరావతిలో నిన్న నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆయనకు ప్రదానం చేశారు. విధి నిర్వహణలో అంకితభావం, క్రమశిక్షణతో పాటు పోలీసుశాఖకు అందించిన విశేష సేవలకు గుర్తింపుగా గోవిందరావును ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ప్రస్తుతం ఆయన ఆంధ్రప్రదేశ్ పోలీస్ అకాడమీలో విధులు నిర్వర్తిస్తున్నారు. వివిధ హోదాల్లో, ప్రాంతాల్లో పనిచేసిన ఆయన సమర్థ అధికారిగా గుర్తింపు పొందారు. పార్వతీపురం నుంచి ప్రస్థానం. గోవిందరావు తండ్రి రామినాయుడు విశ్రాంత ఉపాధ్యాయుడు. గోవిందరావుడిగ్రీ వరకు పార్వతీపురంలో విద్యాభ్యాసం చేశారు. అనంతరం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ పూర్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక పోలీసు (ఏపీఎస్పీ) విభాగంలో ఆర్ఎస్ఐగా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అని తెలిపారు.

## నాలుగు సార్లు నన్ను గెలిపించారు..
# మీకు ఏం ఇచ్చినా తక్కువే

- నా నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలే నాకు తొలి ప్రాధాన్యం




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత ♦ టిడిపి నేతలతో సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

**అనంతపురం, ఆగస్టు 16 ప్రభాతవార్త:** నాలుగు సార్లు నన్ను గెలిపించి ఎమ్మెల్యేగా చేసిన.. ప్రజలకు, కార్యకర్తలకు ఏం ఇచ్చినా తక్కువేనని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆమె సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని 6మండలాలకు చెందిన 52మందికి రూ.54.39లక్షల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలు, మండలాల నాయకులు, లబ్ధిదారుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న వారు ఎమ్మెల్యే సునీతతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. రెండేళ్లలో 1430 మందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.11 కోట్లు అందజేసినట్లు తెలిపారు. గతంలో ఎప్పుడూ ఇంత పెద్ద ఎత్తున సాయం అందలేదన్నారు. అనారోగ్య కారణాలతో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్న వారికి ఇది ఎంతగానో ఊరటనిస్తోందన్నారు. నా వద్దకు ఎవరైనా సరే ఈ సాయం కోసం వస్తే కాదనకుండా ముఖ్యమంత్రి వద్దకు ఫైల్ తీసుకెళ్తున్నానని చెప్పారు. తనను నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి చేయడమే కాకుండా, ఇలా వ్యక్తిగతంగా కూడా సాయం చేయడం నా బాధ్యత అన్నారు. ఏ కార్యకర్త, నాయకుడికైనా సరే ఏ కష్టం వచ్చినా నేను ఉంటానన్నారు. **ఇంటింటికీ కార్యక్రమాన్ని వేగవంతం చేయండి :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సునీత పార్టీ నాయకులకు ఆదేశించారు. తన క్యాంప్ కార్యాలయంలో పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న డోర్ టూ డోర్ కార్యక్రమం, సర్ ప్రక్రియ మీద సమీక్ష నిర్వహించారు. డోర్ టు డోర్ కార్యక్రమంలో 100 ఇళ్ల కంటే తక్కువ తిరిగిన బూత్ ల గురించి, ఇప్పటి వరకు 50శాతం లోపు ఉన్న వాటి గురించి ప్రధానంగా ప్రస్తావించారు. కార్యక్రమం ప్రారంభమై 20రోజులు గడుస్తున్నా, ఎందుకు ఇంత నెమ్మది సాగుతోందని ఆరా తీశారు. పార్టీ ఏదైనా నిర్దేశించినప్పుడు దానిని కచ్చితంగా చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడ్డవారికే ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. మరోవైపు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా అందజేసిన నోటీసులను పరిశీలించి వివరణ ఇవ్వాలని, ఓటరు జాబితాలో తప్పులు, అభ్యంతరాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఎవరైనా ఓట్లు కోల్పోయి ఉన్నా, లేదా కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియపై దృష్టి సారించాలని ఆదేశించారు.

## నిశ్చితార్థ వేడుకల్లో వైసిపి, టిడిపి వర్గాల మధ్య ఘర్షణ

- జె.సి ప్రభాకర్‌రెడ్డిపై దూసుకొచ్చిన వైసిపి నాయకులు రామచంద్రారెడ్డి - ఘర్షణలో కారు అద్దాలు ధ్వంసం
- జె.సి ప్రభాకర్‌రెడ్డికి నచ్చచెప్పిన మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి
- సిఐ నారాయణరెడ్డి చొరవతో తప్పిన పెద్ద వివాదం




నిశ్చితార్థ వేడుకకు హాజరైన మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి, జె.సి దివాకర్‌రెడ్డి ♦ఘర్షణలో ధ్వంసమైన కారు అద్దాలు♦ జె.సి ప్రభాకర్‌రెడ్డికి నచ్చచెబుతున్న మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి

**తాడిపత్రిఅర్బన్, ఆగస్టు 16 ప్రభాతవార్త:** తాడిపత్రిలో ఓ వివాహ నిశ్చితార్థ వేడుకల్లో వైసిపి, టిడిపి వర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. ఈ ఘర్షణలో కావేరిసముద్రంకు చెందిన హనుమంతరెడ్డి వాహనం అద్దాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కావేరిసముద్రానికి చెందిన సంజీవరెడ్డి కుమారుడు నిశ్చితార్థ వేడుకను ఆదివారం అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలో కడప రోడ్డులోని ఎస్ఆర్‌టి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేశారు. కావేరిసముద్రం సంజీవరెడ్డికి రాజకీయంగా వైసిపి, టిడిపి నాయకులతో బంధుత్వాలు ఉన్నాయి. కావేరిసముద్రం సంజీవరెడ్డి తండ్రి పుల్లారెడ్డి తాడిపత్రి మండలంలో మంచి పేరు గల నాయకుడు. గత కొన్ని సంవత్సరాల క్రితం ఆయన ఫ్యాక్షన్ గొడవల్లో మృతి చెందారు. ఆయనకు ఇరువురు కుమారులు. సంజీవరెడ్డితో పాటు శ్రీరామిరెడ్డి కావేరిసముద్రం సర్పంచుగా పని చేస్తూ ప్రస్తుతం తెలంగాణలోని తాండూరులో నివాసం ఉంటున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంచి సన్నిహితులు. తన సోదరుడు కుమారుడు నిశ్చితార్థ వేడుకలకు ఆయన కుటుంబసభ్యులతో సహ హాజరయ్యారు. ఆయనతో పాటు వైఎస్ఆర్‌సిపిలో ఉన్న కందిగోపుల మురళిప్రసాద్‌రెడ్డి, ఇగుడూరు మాజీ సర్పంచు రామచంద్రారెడ్డి, హనుమంతరెడ్డి తదితరులు హాజరుకాగా, రాష్ట్ర మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి, మాజీ మంత్రి జె.సి దివాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డిలతో పాటు టిడిపి నాయకులు హాజరయ్యారు. ఈ సమయంలో నిశ్చితార్థ వేడుకల్లో మొదటి వరుసలో ఉన్న కందిగోపుల మురళిప్రసాద్‌రెడ్డిని చూసి జె.సి ప్రభాకర్‌రెడ్డి ఇతన్ని బయటికి పంపమని సంజీవరెడ్డికి సూచించారు. అనంతరం శ్రీరామిరెడ్డి జె.సి ప్రభాకర్‌రెడ్డి వద్దకు వెళ్లి బాగున్నారా అంటూ పలకరించగా అతనిని కూడా బయటికి పంపండి అని చెప్పారు. హనుమంతరెడ్డిని తనకున్న చనువుతో కొద్దిగా హెచ్చరిస్తూ మాట్లాడడం జరిగింది. అందరూ మీరే ఉన్నారు. మేము ఎందుకంటూ జె.సి ప్రభాకర్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ముందు వరుసనుంచి వెళ్ళిపోతూ మధ్యలో కూర్చున్నారు. ఆ సమయంలో పక్కకు వస్తున్న శ్రీరామిరెడ్డిని ఇగుడూరు గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి చేతులు పట్టుకొని జె.సి ప్రభాకర్‌రెడ్డి వద్దకు తన కుమారులతో కలిసి దూసుకువచ్చేందుకు ప్రయత్నించారు. ఇది గమనించిన జె.సి ప్రభాకర్‌రెడ్డి అనుచరులు ఒక్కసారిగా వారిని ఎదుర్కొనేందుకు ప్రయత్నించడంతో అక్కడ ఉన్న సిఐ నారాయణరెడ్డి ఇగుదురు రామచంద్రారెడ్డిని, ఆయన కుమారున్ని, వైసీపీ నాయకులను పక్కకు ఈడ్చిపడవేశారు. అనంతరం జె.సి ప్రభాకర్‌రెడ్డి ఫంక్షన్ హాల్ బయటకు వచ్చి కూర్చున్నారు. విషయం తెలుసుకున్న జె.సి ప్రభాకర్‌రెడ్డి అనుచరులు ఒక్కసారిగా ఫంక్షన్ హాల్ వద్దకు చేరుకుని అక్కడ ఉన్న కారు అద్దాలను పూర్తిగా ధ్వంసం చేశారు. ఆ సమయంలో మంత్రి జనార్ధన్‌రెడ్డి జె.సి ప్రభాకర్‌రెడ్డి వద్దకు వచ్చి నచ్చజెప్పి ఆయనను ఫంక్షన్ హాల్ వద్ద నుంచి ఇంటికి పంపించారు. జె.సి ప్రభాకర్‌రెడ్డి ఇంటికి వెళ్లిన తర్వాత ఒక్కసారిగా పెద్దఎత్తున టిడిపి నాయకులు, జె.సి అనుచరులు ఫంక్షన్ హాల్ వద్దకు చేరుకొని ఘర్షణకు దిగిన వైసిపి నాయకులపై దాడి చేయడానికి ప్రయత్నించగా సిఐ నారాయణరెడ్డి టిడిపి నాయకులు ఎస్‌వి రవీంద్రారెడ్డికి ఉన్నతాధికారుల నుంచి ఫోన్లో మాట్లాడించగా వారు ఫంక్షన్ హాల్ వద్ద నుంచి వెళ్లిపోయారు. వైసిపి నాయకులను ఒక రూములో ఉంచి టిడిపి నాయకులంతా వెళ్లిన తర్వాత వారిని కడప జిల్లా వైపుకు పోలీసులు బందోబస్తుతో పంపించారు. వైసీపీ నాయకుడు రామచంద్రారెడ్డి జె.సి ప్రభాకర్‌రెడ్డిపై దాడికి రెచ్చగొట్టడం వల్లనే ఈ ఘర్షణ చెలరేగిందని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. జె.సి ప్రభాకర్‌రెడ్డికి హనుమంతరెడ్డి, శ్రీరామిరెడ్డిలు ఒకప్పుడు ప్రధాన అనుచరులుగా ఉండేవారు. వారి మధ్య చెలరేగిన మనస్పర్థలు వల్ల ప్రస్తుతానికి దూరంగా ఉన్నారు. ఫంక్షన్ హాల్ వద్ద ఘర్షణ జరుగుతుందన్న ఉద్దేశంతో టౌన్ సిఐ ఆరోహణరావు, పెద్దవడుగూరు సిఐ నరేందర్‌రెడ్డి, సబ్ డివిజన్‌లోని పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకొని శాంతిభద్రతలను పర్యవేక్షించారు.

## భోగాపురంలో జిఎంఆర్‌విఎఫ్ కేంద్రం ప్రారంభం

**విజయనగరం (భోగాపురం), ఆగస్టు 16 ప్రభాతవార్త :** ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, మానవతావాది, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్ ఆదివారం భోగాపురంలోని జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ (జీఎంఆర్‌వీఎఫ్) నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన యువ శిక్షణార్థులు, సిబ్బందితో ముచ్చటించి, వారి ఆశయాలు, కేంద్రంలో అందిస్తున్న శిక్షణా కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. తమ ముందున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వారికి ఆశీస్సులు అందించారు. నైపుణ్యాలు, ఉపాధి, సుస్థిర జీవనోపాధి ద్వారా స్థానిక యువతకు సాధికారత కల్పించాలనే కేంద్రం లక్ష్యాన్ని గురుదేవ్ ఆశీర్వదించారు. భోగాపురం పర్యటనలో భాగంగా ఆయన అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని కూడా సందర్శించారు. జీఎంఆర్ గ్రూప్ చైర్మన్ జి.ఎం.రావు విమానాశ్రయంలో ఆయనకు స్వయంగా మార్గనిర్దేశం చేస్తూ, విమానాశ్రయ అభివృద్ధి, మౌలిక వసతులు, ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్‌కు నూతన విమానయాన ద్వారంగా దాని దార్శనికత గురించి వివరించారు. జీఎంఆర్ గ్రూప్‌కు చెందిన కార్పొరేట్ సామాజిక బాధ్యత విభాగమైన జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ (జీఎంఆర్‌వీఎఫ్), విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో తన సమాజ అభివృద్ధి కార్యక్రమాలను మరింత బలోపేతం చేస్తోంది. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి కేంద్రం ద్వారా ఏటా 1,000 మంది యువతకు శిక్షణ అందించే సామర్థ్యం ఉంది. మారుమూల, వెనుకబడిన ప్రాంతాలకు చెందిన యువతకు సాధికారత కల్పించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా, ఉద్యోగ ఆధారిత శిక్షణను అందించడంతో పాటు, శిక్షణార్థులను దేశంలో, విదేశాల్లోని ఉపాధి అవకాశాలతో అనుసంధానం చేస్తారు. శిక్షణార్థులతో జరిగిన సమావేశంలో గురుదేవ్‌కు కేంద్రంలో అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలు, మౌలిక వసతులు, ఉపాధి ఆధారిత కార్యక్రమాల గురించి వివరించారు. యువత ఆశయాలను ఆయన తెలుసుకుని, తమ కలలను సాకారం చేసుకునేందుకు కష్టపడి పని చేయాలని ప్రోత్సహించారు. తమ శక్తి, ప్రతిభను తమతో పాటు ఇతరుల జీవితాల్లోనూ ఆనందాన్ని తీసుకురావడానికి వినియోగించాలని సూచించారు.

## అన్నను చంపిన తమ్ముడు..



**బ్రహ్మంగారిమఠం ఆగస్టు 16, ప్రభాతవార్త :** కడప జిల్లాలోని బ్రహ్మంగారి మఠం మండల కేంద్రమైన తెలుగు గంగ ప్రాజెక్ట్ వెళ్లే దారిలో వున్న రజక అన్నదాన సత్రానికి సమీపంలో నివాసం వున్న వజ్రాల సుబ్బారాయుడు, హైమావతి లకు ఇద్దరు కుమారులలో పెద్ద కుమారుడు వజ్రాల వెంకటసుబ్బయ్య, చిన్న కుమారుడు సురేష్ ఆదివారం మంచం పైన పడుకొని వున్నా వెంకట సుబ్బయ్య 45 అన్నను అతి కిరాతకంగా గొడ్డలితో నరికి చంపాడు. వివరాల్లోకెళితే వీరిద్దరూ మద్యానికి బానిసై కావడంతో వాళ్ళను భార్యలు వదిలేసి వెళ్లిపోయారు. అప్పటి నుండి వారు తల్లి హైమావతి వద్దనే ఉంటున్నారు. శనివారం రాత్రి తమ్ముడు సురేష్ చికెన్ పకోడీ తెచ్చుకోగా అన్న వెంకట సుబ్బయ్య శనివారం ఎందుకు తెచ్చుకున్నావని అనడంతో ఇద్దరి మధ్య జరిగిన గొడవను మనసు పెట్టుకొని ఆదివారం అన్న వెంటసుబ్బయ్యను తమ్ముడు సురేష్ గొడ్డలి తో నరికి చంపాడు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి హత్యకు సంబంధించిన దర్యాప్తు చేపడతామన్నారు.


## ఉద్యోగుల ఉద్యమంపై 28న కార్యాచరణ

**విజయవాడ, ఆగస్టు 16 (ప్రభాతవార్త):** తమకు న్యాయబద్ధంగా రావాల్సిన బకాయిలు, సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేనందున ఉద్యమానికి సిద్ధం కావాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల అమరావతి జెఎసి నిర్ణయించింది. విజయవాడ రెవెన్యూ భవన్ లో ఆదివారం జరిగిన వివిధ ప్రభుత్వశాఖల ఉద్యోగుల సంయుక్త సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వశాఖల డివిజన్ స్థాయి నుంచి జిల్లా స్థాయి, జోనల్, రాష్ట్ర స్థాయి నాయత్వాలతోఈ నెల 28వ తేదీన విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య ఆడిటోరియంలో సమావేశం కానున్నట్లు జె.ఎ.సి. చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి, ఉద్యమ కమిటీ కన్వీనర్ పలిశెట్టి దామోదర్ తెలిపారు. ప్రభుత్వమే ఉద్యోగుల సమస్యలు పరిష్కారంలో నిరక్ష్యం చేస్తూ ఉద్యమానికి ప్రేరేపిస్తోందిని అన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, సమస్యలను పరిష్కరించకుండా పదేపదే కాలయాపన చేయడం ద్వారా ప్రభుత్వమే ఉద్యోగులను ఉద్యమం వైపు నడిపిస్తోందని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి స్పష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.

## రూ.15 లక్షలు లంచం డిమాండ్ సిబిఐకి చిక్కిన రైల్వే ఇంజనీర్

**విజయవాడ, ఆగస్టు 16 (ప్రభాతవార్త):** విజయవాడలో లంచం తీసుకుంటూ రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ సీబీఐకి చిక్కారు. విజయవాడ రైల్వే డివిజనల్ కార్యాలయంలో సీనియర్ సెక్షన్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న బాపిరాజు ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ పనుల వ్యవహారంలో కాంట్రాక్టరుకుబిల్లులు చెల్లించేందుకు లంచం డిమాండ్ చేసినట్లు విశాఖపట్నంలోని సీబీఐ అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో సిబిఐ అధికారులు విచారణ జరిపి ఆదివారం కాంట్రాక్టరు నుంచి రూ.15 లక్షలు లంచం తీసుకుంటూ ఉండగా ఇంజనీరును పట్టుకున్నారు. ఆయనతో పాటు ప్రైవేటు వ్యక్తి శ్రీచంద్ అనే వ్యక్తిని సైతం సిబిఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పనుల కేటాయింపులోనూ అనుకూలంగా వ్యవహరించేందుకు కాంట్రాక్టర్ నుంచి బాపిరాజు లంచం డిమాండు చేసినట్లు సమాచారం. రూ.179.50కోట్ల విలువైన ఆటోమెటిక్ బ్లాక్ సిగ్నలింగ్ ప్రాజెక్టుకు సంబంధించి రూ.7 కోట్ల బోనస్ లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రాజెక్టుకు సంబంధించిన లావాదేవీలు, కాంట్రాక్ట్ పనులు, బిల్లుల మంజూరు వ్యవహారాలపై సిబిఐ అధికారులు వివరాలను సేకరిస్తున్నారు.

## రాజకీయాలను డబ్బుమయం చేసింది చంద్రబాబే



**పుత్తూరు(నగరి), ఆగస్టు 16 ప్రభాతవార్త :** డబ్బులు తీసుకుని ఓట్లేస్తున్నారని, ఫలితంగా గెలిచిన ఎమ్మెల్యేలు కూడా ప్రజా క్షేమం వదిలిపెట్టి డబ్బు సంపాదనకే మొగ్గు చూపుతున్నారని, అందువల్ల డబ్బులు తీసుకోకుండా ఓట్లేయండని స్వాతంత్ర దినోత్సవం రోజున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళలకు హితబోధ చేయడం పట్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పర్యాటక శాఖ మాజీ మంత్రి ఆర్.కె.రోజా తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం నగరి పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ...అసలు రాజకీయాలను డబ్బు మయం చేసింది చంద్రబాబునాయుడే అన్నారు. ఎన్టీఆర్‌ను వెన్నుపోటుకు, ఇతర పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం కోసం, గతంలో తెలంగాణాలో కెసిఆర్ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడానికి ఇలా డబ్బుతోనే రాజకీయాలు నడపడంలో చంద్రబాబును మించిన వారు లేరని విమర్శించారు. మహిళల కోసం ఇచ్చిన హామీలేవీ నెరవేర్చకుండా తిరిగి వారిని డబ్బులకు వెంపర్లాడే వాళ్లలా చిత్రీకరించి మాట్లాడడం సిగ్గు చేటన్నారు. మహిళలకు నీతులు చెప్పడానికి ముందు చంద్రబాబు వారికిచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎన్నికలపుడు ఇచ్చిన హామీల మేరకు ఎస్సీ,ఎస్టీ మహిళలకు 50 ఏళ్లకే పెన్షన్, 18 ఏళ్లు నిండిన ప్రతి ఆడపిల్లకు నెలకు రూ. 1500, డ్వాక్రా మహిళలకు పది లక్షల వరకూ సున్నా వడ్డీతో రుణాలు, నిరుద్యోగ మహిళలకు ఒక్కొకరికి నెలకు రూ. 3000 వేలు వంటి ఏ పథకాన్ని చంద్రబాబు అమలు చేయలేదని తెలిపారు.

## ప్రియాంక హత్య కేసు దర్యాప్తు అధికారిగా దేవరాజ్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,ఆగస్టు16,ప్రభాతవార్త:** పీజీ వైద్య విద్యార్థిని ప్రియాంక హత్య కేసు దర్యాప్తును ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం వేగవంతం చేసింది. కేసు దర్యాప్తు అధికారిగా ఐపీఎస్ అధికారి పాటిల్ దేవరాజ్ మునీష్‌ను నియమిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దర్యాప్తును అన్ని కోణాల్లో చేపట్టి, నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించినట్లు సమాచారం. కేసు దర్యాప్తులో ప్రకాశ్‌నగర్ సీఐపై వచ్చిన విమర్శలు, ఘటనకు సంబంధించిన వాస్తవాలు బయటకు రాకుండా తొక్కిపెట్టే ప్రయత్నాలు జరిగాయన్న ఆరోపణలపైనా లోతైన విచారణకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా సంబంధిత ఫోన్ కాల్ డేటాను సైతం పరిశీలించనున్నట్లు సమాచారం. కొత్త దర్యాప్తు అధికారికి రాజమహేంద్రవరం సౌత్‌జోన్ డీఎస్పీ శివప్రియ, ప్రకాశ్‌నగర్ సీఐ బాజీలాల్ సహకారం అందించనున్నారు. కేసులో ఇప్పటివరకు వెలుగులోకి వచ్చిన అంశాలతో పాటు అనుమానాస్పద పరిణామాలు, సంబంధిత వ్యక్తుల పాత్రపై సమగ్రంగా విచారణ జరిపే అవకాశం ఉంది. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో దర్యాప్తు మరింత కీలక దశకు చేరింది. కొత్త దర్యాప్తు అధికారి విచారణతో ప్రియాంక మృతి వెనుక ఉన్న అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

## యుగంధర్‌ను అరెస్ట్ చేసిన సిసిఎస్ పోలీసులు

**విజయవాడ.ఆగస్టు 16,ప్రభాతవార్తప్రతినిధి:** భూములపై బ్యాంకు రుణాలు ఇప్పిస్తానని నమ్మించి ఆస్తి పత్రాలను దుర్వినియోగం చేసి, భారీ మోసాలకు పాల్పడిన అంతర్ రాష్ట్ర నిందితుడు నునావత్ యుగంధర్‌ను సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎకనామిక్ ఆఫెన్సెస్ వింగ్ ఆధ్వర్యంలో చేపట్టిన దర్యాప్తులో యుగంధర్‌పై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 2016 నుంచి 20కి పైగా క్రిమినల్, సివిల్ కేసులు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో 12 క్రిమినల్ కేసులతో పాటు 8 సివిల్, నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్‌కు సంబంధించిన కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. తాజాగా ఓ బాధితుడికి రూ.60 లక్షల ఆర్థిక సాయం ఇప్పిస్తానంటూ లీవీగే చేసుకున్న యుగంధర్, అతడికి తెలియకుండా ఆస్తి పత్రాలను దుర్వినియోగం చేసి మూడో వ్యక్తి పేరిట ఆస్తిని బదిలీ చేసినట్లు దర్యాప్తులో తేలింది. అనంతరం అదే ఆస్తిని ఆధారంగా చేసుకుని యాక్సిస్ బ్యాంక్ నుంచి ఏకంగా రూ.1.50 కోట్ల రుణం తీసుకున్నాడు. రుణం డిఫాల్ట్ కావడంతో బ్యాంకు నుంచి బాధితుడికి నోటీసులు రావడంతో అసలు మోసం వెలుగులోకి వచ్చింది. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించగా, దర్యాప్తు చేపట్టిన సీసీఎస్ అధికారులు యుగంధర్ వ్యవహారాలను వెలుగులోకి తీసుకని వచ్చారు. దర్యాప్తులో యుగంధర్ ఇదే తరహాలో పలువురిని మోసం చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఇప్పటివరకూ 30 మందికి పైగా బాధితులు ఉన్నట్లు, వారి నుంచి రూ.10 కోట్లకు పైగా మోసం చేసినట్లు విచారణలో వెల్లడైంది. భూములు, రుణాలు ఇప్పిస్తామంటూ వచ్చే వ్యక్తుల మాటలను గుడ్డిగా నమ్మవద్దని సీసీఎస్ పోలీసులు హెచ్చరించారు.

ఆట



## మహిళల హాకీ వరల్డ్ కప్ ఆరంభ మ్యాచ్‌లో
# చైనాతో భారత్ డ్రా

**నెదర్లాండ్స్:** మహిళల హాకీ ప్రపంచ కప్ 2026 లో చైనా, భారత్ జట్లు డ్రా చేసుకున్నాయి. ఆదివారం నెదర్లాండ్స్‌లోని ఆమ్‌స్టెల్వీన్‌లోని వాగెనర్ స్టేడియంలో జరిగిన మహిళల హాకీ ప్రపంచ కప్, గ్రూప్ డి ఆరంభ మ్యాచ్‌లో భారత్, చైనా జట్లు 2-2తో డ్రా చేసుకున్నాయి. ఈ మ్యాచ్‌లో భారత్ రెండు సార్లు ఆధిక్యంలోకి వెళ్లినా ఒలింపిక్ రజత పతక విజేత చైనా ప్రతీసారీ పుంజుకుని స్కోరును సమం చేసింది. మ్యాచ్ ప్రారంభం నుండే భారత్ దూకుడు ప్రదర్శించింది. 8వ నిముషంలో నవ్‌నీత్ కౌర్ గోల్ చేయడంతో భారత్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే తొలి క్వార్టర్ ముగిసే సమయానికి చైనా తిరిగి పుంజుకుంది. 15వ నిముషంలో జాంగ్ గోల్ చేయడంతో స్కోర్ 1-1గా సమమైంది. రెండో క్వార్టర్‌లో భారత్ మరోసారి ఆధిక్యంలోకి వచ్చింది. 25వ నిముషంలో దీపిక గోల్ చేయడంతో భారత్ 2-1తో ముందంజ వేసింది. భారత్ ఆధిక్యాన్ని కాపాడుకుంటూ విజయంపై ఆశలు పెట్టుకున్న సమయంలో చైనా మరోసారి ఎదురుదాడి చేసింది. 39వ నిముషంలో మా నింగ్ గోల్ చేయడంతో స్కోర్ 2-2గా మారింది. ఆ తర్వాత ఇరు జట్లు గెలుపు కోసం తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ మరో గోల్ రాకపోవడంతో చివరకు మ్యాచ్ డ్రా గా ముగిసింది. దీంతో చైనాతో పాయింట్లు పెంచుకున్న భారత్ పూల్ డి లో తదుపరి మ్యాచ్ కీలకంగా మారింది. ఈ నెల 18న దక్షిణాఫ్రికాతో భారత్ జట్టు తలడనుంది.



# స్విస్ లేడీస్ ఓపెన్‌లో కట్ సాధించిన ఏకైక భారత్ క్రీడాకారిణి ప్రణవి

**స్విట్జర్లాండ్:** స్విస్ లేడీస్ ఓపెన్‌లో హాఫ్‌వే కట్‌ను దాటిన ఏకైక భారతీయ గోల్ఫర్‌గా ప్రణవి ఉర్స్ నిలిచింది. అలాగే రెండో రౌండ్‌లో విభిన్నమైన ప్రదర్శనల తర్వాత భారత్‌కే చెందిన త్వేసా మాలిక్, దీక్షా దాగర్ టోర్నమెంట్ నుండి నిష్క్రమించారు. గోల్ఫ్‌పార్క్ హోల్జ్‌హౌసెర్న్‌లో ఆదివారం జరిగిన రెండు-అండర్ 70తో ప్రారంభించిన ప్రణవి, మరో రెండు-అండర్ 69 స్కోరు చేసి, మొత్తం మూడు -అండర్ 139 స్కోరుతో వారాంతంలోకి ప్రవేశించే ముందు 28వ స్థానంలో నిలిచింది. త్వేస తన తొలి రౌండ్‌లోని 72 స్కోరును మెరుగుపరుచుకుని వన్-అండర్ 71 స్కోరు చేసినప్పటికీ, వన్‌ఓవర్ పార్‌తో ముగించి, ఒక్క స్ట్రోక్ తేడాతో కట్‌ను కోల్పోయింది. ప్రణవి, త్వేసల మాదిరిగానే దీక్ష, తొలి రౌండ్‌లోని 71 స్కోరు తర్వాత 78 స్కోరు చేసి, సెవెన్ ఓవర్‌తో ముగించింది. స్వీడన్‌కు చెందిన కైసా ఆర్వెఫ్యాల్, 64 స్కోరుతో ప్రారంభించి, బోగీ రహిత 66 స్కోరుతో టోర్నమెంట్‌పై తన పట్టును మరింత బలపరుచుకుంది. ఆమె సాధించిన 12 అండర్ మొత్తం ఆమెకు మూడు షాట్ల ఆధిక్యాన్ని ఇస్తుంది. అలాగే ఆర్వెఫ్జాల్ తన రెండవ రౌండ్‌ను బ్యాక్ నైన్‌లో ప్రారంభించి, పార్‌ఫోర్ 10వ హోల్‌లో బర్డీ సాధించి, ఆ తర్వాత వరుసగా ఎనిమిది పార్స్ చేసింది. అనంతరం ఫ్రంట్ నైన్‌లో మొదటి, రెండవ, నాల్గవ మరియు ఏడవ హోల్స్‌లో మరో నాలుగు బర్డీలు సాధించి స్పష్టమైన ఆధిక్యాన్ని సంపాదించింది.

# ఆసియా కప్: భారత్‌తో పోరుకు పాక్ రెడీ



**న్యూఢిల్లీ:** భారత్, పాకిస్తాన్ మహిళల క్రికెట్ జట్లు వచ్చే నెల ప్రారంభంలో తలపడనున్నాయి. ఈ మ్యాచ్ టీ20 ఆసియా కప్‌లో భాగంగా జరగనుంది. మహిళల ఆసియా కప్ ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 13 వరకు దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరగనుంది. గ్రూప్ ఎ లో పాకిస్తాన్‌తో పాటు హాంకాంగ్‌చైనా, భారత్, థాయిలాండ్ ఉన్నాయి. పాకిస్తాన్ తమ ఆసియా కప్ ప్రయాణాన్ని సెప్టెంబర్ 1న థాయిలాండ్‌తో ప్రారంభించనుంది. ఆ తర్వాత సెప్టెంబర్ 5న ఏడుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన భారత్‌తో, సెప్టెంబర్ 7న హాంకాంగ్‌చైనాతో తలపడనుంది. ఈ టోర్నమెంట్ సెమీఫైనల్స్ సెప్టెంబర్ 10, 11 తేదీలలో జరగనుండగా, ఫైనల్ సెప్టెంబర్ 13న జరగనుంది. దీనికోసం పాకిస్తాన్ తన జట్టును ప్రకటించింది. 2026 ఆసియా క్రీడల కోసం పాకిస్తాన్ 15 మంది సభ్యులతో కూడిన మహిళల క్రికెట్ జట్టును ప్రకటించింది. ఈ జట్టుకు ఫాతిమా సనా నాయకత్వం వహించనుంది. లెఫ్టార్మ్ స్పిన్నర్ సాదియా ఇక్బాల్, బ్యాటర్ గుల్ ఫిరోజా కూడా పాకిస్తాన్ టీ20 జట్టులోకి తిరిగి వచ్చారు. సాదియా శ్రీలంక పర్యటనలో భాగం కాలేదు.

కాగా గుల్ ఫిరోజాను ఇటీవలి టీ20 మ్యాచ్‌ల నుంచి తప్పించినప్పటికీ పర్యటనలోని వన్డే సిరీస్‌లో ఆడింది. జపాన్‌లోని ఐచినగోయాలో జరిగే ఆసియా క్రీడల జట్టు నుంచి సాదియా, వహీదా అక్తర్, నజీహా అల్వీలను తొలగించి, వారి స్థానంలో అలియా రియాజ్, తస్మియా రుబాబ్, హుమ్నా బిలాల్‌లను తీసుకున్నారు. అయితే స్టార్ పేసర్ దయానా బేగ్‌ను రెండు జట్ల నుంచి తొలగించారు. ఆమె పేరు రిజర్వ్ జాబితాలో కూడా లేదు.





# ఆస్ట్రేలియాకు షాక్
## 23 యేళ్ల తర్వాత బంగ్లా సంచలన విజయం

**డార్విన్:** బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. ఆస్ట్రేలియా గడ్డపై ఆ జట్టును ఓడించింది. నాల్గో రోజు రెండో సెషన్ ఆదివారం జరిగిన ఏకంగా 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. తద్వారా 23ఏళ్ల తరువాత సంచలన విజయాన్ని నమోదు చేసింది. ఫలితంగా రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌కు గాను 1-0తో బంగ్లాదేశ్ ఆధిక్యంలో ఉంది. టాస్ గెలిచిన ఆస్ట్రేలియా బ్యాటింగ్ ఎంచుకోగా, ఆ జట్టు బ్యాటర్లకు అద్భుత బంతులతో బంగ్లాదేశ్ బౌలర్లు చుక్కలు చూపించారు. దీంతో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 198 పరుగులకే ఆలౌటైంది. బంగ్లాదేశ్ బౌలర్ హసన్ మహ్మద్ 6 వికెట్లు పడగొట్టాడు. అతని దెబ్బకు ఆస్ట్రేలియా బ్యాటింగ్ ఆర్డర్ కుప్పకూలింది. ఆ తరువాత తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ జట్టు 426 పరుగులు చేసింది. బంగ్లాదేశ్ బ్యాటింగ్‌లో తంజిద్ హసన్ శతకంతో మెరిశాడు. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియాపై బంగ్లాదేశ్ జట్టుకు 228 పరుగుల ఆధిక్యం లభించింది. రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా బ్యాటింగ్‌లో కామెరాన్ గ్రీన్ ఒంటరి పోరాటం చేశాడు. అతను 104 పరుగులతో శతకం సాధించాడు. అయితే మరో ఎండ్‌లో సహచరుల నుంచి తగిన సహకారం లభించలేదు. ఫలితంగా ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 284 పరుగులకే ఆలౌటైంది. దీంతో బంగ్లాదేశ్ ముందు విజయానికి కేవలం 57 పరుగుల లక్ష్యం మాత్రమే నిలిచింది. చిన్న లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్‌కు ఆస్ట్రేలియా బౌలర్లు పెద్దగా సవాలు విసరలేకపోయారు. బంగ్లాదేశ్ కేవలం ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి 57 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. మోమినుల్ హక్ విజయ బౌండరీ సాధించడంతో బంగ్లాదేశ్ చారిత్రక విజయాన్ని ఖాయం చేసుకుంది. 2003లో డార్విన్‌లోనే ఆస్ట్రేలియాతో బంగ్లాదేశ్ తొలి టెస్టు ఆడింది. ఆ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా భారీ విజయాన్ని సాధించింది. ఇప్పుడు అదే డార్విన్‌లో బంగ్లాదేశ్ చరిత్ర తిరగరాసింది. ఈ విజయం బంగ్లాదేశ్ టెస్టు చరిత్రలోనే అత్యంత ప్రత్యేకమైన విజయాల్లో ఒకటిగా నిలిచింది. ఆస్ట్రేలియాపై వారి టెస్టు విజయాల సంఖ్య రెండుకు చేరింది. అంతకుముందు 2017లో స్వదేశంలో ఆస్ట్రేలియాను బంగ్లాదేశ్ ఓడించింది.

# శ్రీలంకతో రెండో రోజు ముగిసిన ఆట
## టీమిండియా 460 పరుగుల భారీ స్కోర్



**న్యూఢిల్లీ:** గాలే వేదికగా శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో భారత్ ఆధిపత్యం కొనసాగుతోంది. అయితే తొలి రోజే పటిష్ట స్థితిలో నిలిచిన భారత జట్టు రెండో రోజు ఆదివారం తడబడింది. దీనికి తగినట్లుగా వర్షం కారణంగా రెండో కేవలం 43 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. దేవ్‌దత్ పడిక్కల్(167) భారీశతకంతో మెరిసినా, మిడిలార్డర్ బ్యాటర్లు చేతులెత్తేశారు. వర్షం ప్రభావంతో శ్రీలంక బౌలర్లు పుంజుకోవడంతో స్కోర్ వేగం తగ్గింది. అయితే టీ సెషన్‌లో ధ్రువ్ జురెల్(51), మానవ్ సుతార్(24)లు విలువైన భాగస్వామ్యం నెలకొల్పారు. ఆఖర్లో పేసర్ ప్రభాత్ జయసూర్య(4-109) వరసగా వికెట్లు తీయడంతో భారత్ ఆలౌట్ అంచున నిలిచింది. తొలి టెస్టులో భారీ స్కోర్ దిశగా సాగుతున్న భారత జట్టు రెండో రోజు దేవ్‌దత్ పడిక్కల్(167: 230 బంతుల్లో 15 ఫోర్లు, సిక్సర్) ఔటయ్యాడు. మొట్టమొదటి సెంచరీతో భారత జట్టు భారీ స్కోర్‌కు బాటలు వేసిన ఈ కుర్రాడు రెండో రోజు లంచ్ తర్వాత వెనుదిరిగాడు. ఓవర్ నైట్ స్కోర్ 288/2తో ఆట మొదలెట్టిన టీమిండియా రిషభ్ పంత్(39), కేఎల్ రాహుల్(82) వికెట్లు కోల్పోయింది. వెంటవెంటనే ఇద్దరూ కీలక ప్లేయర్లు ఔటైన వేళ ధ్రువ్ జురెల్(51) ఇన్నింగ్స్ నిర్మించిన పడిక్కల్ డబుల్ సెంచరీకి 33 పరుగుల దూరంలో ఆగిపోయాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన రవీంద్ర జడేజా(13) విఫలమైనా జురెల్ ఆచితూచి ఆడాడు. లహిరు కుమార ఓవర్లో మానవ్ సుతార్(24) బౌండరీతో స్కోర్ నాలుగొందలు దాటింది. అర్ధ శతకం సాధించిన జురెల్‌ను ప్రభాత్ జయసూర్య కాసేపటికే సుతార్‌ను డగౌట్ చేర్చాడు. సిరాజ్ త్వరగా వెనుదిరిగినా కుల్దీప్ యాదవ్(12 నాటౌట్) పట్టుదలగా ఆడాడు. ప్రసిధ్ కృష్ణ(1 నాటౌట్) కూడా వికెట్ కాచుకోవడంతో రెండో రోజు ఆట ముగిసే సరికి 9 వికెట్ల నష్టానికి భారత్ 460 పరుగులు చేసింది.

# ఈ యేడాది పెన్నీస్టాక్స్ ఇన్వెస్టర్లకు కాసుల పంట




**ముంబయి, ఆగస్టు 16:** ఈ క్యాలెండర్ సంవత్సరంలో ఇప్పటి వరకు చూసుకుంటే 10 పెన్నీ స్టాక్స్ అత్యంత వేగంగా పెరిగాయి. ఈ స్టాక్స్ 25 శాతం నుంచి 325 శాతం మధ్య రిటర్న్స్ అందించాయి. అందులో 3 స్టాక్స్ ఇన్వెస్టర్ల పెట్టుబడిని పలు రెట్లు పెంచి మల్టీబ్యాగర్ స్టాక్స్‌లో నిలిచాయి. ఈ స్టాక్స్‌ను ప్రత్యేక కేటగిరీలోని అంశాలను పరిగణనలోకి తీసుకుని జాబితా చేయడం జరిగింది. అందులో కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1000 కోట్ల లోపు ఉండి షేర్ల ధర రూ.20 లోపు ఉంటూ రోజుకు సగటున 5 లక్షల షేర్ల ట్రేడింగ్ వాల్యూమ్ ఉన్న వాటిని ఎంచుకోవడం జరిగింది. దీంతో చాలా తక్కువ ధరకో మంచి పనితీరు గల మైక్రో క్యాప్‌స్టాక్స్ లభించాయి. ఈ స్టాక్స్ గత 8 నెలలుగా చూసుకుంటే హైరిటర్న్స్ ఇచ్చాయి. పెన్నీ స్టాక్స్‌లో విజయం సాధించడానికి కేవలం అదృష్టం మాత్రమే కాదు, స్పష్టమైన వ్యూహం, పటిష్టమైన నష్ట నిర్వహణ కూడా అవసరం. ట్రియో మెర్కంటైల్ అండ్ ట్రేడింగ్ కంపెనీ స్టాక్ ఇప్పటి వరకు 8 నెలల్లో చూసుకుంటే ఏకంగా 326 శాతం మేర రాణించింది. లక్ష రూపాయలు పెట్టిన వారికి రూ.4.26 లక్షల వరకు అందించింది. ఈ స్టాక్ ధర కేవలం రూ.2.94 వద్ద ఉండడం గమనార్హం. గుజరాత్ ఇంజెక్ట్ కేరళా లిమిటెడ్ కంపెనీ స్టాక్ గత ఎనిమిది నెలల కాలంలో చూసుకుంటే 254 శాతం మేర రాబడులను అందించింది. లక్ష పెట్టిన వారికి రూ.3.54 లక్షలు అందించింది. ప్రస్తుతం ఈ స్టాక్ ధర రూ.12.66 వద్ద ఉంది.

స్టార్‌లైన్‌ప్స్ ఎంటర్ ప్రైజెస్ కంపెనీ స్టాక్ గత 8 నెలల కాలంలో 156 శాతం మేర పెరిగింది. లక్ష పెట్టిన వారికి రూ.2.56 లక్షలు అందించింది. ప్రస్తుతం ఈ కంపెనీ స్టాక్ ధర రూ.8.57 వద్ద ఉంది. ఎసిఐ ఇన్ఫోకామ్ కంపెనీ స్టాక్ గడిచిన 8 నెలల కాలంలో 63 శాతం మేర పెరిగి లక్ష పెట్టిన వారికి రూ.1.63 లక్షలు అందించింది. ఈ స్టాక్ ధర రూ.2.05 మాత్రమే. ఎన్‌హెచ్‌ఎ ఫుడ్స్ కంపెనీ స్టాక్ ఈ ఏడాది 2026లో ఇప్పటి వరకు 60 శాతం మేర లాభాలు అందించింది.

# రోజుకు 64వేల టన్నులు ఉత్పత్తిచేయాలి
## రిఫైనరీలకు కేంద్రం ఆదేశాలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 16:** ఇరాన్ యుద్ధం కారణంగా దేశంలో ఎల్పీజీ గ్యాస్ కొరతను భర్తీచేసేందుకు ఎల్పీజీ ఉత్పత్తి పెంచాలని కేంద్రం నిర్ణయించింది. చమురు ఉత్పత్తి, రిఫైనరీ సంస్థలకు ఈ నెల 13న కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎల్పీజీ ఉత్పత్తి పెంచాలని ఆదేశించింది. రోజుకు 63,810 టన్నుల ఎల్పీజీ ఉత్పత్తి చేయాలని దేశంలోని 21 రిఫైనరీలను ఆదేశించింది. 2026 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఎల్పీజీ ఉత్పత్తికి రెట్టింపుకంటే ఎక్కువ. ప్రస్తుతం దేశంలో ఒకరోజు వినియోగమవుతున్న గ్యాస్‌లో 70 శాతం. ఇది ఇప్పటికిప్పుడే సాధ్యమయ్యే పరిస్థితి లేదు. ప్రస్తుతం విదేశాల నుంచి చమురు సరఫరా తగినంతగా లేకపోవడే ఇందుకు కారణం. ఈ నేపథ్యంలో తగినంత చమురు దిగుమతి జరిగితే, రిఫైనరీ కంపెనీలు ఈ టార్గెట్‌ను అందుకుంటాయి. దేశంలోఉన్న రిఫైనరీ కంపెనీలలో 18 రిఫైనరీలు ప్రభుత్వం రంగ సంస్థలే. వీటికి రోజుకు 31,470 టన్నుల ఎల్పీజీ ఉత్పత్తి చేయాల్సిందిగా కేంద్రం లక్ష్యాన్ని నిర్దేశించింది. ప్రైవేటు రిఫైనరీ లలో అత్యధికంగా ఎల్పీజీ ఉత్పత్తి చేసే సామర్థం రిలయన్స్ సంస్థకు ఉంది. ఈ సంస్థ రోజుకు 18,000 టన్నుల ఎల్పీజీ ఉత్పత్తి చేయగలదు. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఉన్న రిఫైనరీలో ఏడాదికి 33 మిలియన్ టన్నులు ఉత్పత్తి చేయగలదు. ఆ తర్వాత కోచిలోని బీపీసీఎల్ సంస్థ 4,800 టన్నులు, రష్యాకు చెందిన నయారా ఎనర్జీ సంస్థ 4,480 టన్నుల ఎల్పీజీ ఉత్పత్తి చేయగలవు. ఈ మూడు కంపెనీలు కలిపి 27,280 టన్నుల ఎల్పీజీ ఉత్పత్తి చేయగలవు. 202526 ఆర్థిక సంవత్సరంలో ఇండియాలో 33.2 మిలియన్ టన్నుల ఎల్పీజీ వినియోగమైంది. రోజుకు సగటున 91,000 టన్నులు. వీటిలో 13.1 మిలియన్ టన్నుల ఎల్పీజీ దేశీయంగా ఉత్పత్తి అయితే, మిగిలిన 21.3 మిలియన్ టన్నుల ఎల్పీజీని విదేశాల నుంచి దిగుమతి చేయాల్సి వచ్చింది.

# టాప్ ఐదు కంపెనీల్లో రూ.లక్షల కోట్ల ఆవిరి




**ముంబయి, ఆగస్టు 16:** దేశీయ స్టాక్ మార్కెట్లలో గత వారం అమ్మకాల ఒత్తిడి తీవ్రంగా కొనసాగింది. ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలహీనపడటంతో సూచీలు నష్టాల్లో ముగిశాయి. దీని ప్రభావం దేశంలోని అత్యంత విలువైన టాప్10 కంపెనీలపై స్పష్టంగా కనిపించింది. వీటిలో ఐదు దిగ్గజ కంపెనీలు కలిసి తమ మార్కెట్ విలువలు ఏకంగా రూ.1 లక్ష కోట్లకు పైగా నష్టపోయాయి. నష్టపోయిన కంపెనీలలో ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ అగ్రస్థానంలో నిలిచింది. ఒక్క వారంలోనే టిసిఎస్ మార్కెట్ విలువ రూ.34,263.28 కోట్లు క్షీణించి రూ.8.53 లక్షల కోట్లకు పడిపోయింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ కూడా భారీ నష్టాన్ని చవిచూసింది. ఈ సంస్థ మార్కెట్ విలువ రూ.31,869.13 కోట్లు తగ్గి రూ.17.70 లక్షల కోట్లకు చేరింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.25,891.88 కోట్లు నష్టపోయి రూ.9.86 లక్షల కోట్ల వద్ద ముగిసింది. ఇ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ రూ.7,165.37 కోట్లు, ఐసిఐసిఐ బ్యాంక్ రూ.2,792.65 కోట్లు తమ మార్కెట్ విలువను కోల్పోయాయి. ఒకవైపు ఐదు కంపెనీలు నష్టాలపాలవ్వగా, మరో ఐదు కంపెనీలు మాత్రం లాభాలను ఆర్జించడం విశేషం. ఈ ఐదు కంపెనీలు కలిసి తమ మార్కెట్ విలువకు రూ.55,149.45 కోట్లను జోడించుకున్నాయి. లాభపడిన వాటిలో లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి) ముందుంది. ఎల్ఐసి మార్కెట్ విలువ రూ.26,438.49 కోట్లు పెరిగి రూ.5.23 లక్షల కోట్లకు చేరింది. భారతీ ఎయిర్‌టెల్ కూడా రూ.20,592.13 కోట్లు లాభపడి తన విలువను రూ.12.43 లక్షల కోట్లకు పెంచుకుంది. బజాజ్ ఫైనాన్స్, లార్సెన్ అండ్ టూబ్రో, హిందుస్థాన్ యూనిలీవర్ కూడా స్వల్ప లాభాలతో వారాన్ని ముగించాయి. వారం ముగిసే నాటికి అత్యంత విలువైన కంపెనీల జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా, ఆ తర్వాతి స్థానాల్లో భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, ఎస్‌బిఐ నిలిచాయి.

# రూ.24 వేల కోట్ల రెవెన్యూపై లోధా ఫోకస్



**ముంబయి, ఆగస్టు 16:** ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ లోధా డెవలపర్స్ లిమిటెడ్ వచ్చే ఏడాది మార్చి నాటికి 21 కొత్త హౌసింగ్ ప్రాజెక్టులను ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. వీటి ద్వారా సుమారు రూ.24,000 కోట్ల ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉందని కంపెనీ తెలిపింది. బలమైన గృహ డిమాండ్ కొనసాగుతున్న నేపథ్యంలో వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు సంస్థ ఈ ప్రాజెక్టులను చేపడుతోంది.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో లోధా డెవలపర్స్ ముంబై మెట్రోపాలిటన్ రీజియన్‌లో 4 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒకే హౌసింగ్ ప్రాజెక్టును ప్రారంభించింది. దీని ఆదాయ సామర్థం రూ.330 కోట్లుగా ఉంది. ఎంఎంఆర్, ఢిల్లీ ఎన్‌సీఆర్, పుణె, బెంగళూరు ప్రాంతాల్లో 7 కొత్త హౌసింగ్ ప్రాజెక్టులను ప్రారంభించనుంది. మొత్తం 59 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో చేపట్టే ఈ ప్రాజెక్టుల ఆదాయ సామర్థం సుమారు రూ.9,850 కోట్లు. ఇప్పటికే కొనసాగుతున్న 14 ప్రాజెక్టుల్లో కొత్త దశలను ప్రారంభించనుంది. మొత్తం 97 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో చేపట్టే ఈ దశల ద్వారా మరో రూ.14,210 కోట్ల ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉంది. ఈప్రాజెక్టులతో నిర్దేశించుకున్న రూ.24,000 కోట్ల సేల్స్ బుకింగ్స్ లక్ష్యాన్ని సాధించేందుకు కంపెనీ ప్రయత్నిస్తోంది.ఏప్రిల్‌జూన్ త్రైమాసికంలో లోధా డెవలపర్స్ సేల్స్ బుకింగ్స్ వార్షిక ప్రాతిపదికన 4 శాతం పెరిగి రూ.4,630 కోట్లకు చేరాయి. దేశంలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థల్లో ఒకటైన లోధా డెవలపర్స్‌కు ఎంఎంఆర్, పుణె, బెంగళూరులో కార్యకలాపాలు ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఢిల్లీఎన్‌సీఆర్‌లో తన తొలి హౌసింగ్ ప్రాజెక్టును ప్రారంభించేందుకు సంస్థ ప్రణాళిక సిద్ధం చేసింది.హౌసింగ్‌తో పాటు కార్యాలయాలు, మాల్స్, వేర్‌హౌసింగ్, పారిశ్రామిక పార్కులు, డేటా సెంటర్ల వంటి వాణిజ్య ప్రాజెక్టులను కూడా కంపెనీ అభివృద్ధి చేస్తోంది.ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నికర లాభాన్ని 20 శాతం వార్షిక వృద్ధితో రూ.4,100 కోట్లకు పెంచుకోవాలని లోధా డెవలపర్స్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ త్రైమాసికంలో కంపెనీ నికర లాభం దాదాపు రెట్టింపై రూ.1,373.1 కోట్లకు చేరింది. ఆదాయం కూడా రూ.3,624.7 కోట్ల నుంచి రూ.5,096.7 కోట్లకు పెరిగింది.

## ఈవారం మార్కెట్‌లోకి
# 8 కొత్త ఫండ్స్




**ముంబయి, ఆగస్టు 16:** మ్యాచువల్ ఫండ్స్‌లో ఈ వారం ఎనిమిది కొత్త ఫండ్స్ సబ్‌స్క్రిప్షన్ కోసం వస్తున్నాయి. అందులో 5 ఫండ్స్ ఆఫర్లు 17న తేదీన మొదలవుతున్నాయి. తమ పోర్ట్ ఫోలియోల్లోని ఖాళీలను పూరించి ఇన్వెస్టర్లను ఆకర్షించడమే లక్ష్యంగా కొత్త ఫండ్స్‌ను సంస్థలు తెస్తున్నాయి. ఇందులో రెండు ఫండ్ ఆఫ్ ఫండ్స్ ఉన్నాయి. నిప్పాన్ ఇండియా ఇన్‌కమ్ ప్లస్ ఆర్బిట్రేజ్ ఓమ్ని ఫండ్ ఆఫ్ ఫండ్, క్వాంట్ ఇన్‌కమ్ ప్లస్ ఆర్బిట్రేజ్ యాక్టివ్ ఫండ్ ఆఫ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ కోసం ఈనెల17నుంచి 31 వ తేదీ వరకు కొనసాగనున్నాయి. వీటిల్లో కనీస పెట్టుబడి రూ. 500, రూ. 5000గా నిర్ణయించారు. ఇక ఐటిఐ మల్టీ అసెట్ అలకేషన్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ సైతం 17న మొదలై ఆగస్టు 31వ తేదీ వరకు కొనసాగనుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ. 5000గా నిర్ణయించారు. క్వాంట్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ న్యూ ఫండ్ ఆఫ్ సబ్‌స్క్రిప్షన్ 21వ తేదీన మొదలై సెప్టెంబర్ 4వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఇందులో కనీస పెట్టుబడి రూ.500గా నిర్ణయించారు. ఇన్వెస్కో ఇండియా ఫార్మా అండ్ హెల్త్ కేర్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఈనెల 18వ తేదీన ప్రారంభమవుతోంది. సెప్టెంబర్ 1వ తేదీ వరకు కొనసాగనుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ. 1000గా నిర్ణయించారు. క్వాంట్ సిల్వర్ ఈటీఎఫ్ కొత్త ఫండ్ ఆఫర్ సబ్‌స్క్రిప్షన్ ఆగస్టు 17వ తేదీన ప్రారంభమై ఆగస్టు 19తోనే ముగుస్తుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ. 2000గా నిర్ణయించారు. ఎడెల్వేయిస్ ఆల్ట్రా షార్ట్ టర్మ్ ఫండ్ న్యూ ఫండ్ ఆఫర్ సబ్‌స్క్రిప్షన్ కోసం 17వ తేదీన అందుబాటులోకి వస్తోంది. 24వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ. 100 మాత్రమే. డిఎస్‌పీ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెక్టోరల్ డెట్ ఫండ్ కొత్త స్కీమ్ సబ్‌స్క్రిప్షన్ 17వ తేదీన మొదలై 24వ తేదీ వరకు కొనసాగుతుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ. 100గా నిర్ణయించారు.

SBI
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సెంట్రల్ రిక్రూట్‌మెంట్ & ప్రమోషన్ డిపార్ట్‌మెంట్
కార్పొరేట్ సెంటర్, ముంబై
ఫోన్: 022-22820427

అప్లై చేయడానికి QRని స్కాన్ చేయండి

**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI)లో క్లరికల్ కేడర్‌లో జూనియర్ అసోసియేట్స్ (కస్టమర్ సపోర్ట్ & సేల్స్) రిక్రూట్‌మెంట్**
**SC/ST/OBC బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి ప్రత్యేక నియామక ప్రక్రియ**

భారతీయ స్టేట్ బ్యాంకు రెగ్యులర్ బేసిస్‌లో జూనియర్ అసోసియేట్స్ (కస్టమర్ సపోర్ట్ & సేల్స్) నియామకం కోసం అర్హులైన భారతీయ పౌరులనుండి దరఖాస్తులు కోరుచున్నది

**ఖాళీల సంఖ్య : 1538**

అర్హత ప్రమాణాలు (వయస్సు, అర్హత మొదలైనవి) అవసరమైన ఫీజులు మరియు ఇతర వివరాలు, ఆన్‌లైన్ దరఖాస్తు మరియు ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు లింక్‌తో పాటు, బ్యాంక్ వెబ్‌సైట్ **https://sbi.bank.in/web/careers/current-openings** ప్రకటన నం. **CRPD/CR/SPLDRIVE/2026-27/16** లో లభిస్తుంది. అభ్యర్థులు దరఖాస్తు చేసే ముందు మరియు ఫీజు చెల్లించే ముందు పూర్తి ప్రకటనని చూసి, తమ అర్హతలను నిర్ధారించుకోమని సలహా.

- ఆన్ లైన్ లో దరఖాస్తు చేయుటకు మరియు ఫీజు చెల్లింపు తేదీ : **07.08.2026 నుండి 27.08.2026 వరకు.**

ఏవైనా సందేహాలు ఉన్నా, దయచేసి మాకు – **"CONTACT US" —> "Post Your Query"** లింకు ద్వారా వ్రాసి పంపండి. ఈ లింకు మీకు బ్యాంకు వెబ్ సైట్ **https://sbi.bank.in/web/careers/current-openings**లో లభించును.

స్థలం: ముంబై
తేదీ: 07.08.2026

మహానిర్వహణాధికారి (ఆర్‌పి & పీఎం)

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

# ఇరు వర్గాల మధ్య ఉద్రిక్తత..

**భవనం కాళీ చేయించే విషయంలో వివాదం..**

**అంబాజీపేట,ఆగస్టు 16 (ప్రభాతవార్త):** ఒక భవనంలో గత కొన్నేళ్లుగా అద్దెకు ఉంటున్న వ్యక్తిని కాళీ చేయించే సమయంలో వివాదం తలెత్తింది. భవనం కాళీ చేయించే నెపంతో సామానులు బయట పెట్టడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఇందుకు సంబంధించి ఎస్సై షేక్ సుభాని తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అంబాజీపేట శాఖ గ్రంథాలయం పక్కన ఉన్న క్రిస్టియన్ లైబ్రరీ భవనంలో 1999 నుండి మాకే దేవీ ప్రసాద్ అద్దెకు ఉంటున్నారని చెప్పారు. ఈ భవనాన్ని క్రిస్టియన్ మిషనరీ సంస్థ నిర్వాహకుల వద్ద నుండి 2019లో నామన నాగేంద్రకుమార్ కొనుగోలు చేశాడన్నారు.అద్దెకు ఉంటున్న దేవీ ప్రసాద్ ను భవనం ఖాళీ చేయాలని నాగేంద్రకుమార్ తెలిపాడన్నారు. ఎప్పటినుండో అద్దె కుంటున్న దేవీప్రసాద్ తనకు తెలియకుండా భవనాన్ని విక్రయించడంతో మిషనరీ సంస్థ తీరుపై కోర్టును ఆశ్రయించారన్నారు.కోర్టులో వాదోపవాదాలు జరుగుతున్న నేపధ్యంలో ఆదివారం నాగేంద్రకుమార్ తన అనుచరులతో భవనంలోకి ప్రవేశించి భవనాన్ని ఖాళీ చేయించే ఉద్దేశ్యంతో దేవీప్రసాద్కు సంబంధించిన గృహోపకరణ సామాన్లు ఆరుబయటకు తరలించారన్నారు.దీంతో సంఘటన తీరును దేవీప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని గమనించి బయట వేసిన సామాన్లును భవనం లోపల పెట్టించారు. దీనిపై దేవి ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువర్గాలతో చర్చిస్తున్నట్లు ఎస్సై సుభానీ తెలిపారు.




తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త


రాజమహేంద్రవరం | సోమవారం 17 ఆగస్టు 2026 | I


## గైగోలుపాడులో 'ఇంటింటికీ తెలుగుదేశం'కు అపూర్వ స్పందన



**కాకినాడ రూరల్, ఆగస్ట్16 (ప్రభాత వార్త):** కాకినాడ రూరల్ మండలం గైగోలుపాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులు నిర్వహించిన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమానికి అపూర్వ స్పందన లభించింది. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయాలనే లక్ష్యంతో టీడీపీ చేపట్టిన 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం ఆదివారం రమణయ్యపేట పరిధిలో గైగోలుపాడు ప్రాంతాల్లో ఉత్సాహంగా సాగింది. టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణమూర్తి దంపతులు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ప్రతి కుటుంబంతో నేరుగా మాట్లాడిన పిల్లి దంపతులు.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, స్థానిక అవసరాలు, మౌలిక వసతుల పరిస్థితి, ప్రభుత్వ పథకాల అమలుపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. వృద్ధులు, మహిళలు, యువత, కార్మికులు, వివిధ వర్గాల ప్రజలతో ఆత్మీయంగా ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలిపిన సమస్యలను నమోదు చేసుకుని, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని పిల్లి దంపతులు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత అమలు చేస్తున్న తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, యువతకు ఉపాధి అవకాశాలు, విద్యార్థులకు ప్రోత్సాహం, సామాజిక భద్రతా పథకాలు తదితర సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనం అందేలా కృషి చేస్తామని తెలిపారు. పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చప్పిడి వెంకటేశ్వరరావు,పాలిక సతీష్, కోడి సీతారామయ్య,వాసంశెట్టి పోతురాజు, పలివెల గాయత్రి త్రిమూర్తులు ,గాయత్రి, క్లస్టర్ కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, గ్రామ కమిటీ నాయకులు, కూటమి శ్రేణులు, మహిళలు, యువత, గ్రామ పెద్దలు, రమణయ్యపేట, గైగోలుపాడు ప్రాంతాల ప్రజలుపాల్గొన్నారు.

## తీరంపై కెరటాల ఉధృతి



**యు.కొత్తపల్లి, ఆగస్టు 16 (ప్రభాతవార్త) :** సముద్రంలో ఆటుపోట్లు కారణంగా ఉప్పాడ తీరంపై కెరటాలు విరుచుకు పడుతున్నాయి. నిరంతరం ఎగసిపడే కెరటాలతో తీరం కోతకు గురవుతూనే ఉంది. ఆదివారం ఉదయం నుంచి ఉవ్వెత్తున కెరటాలు తీరంపై ఎగసిపడడంతో ఉప్పాడ - కాకినాడ బీచ్ రోడ్డులో ప్రయాణీకులు భయభ్రాంతులకు గురయ్యారు. సాయంత్రం వరకూ కెరటాల ఉధృతి కొనసాగడంతో మత్స్యకారుల గృహాలు కోతకు గురవుతున్నాయి. ఉప్పాడ శివారు సుబ్బంపేట, కొత్తపేట సమీపంలో బీచ్ రోడ్డుకు రక్షణగా వేసిన బండరాళ్ళను సైతం దాటుకుని కెరటాల ఉధృతి కొనసాగడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

## కూటమి నేతల ఇసుక దందా ఆపాలి.

### జనసేన నాయకులు విళ్ళ వీర.



**తాళ్లరేవు, ఆగస్టు 16 (ప్రభాతవార్త):** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం లో కూటమి నేతలు చేస్తున్న ఇసుక దందా వలన గృహాలు నిర్మించుకునే సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అందువల్ల మండలంలో కూటమి నేతలు నడుపుతున్న ఇసుక దందా ఇకనైనా ఆపాలని జనసేన నాయకులు విల్ల వీర డిమాండ్ చేశారు. తాళ్లరేవులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఒక ఇసుక ట్రాక్టర్ ట్రక్కు లోడుకు రూ. 400 లు అదనంగా వసూలు చేస్తున్నారని ఆయన అన్నారు. ఒక గృహం నిర్మించుకోవడానికి సుమారు 20 ట్రక్కుల ఇసుక అవసరమవుతుందని ఈ మేరకు సామాన్యుడిపై రూ.8 వేలు అదనంగా భారం పడుతుందని అన్నారు. అంతేకాకుండా కాంట్రాక్ట్ చేసుకునే వ్యక్తుల వద్ద నుంచి ఒక ట్రక్కు లోడ్ ఇసుకకు రూ. 500లు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ దందాను తెలుగుదేశం, జనసేన మండల అధ్యక్షులు ధూళిపూడి వెంకటరమణ, అత్తిలి బాబురావు, నాయకులు టేకుమూడి లక్ష్మణరావు వంటి నేతలు దృష్టి సారించి ఈ వసూళు ఆపకపోతే రాబోయే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారని ఆయన అన్నారు. దీనిపై త్వరలో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజును కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

## రాజ్యాధికారంతోనే బహుజనుల అభివృద్ధి

### రిటైర్డ్ డీజీపీ జే. పూర్ణచంద్రరావు




**రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 16: (ప్రభాత వార్త)** బహుజనులు రాజ్యాధికారం సాధించినప్పుడే వారి అభివృద్ధి సాధ్యమవుతుందని రిటైర్డ్ డీజీపీ, ఆల్ఇండియా బహుజన సమాజ్ పార్టీ నేషనల్ కోఆర్డినేటర్ జే. పూర్ణచంద్రరావు అన్నారు. ఆదివారం ఆనం కళాకేంద్రంలో బీసీ చైతన్య వేదిక ఆధ్వర్యంలో వీరవల్లి శ్రీనివాస్ అధ్యక్షతన సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో 44 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు ఐక్యంగా రాజ్యాధికార సాధన దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గౌతు లచ్చన్న బీసీల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడని కొనియాడారు. బీసీ సంఘం నాయకుడు మార్గాని నాగేశ్వరరావు మాట్లాడుతూ లచ్చన్న స్ఫూర్తితో బహుజనుల హక్కుల కోసం ఉద్యమించాలని అన్నారు. పూర్ణచంద్రరావు బహుజనులను ఏకం చేస్తూ రాజ్యాధికార సాధనకు కృషి చేస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో అనుశ్రీ సత్యనారాయణ, పాలిక శీను, గుత్తుల సత్యనారాయణ, కే. సంజీవరావు, పితాని కుటుంబరావు, బూడిద శరత్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య సమరయోధుడు

## సర్దార్ గౌతు లచ్చన్న ఆశయ సాధనకు కృషి....





**రాజమహేంద్రవరం అర్బన్; ఆగస్టు 16, ప్రభాతవార్త,** రాజమహేంద్రవరం వై-జంక్షన్ వద్ద సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి ఘనంగా జరిగింది. స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అయిన ఆయన విగ్రహానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గౌడ, శెట్టిబలిజ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అనేక రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. గౌతు లచ్చన్న గాంధీజీ పిలుపుతో స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని, హరిజనులు, బీసీ వర్గాల అభ్యున్నతికి జీవితాన్ని అంకితం చేశారని వక్తలు కొనియాడారు. వల్లభాయ్ పటేల్ తరువాత సర్దార్ బిరుదు పొందిన అరుదైన నాయకుడిగా ఆయనను గుర్తుచేశారు. నేటి రాజకీయ నాయకులు ఆయన ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. సంఘాల నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించడం గౌరవంగా భావిస్తున్నామని తెలిపారు. గౌడ, శెట్టిబలిజ, ఈడిగ, యాత తదితర వర్గాల ఐక్యతకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని ఘన నివాళులర్పించారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ గౌతు లచ్చన్న సేవలు సమాజానికి మార్గదర్శకమని అన్నారు. బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. యువత ఆయన స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలని సూచించారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ గౌతు లచ్చన్న విగ్రహం వద్ద ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆయన సేవలను స్మరించుకున్నారు. మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ బీసీ ఐక్యతకు లచ్చన్న చేసిన కృషి అపూర్వమని అన్నారు. అన్ని వర్గాలు ఆయన ఆశయాలను కొనసాగించాలని కోరారు. కార్యక్రమ నిర్వాహకులు రెడ్డి మణేశ్వరరావు ఆధ్వర్యంలో వేడుకలు విజయవంతంగా జరిగాయని తెలిపారు. సంఘ నాయకులు బుడ్డిగ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు గేడి అన్నపూర్ణ రాజు, కోశాధికారి గెద్దాడ హరిబాబు, వనుము శ్రీనివాస్, రేలంగి శేఖర్, సంఘం పెద్దలు కడియాల వరబాబు, శీలం గోవింద్, కుడుపూడి పార్థసారధి, అనుసూరి పద్మలత, గొర్రెల రమణ, పెంకే సురేష్, సూరంపూడి అప్పారావు, సూరంపూడి రాజేంద్ర, కడలి చిన్న, గుత్తుల రామచంద్రరావు, కట్టా మల్లేశ్వరరావు, కడలి కెరటాలు, టేకుమూడి బద్రీనాధ్, సూరంపూడి వీరవెంకట రావు, మార్కొండ సుబ్రహ్మణ్యం, కార్పొరేషన్ డైరెక్టర్లు యామన నారాయణ గౌడ్, పిల్లి వెంకట రమణ తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఏజెన్సీ ప్రాంతంలో ఘనంగా కంబాల కానుక,

## వనితల వేడుక పట్టు చీరలు పంపిణీ కార్యక్రమం...

**భారీగా తరలివచ్చిన గిరిజన మహిళలు**

**8 వేలు మందికి పట్టుచీరలు పంపిణీ చేసిన కంబాల దంపతులు**



**రంపచోడవరం ఆగస్టు 16: ప్రభాతవార్త.** రంపచోడవరం మండలం ఐ.పోలవరం గ్రామం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ సమీపం ప్రాంగణంలో రామసేన అధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం రంపచోడవరం, మారేడుమిల్లి, గుర్తేడు మండలాలకు సంబంధించి నిర్వహించిన, కంబాల కానుక వనితల వేడుక పట్టుచీరలు పంపిణీ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మూడు మండలాల నుంచి భారీగా గిరిజన మహిళలు, తరలివచ్చి పాల్గొన్నారు. తొలిత కంబాల శ్రీనివాసరావు, దంపతులకు గ్రామస్తులు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం కంబాల శ్రీనివాసరావు, శ్రీమతి పద్మావతి దేవి గంగారత్నం దంపతులకు అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి, వేదమంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనాలు అందించారు. అనంతరం వరలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన, కంబాల దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళా మూర్తుల్లో హైందవ చైతన్యం పెంపొందించడం, సనాతన ధర్మ విలువలను బలోపేతం చేయడం కోసం శ్రావణమాసంలో ప్రతి పేద మహిళ ఆనందంగా వరలక్ష్మి వ్రతాన్ని జరుపుకోవాలనే సంకల్పంతోనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. గత నెల 11 తేదీ నుంచి ఇప్పటివరకు పలు గ్రామాలలో 80 వేలు పట్టుచీరలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. బంగారు వరలక్ష్మి కానుక సీజన్-4 లక్కీ డ్రా కార్యక్రమంలో భాగంగా రాజానగరం, రంపచోడవరం, జగ్గంపేట మూడు నియోజకవర్గంలో 4 వేలు బంగారు రూపులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మన దేశం విశ్వగురువని, మన సంస్కృతి సాంప్రదాయాలను, ప్రతి ఒక్కరు పాటించాలని సూచించారు. మూడు నియోజకవర్గంలో విద్య, వైద్య ఆర్థికపరంగా సొంత నిధులతో 18 రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మన దేశాన్ని రక్షించగలిగే ఏకైక వ్యక్తి ప్రధాని నరేంద్ర మోడీయేనని, ఆయన నాయకత్వ లక్షణాలు నచ్చి బీజేపీలో చేరడం జరిగిందన్నారు అనంతరం 8 వేల మంది మహిళలకు పట్టుచీరలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కోనసీమ గోవిందుడికి అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణం..

## పాల్గొన్న సినీ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్...

**19న పరకామణి సేవ..- ఈ నెల 22 నుండి 24 వరకు స్వామివారి పవిత్రోత్సవాలు...**

**ఉత్సవ మూడు రోజులు అష్టోత్తర పూజలు, కల్యాణోత్సవం రద్దు.. ఉప కమిషనర్.. నల్లం..**





**ఆత్రేయపురం, ఆగస్టు 16,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. ఏడు వారాల నోము ఆచరించిన, భక్తులు అష్టోత్తర శతనామావళి, నిత్య కళ్యాణం, గోపూజ, బాల భోగం, నివేదన, తదితర కార్యక్రమాలలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.ప్రముఖ సినీ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ అష్టోత్ర పూజలలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.వేలాది మంది భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలన్నీమార్మోగాయి. అనంతరం శ్రీ స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. అలాగే ఈనెల 19 తేదీన బుధవారం స్వామివారి హుండీలు లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. ఈనెల 22 నుంచి 24 వరకు మూడు రోజులపాటు స్వామివారి పవిత్రోత్సవాలు నిర్వ హించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ఏడాది పొడవునా ఆలయంలో నిర్వహించే క్రతు వుల్లో తెలిసి తెలియక జరిగే దోషాల నివారణకు ఆగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉత్సవ రోజుల్లో వర్చువల్ సేవలు అష్టోత్తర పూజలు, కల్యాణోత్సవం రద్దు చేసినట్లు ఆయన తెలిపారు. ఉత్సవాల అనంతరం 25 నుంచి యథావిధిగా పూజలు జరుగుతాయన్నారు.

## పోలింగ్ బూతులను పరిశీలించిన ఎంపీడీవో



**శంఖవరం ఆగస్టు 16 ప్రభాతవార్త** ఎన్నికల సన్నద్ధతలో భాగంగా మండలంలోని పలు పోలింగ్ బూత్ లను ఎంపీడీవో ఆదివారం పరిశీలించారు మండలంలోని కొంతంగి గౌరంపేట మండపం గ్రామాల్లో గల బూతులను ఆదివారం సాయంత్రం తనిఖీచేబెట్టారు బూతుల్లో తాగునీరు, విద్యుత్, టాయిలెట్లు, వికలాంగుల ర్యాంపుల సదుపాయాలను పరిశీలించారు. బూతుల వద్ద అనవసర పోస్టర్లు, బ్యానర్లు తొలగించాలని, పరిశుభ్రత పాటించాలని సిబ్బందికి సూచించారు. ఓటర్లకు సౌకర్యవంతంగా ఉండేలా, ఎలాంటి లోపాలు లేకుండా ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యమని ఎంపీడీవో పేర్కొన్నారు. వాటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రెండు కిలోమీటర్ల పరిధిలోనే బూతులు ఉండేలా హేతుబద్ధీకరణ చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో యు నాగేంద్ర పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్లోనూ కనీస సౌకర్య వసతులు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు అనంతరం సచివాలయం సిబ్బందితో గ్రామంలో గల బూతులు వివరాలు ఓటర్ల సంఖ్య అని తెలుసుకున్నారు ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో నాగలక్ష్మి మండపం టిడిపి నేత పొలం చిన్న తదితరులు ఉన్నారు

## గిరిజనుడు ఆపరేషన్ కు రూ. 1లక్ష 20 వేలు సహాయం

**( గ్రామ సంక్షేమ సంఘం... పూర్వ విద్యార్థులు సహకారం )**



**రాజవొమ్మంగి, ఆగస్టు 16, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలం కొండపల్లి గ్రామానికి చెందిన కోటం శివకుమార్ శస్త్ర చికిత్స కోసం కొండపల్లి గ్రామ సంక్షేమ సంఘం రూ. 36 వేలును సహాయంగా అందించారు. శివకుమార్ తో చదివిన పదోతరగతి 1995 సం., 1991 సం. స్నేహితులు ద్వారా రూ. 84 వేలు సహాయాన్ని ఏజెన్సీ డి. ఇ. ఓ. మల్లేశ్వరరావు, మైలబోయిన సత్తిబాబు, శిరీష, మిత్రులు అందించారు. ఈసందర్భంగా కొండపల్లి సంక్షేమ సంఘం మాట్లాడుతూ, గ్రామంలో ఎవరైనా ఆపదలో ఉన్నప్పుడు వారికి అండగా నిలవడం, అవసరమైన సమయంలో ఆర్థికంగా సామాజికంగా సహాయం చేయడం తమ సంఘం ప్రధాన లక్ష్యాలలో ఒకటని పేర్కొన్నారు. శివకుమార్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని సంఘం సభ్యులు ఆకాంక్షించారు.ఆపదలో ఉన్న వ్యక్తికి కుటుంబ సభ్యుల మాదిరిగా అండగా నిలిచిన కొండపల్లి సంక్షేమ సంఘం సేవాభావాన్ని గ్రామస్థులు అభినందించారు. అలాగే శివకుమార్ శస్త్రచికిత్స కోసం సహాయం అందించిన ప్రతి దాతకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# రెండు కోట్ల రోడ్డు.. మూడు ముక్కలాట!

## నాణ్యతకు తిలోదకాలు.. మూడు నెలలకే మరమ్మతులు...

## గుత్తేదారుడితో అధికారుల కుమ్మక్కు? మిగిలిన రెండు కిలోమీటర్లు ఎక్కడ?



**పిఠాపురం, ఆగస్టు 16 ( ప్రభాతవార్త)** పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని గొల్లప్రోలు నుంచి రాపర్తి జంక్షన్ వరకు ఐదు కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు మంజూరైనట్లు రోడ్లు భవనాల శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే, నిధులు మంజూరైనా రహదారి నిర్మాణం మాత్రం ప్రయాణికులకు ఉపశమనం కలిగించకపోగా.. మూడు ముక్కలుగా వేసిన రోడ్డు, మూడు నెలలు కూడా గడవకముందే మరమ్మతులకు గురికావడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. రోడ్డు నిర్మాణంలో భాగంగా గొల్లప్రోలు బైపాస్ నుంచి భోగాపురం స గర శ్మశానం వరకు ఒక ముక్కగా, భోగాపురం రాజమ్మవాలు వద్ద సుమారు 50 మీటర్ల మేర మరో ముక్కగా, రాపర్తి గ్రామ శివారు నుంచి జంక్షన్ వరకు మూడో ముక్కగా పనులు చేపట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే ఐదు కిలోమీటర్ల మేర పూర్తిస్థాయిలో రహదారి నిర్మించాల్సి ఉండగా, సుమారు మూడు కిలోమీటర్ల మేర మాత్రమే అంతంతమాత్రంగా పనులు చేసి, మిగిలిన రెండు కిలోమీటర్లను పట్టించుకోకపోవడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**నిబంధనలకు తిలోదకాలు?**

తారు రోడ్డు నిర్మాణంలో నిర్ణయించిన బిటుమెన్ శాతం, మెటీరియల్ నాణ్యత, గ్రేడింగ్, మందం, కాంపాక్షన్, బేస్--సబ్బేస్ పొరల ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. పనులు పూర్తయ్యే ముందు సంబంధిత అధికారులు నాణ్యత పరీక్షలు నిర్వహించి, నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నప్పుడే బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ తారు శాతం తక్కువగా వినియోగించి రోడ్డు నిర్మించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**మూడు నెలలకే మరమ్మతులా?**

రోడ్డు నిర్మాణం పూర్తయి మూడు నెలలు కూడా కాకముందే పలు ప్రాంతాల్లో మరమ్మతులు చేపట్టడం అధికారుల పర్యవేక్షణపై అనుమానాలకు తావిస్తోంది. రూ.2 కోట్ల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన రహదారి ఇంత తక్కువ కాలానికే దెబ్బతింటే నాణ్యతా పరీక్షలు ఎక్కడ జరిగాయి? ఎవరు పరిశీలించారు? బిల్లులు ఎలా మంజూరయ్యాయి? అని ప్రయాణికులు నిలదీస్తున్నారు.



**రెండు కిలోమీటర్ల రోడ్డు ఏదీ?**

ఐదు కిలోమీటర్ల పనికి నిధులు మంజూరు చేసి మూడు కిలోమీటర్లకే పరిమితం చేయడంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గుత్తేదారుడి పనితీరును పర్యవేక్షించాల్సిన అధికారులు మౌనం వహించడం, నాణ్యతా ప్రమాణాలపై ప్రశ్నలు తలెత్తుతున్నా పట్టించుకోకపోవడం వెనుక అధికారులు--గుత్తేదారుడి కుమ్మక్కు ఉందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాధనంతో నిర్మించే రహదారుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇస్తే బాధ్యత వహించాల్సింది ఎవరో రోడ్లు భవనాల శాఖ ఉన్నతాధికారులు తేల్చాలని, మిగిలిన రెండు కిలోమీటర్ల రహదారిని పూర్తిచేసి, ఇప్పటికే దెబ్బతిన్న ప్రాంతాలపై సాంకేతిక నిపుణులతో నాణ్యతా పరీక్షలు నిర్వహించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.



## పేద విద్యార్థులకు హుస్సేనీ అసోసియేషన్ ఆర్థిక సాయం, విద్యా సామగ్రి పంపిణీ.



**మామిడికుదురు.ఆగస్టు 16 (ప్రభాతవార్త)** పేద ముస్లిం విద్యార్థులను చదువులో ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని హుస్సేనీ ఎడ్యుకేషనల్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆదివారం మామిడికుదురులో అసోసియేషన్ ఆధ్వర్యంలో 3వ.తరగతి నుండి 10 వ.తరగతి వరకు చదువుతున్న 100 మంది పేద విద్యార్థులకు ఉచిత విద్యా సామగ్రి, పదవతరగతి లో 500 మార్కులు పైగా, ఇంటర్లో 900 మార్కులు పైబడి వచ్చిన 20 మందికి నగదు ప్రోత్సాహకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, సమాజంలో ఆర్థిక సాయం అందక ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో హుస్సేనీ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ ప్రతినిధులు ఆగా హుస్సేన్,కల్బే ఆబేద్ మాజింద్రాణి,సాదక్ హుస్సేన్,రిజ్వానుల్ హసన్,నన్నేషా హుస్సేన్, అలీ అక్తర్,మొహమ్మద్ అలీ బేగ్,సర్కిల్ ఫఖర్ హుస్సేన్, ఆబేద్ అలీ,హుస్సేనీ బేగ్, కిష్వర్ అబ్బాస్ కాజరాని అధిక సంఖ్యలో విద్యార్థులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ట్రెజరీ ఉద్యోగి బి.సంతోషంకు ఉత్తమ సేవా పురస్కారం



**మామిడికుదురు.ఆగస్టు 16(ప్రభాతవార్త)** విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ, ఉత్తమ సేవలు అందించినందుకు గానూ మామిడికుదురు గ్రామానికి చెందిన బి.సంతోషం ప్రతిష్ఠాత్మక జిల్లా స్థాయి సేవా పురస్కారాన్ని అందుకున్నారు. రాజోలు ట్రెజరీ కార్యాలయంలో జూనియర్ అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమెకు ఈ గౌరవం దక్కింది.అమలాపురంలో ఘనంగా జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఆమె ఈ అవార్డును స్వీకరించారు. వేడుకల్లో ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ప్రభుత్వ విధుల్లో చూపిన ప్రతిభ, అంకితభావానికి గానూ సంతోషంకు ఈ అవార్డు లభించడం పట్ల ట్రెజరీ శాఖ అధికారులు, సహచర సిబ్బంది మరియు మామిడికుదురు గ్రామ ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. ఆమెకు పలువురు శుభాకాంక్షలు మరియు అభినందనలు తెలియజేశారు.

## మామిడికుదురులో భక్తిశ్రద్ధలతో 'షబ్బేదారి'



**మామిడికుదురు.ఆగస్టు 16(ప్రభాతవార్త)** మొహరం సంతాప వేడుకల్లో భాగంగా శనివారం రాత్రి నగరంలో 'షబ్బేదారి' (జాగరణ) కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అంజుమనే ఘాజి అబ్బాస్ భక్త బృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ జాగరణలో మత ప్రబోధకులు యూసుఫ్ అహ్మద్ మషద్దీ 'మజ్లిస్' ఆలపించారు. హజరత్ ఇమామ్ హుస్సేన్ పరివారానికి నివాళులర్పించేందుకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. హైదరాబాద్ కు చెందిన ఆరాకీనే అంజుమనే పర్వనయే షబ్బీర్ బృందం ఆధ్వర్యంలో రాత్రంతా సాంప్రదాయ 'మాతం' నిర్వహించగా, పలు భక్త బృందాలు భక్తులకు అవసరమైన భోజన,అల్పాహార సదుపాయాలు కల్పించాయి.

## ఆదివారం లిడ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక తనిఖీ

**వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి - ఎస్సై పవన్ కుమార్**



**గోకవరం :ఆగస్టు 16 ప్రభాత వార్త.** గోకవరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ రోజు మధ్యాహ్నం 3:00 గంటల నుండి సాయంత్రం 7:00 గంటల వరకు డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక తనిఖీలు చేపట్టనున్నట్లు గోకవరం ఎస్సై ఎచీఎ పవన్ కుమార్ ఎస్సై ఆదివారం తెలిపారు.రంపచోడవరం పర్యాటక ప్రాంతాలకు వెళ్లే పర్యాటకుల రాకపోకలు అధికంగా ఉండే నేపథ్యంలో, రోడ్డు ప్రమాదాలను నివారించడం, ప్రజల భద్రతను కాపాడడం మరియు మద్యం సేవించి వాహనాలు నడపడాన్ని అరికట్టడం కోసం ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, అప్రమత్తంగా మరియు జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే జరిమానాతో పాటు కోర్టు విధించే 2 రోజుల జైలు శిక్షకు గురికాబడతారని హెచ్చరించారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని వాహనదారులు పోలీసులకు సహకరించాలని ఎస్.ఐ. పవన్ కుమార్ కోరారు.

## ఉత్తమ సేవలకు పలు అధికారులకు ప్రతిభా పురస్కారం...



**ఆత్రేయపురం, ఆగస్టు 16,(ప్రభాత వార్త)** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా పలువురు అధికారులు ఉత్తమ సేవా ప్రతిభా పురస్కారం అందుకున్నారు.శనివారం అమలాపురం పెరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో మండలంలో డీఆర్‌డీఏ--సెర్ప్ ,ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న రావి మహాదేవ గంగాధర్‌కు అలాగే వాడపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి అశోక్ కు ,ఆత్రేయపురం గ్రామ సేవకుడిగా, బెస్ట్ వీఆర్‌ఏ వార ప్రకాష్ లు ఈ ఉత్తమ సేవా పూనస్కార అవార్డు లు అందుకున్నారు. వారు గ్రామాల్లో ప్రభుత్వ అందించిన సేవలను ప్రజల వద్దకు చేరవేసి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, మహిళా సంఘాల అభివృద్ధి, గ్రామీణ పేదరిక నిర్మూలన కార్యక్రమాల సమర్థ నిర్వహణలో చూపిన ప్రతిభకు గుర్తింపుగా జిల్లా యంత్రాంగం సత్కరించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాంబాబు చేతుల మీదుగా ఉత్తమ సేవ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా ఆత్రేయపురం మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, సహచర ఉద్యోగులు మహిళా సంఘాల సభ్యులు, వెలుగు కార్యాలయ సిబ్బంది వారికి అభినందనలు తెలియజేశారు.

## ప్రభుత్వ పాఠశాలకు కూలర్ బహుకరణ



**తాళ్లరేవు, ఆగస్టు 16( ప్రభాత వార్త):** మండలం నీలపల్లి గ్రామ పంచాయతీ మోకావారిపేట ఎంపీపీ మోడల్ పాఠశాలకు దివంగత గంటా చెన్నకేశవ మాష్టారు, బృందావతి దంపతుల జ్ఞాపకార్థం కూలర్ బహుకరించారు. పాఠశాల విద్యార్థులకు చల్లని త్రాగునీరు అందించేందుకు మాష్టారు కుమారులు ఎఎన్నార్ కాలేజీ విశ్రాంత బోటని హెచ్ ఒ డి గంట రాంప్రసాద్ బాబు, విశ్రాంత డిప్యూటి కలెక్టర్ గంటా సత్య కుమార్ ఈ కూలర్ ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు సిహెచ్ వీర్రాజు, చెక్కా తాతారావు, ర్యాలి సత్యనారాయణ, చిట్టూరి కలికి మూర్తి, వస్కా రెడ్డి, గంటా గోపి, విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### నిరాడంబరంగా మండల టిడిపి అధ్యక్షుడు

# చింతమనీడి అబ్బాయి జన్మదిన వేడుకలు

**- రైతులకు ఆసరాగా నిలిచిన అబ్బాయి కుటుంబ సభ్యులు**
**- 650 మంది రైతులకు ఉచితంగా యూరియా బస్తాలు అందజేత**
**- కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్న అబ్బాయి అభిమానులు**

**తుని, ఆగస్టు 16,( ప్రభాతవార్త )** తుని నియోజకవర్గ సర్పంచుల సమైక్య మాజీ అధ్యక్షుడు, తుని మండల టిడిపి అధ్యక్షుడు చింతమనీడి అబ్బాయి జన్మదిన వేడుకలు నిరాడంబరంగా జరిగాయి. మండల టిడిపి అధ్యక్షుడు అబ్బాయి జన్మదిన వేడుకలకు దూరంగా ఉన్నారు.



అబ్బాయి జన్మదినాన్ని పురస్కరించుకుని తుని మండలం ఎన్ సూరవరంలో అబ్బాయి కుటుంబ సభ్యులు, ఆయన అభిమానుల ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకుని జన్మదిన వేడుకలను నిర్వహించారు.



అబ్బాయి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఆయన సోదరులు ఎన్. సురవరం పంచాయతీ పరిధిలోని 650 మంది రైతులకు ఉచితంగా యూరియా బస్తాలు అందజేశారు. జన్మదిన వేడుకల సందర్భంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో యూరియా బస్తాలు అందజేసి ఆసరాగా నిలవడంపై రైతుల ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చింతంనీడి ఏసు బాబు, చింతంనీడి వెంకన్న దొర, పోతంశెట్టి వెంకటరావు, పోతంశెట్టి దివాణం, గట్టెం శివ, నర్సే శీను, విశ్వనాధుని కుస రాజు, షేర్ రాము, పోతంశెట్టి సత్యనారాయణ, దేవరపు వెంకటేష్, దేవవరపు సత్యనారాయణ, నర్సే అబ్బాయి, దాడిశెట్టి ఏసుబాబు, కసిరెడ్డి గోవిందు, దాడిశెట్టి బాబ్జి, ఎలమంచిలి వరహాల బాబు, దాడిశెట్టి జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ కానిస్టేబుల్ బుజ్జిబాబుకు ఉత్కృష్ట సేవా పతకం ప్రదానం



**అడ్డతీగల,ఆగస్టు 16, ప్రభాతవార్త** అడ్డతీగల పోలీస్ స్టేషన్ స్పెషల్ బ్రాంచ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఎన్.బుజ్జిబాబు జిల్లా స్థాయి ఉత్కృష్ట సేవా పతకం అందుకున్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ చేతుల మీదుగా ఆయన ఈ విశిష్ట పురస్కారాన్ని స్వీకరించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు స్పెషల్ బ్రాంచ్ విభాగంలో నిఘా సమాచారాన్ని సమర్థవంతంగా సేకరించడంలో బుజ్జిబాబు చూపిన ప్రతిభ, అంకితభావానికి గానూ ప్రభుత్వం ఈ అవార్డును అందించింది.విధి నిర్వహణలో నిరంతరం శ్రమిస్తూ ఉన్నతాధికారుల ప్రశంసలు పొందిన ఆయనకు ఈ పథకం లభించడం పట్ల స్థానిక పోలీసు యంత్రాంగం హర్షం వ్యక్తం చేసింది. ?ఈ సందర్భంగా బుజ్జిబాబును అడ్డతీగల పోలీస్ అధికారులు, తోటి సిబ్బంది మరియు స్థానికులు అభినందించారు. ఈ పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులోనూ ప్రజలకు, పోలీసు శాఖకు మరింత మెరుగైన సేవలు అందిస్తానని ఆయన తెలిపారు.

## గోటేటి కుటుంబానికి అండగా కూటమి ప్రభుత్వం

**లోకేష్ ఆదేశాలతో అధికార యంత్రాంగం చర్యలు రూ5 లక్షలతో పక్కా ఇంటి నిర్మాణం : ఎమ్మెల్యే బండారు**




**కొత్తపేట, ఆగస్టు 16, (ప్రభాతవార్త)** పేదల కష్టాలను గుర్తించి తక్షణమే పరిష్కరించడమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు కొత్తపేట నియోజకవర్గం అవిడి గ్రామానికి చెందిన గోటేటి రామమూర్తి కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న విషయం సోషల్ మీడియా ద్వారా మంత్రి నారా లోకేష్ దృష్టికి వెళ్లడంతో వెంటనే స్పందించి కుటుంబాన్ని ఆదుకోవాలని ఆదేశించారని తెలిపారు ఈ విషయం తన దృష్టికి వచ్చిన వెంటనే అవిడి గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులకు సమాచారం అందించి కుటుంబ పరిస్థితిని పరిశీలించి తక్షణ సహాయం అందించేలా చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే వివరించారు గత కొంతకాలంగా గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రామకృష్ణ తదితరులు రామమూర్తి కుటుంబానికి నిత్యావసర సరుకులు కూరగాయలు వంటి సహాయాన్ని అందిస్తూ వస్తున్నారని తెలిపారు కుటుంబానికి ప్రధాన సమస్యగా ఉన్న విద్యుత్ సౌకర్యాన్ని అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి 24 గంటల వ్యవధిలోనే అందుబాటులోకి తీసుకొచ్చారని ఎమ్మెల్యే చెప్పారు విద్యుత్ లైన్ నుంచి సరఫరా తీసుకువచ్చి అవసరమైన చోట కొత్తగా ఏడు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్ ఇచ్చినట్లు తెలిపారు అదేవిధంగా కుటుంబానికి శాశ్వత నివాసం కల్పించేందుకు రూ 5 లక్షల వ్యయంతో పక్కా ఇంటి నిర్మాణం చేపట్టేందుకు హౌసింగ్ శాఖ అధికారులు చర్యలు ప్రారంభించారని చెప్పారు పి4 పథకం కింద ఇంటి నిర్మాణానికి అవసరమైన గణాంకాలు సిద్ధం చేసి పనులు ప్రారంభించే ప్రక్రియను చేపట్టారని సుమారు రెండు నెలల్లో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు ఇంటికి అటాచ్డ్ బాత్‌రూమ్ సదుపాయం కూడా కల్పించనున్నట్లు చెప్పారు కుటుంబానికి ప్రస్తుతం అందుతున్న రూ 4 వేల పెన్షన్‌తో పాటు వారు అర్హత పొందే ఇతర సామాజిక భద్రతా పింఛన్లపై కూడా అధికారులు పరిశీలన చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు కుటుంబానికి ఎదురవుతున్న హౌస్‌హోల్డ్ సమస్యను పరిష్కరించి అర్హత మేరకు దివ్యాంగుల పెన్షన్ లేదా సీరియస్ ఇల్‌నెస్ పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కుటుంబానికి గ్యాస్ స్టవ్ సిలిండర్ వంట పాత్రలు ఫర్నిచర్ తదితర అవసరమైన సామగ్రిని కూడా సమకూర్చినట్లు తెలిపారు సుమారు రూ30 వేల నుంచి రూ40 వేల విలువైన సామగ్రిని అందించడంతో పాటు కొంతమంది దాతలు కూడా ముందుకు వచ్చి కుటుంబానికి సహాయం చేస్తున్నారని చెప్పారు

## చిత్రాడలో పేకాట శిబిరంపై దాడి

**పిఠాపురం, ఆగస్టు 16 ( ప్రభాతవార్త)** పిఠాపురంమండలం చిత్రాడ గ్రామంలో ఆదివారం పేకాట శిబిరంపై ఎస్ఐ లోకేష్ దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గ్రామాల్లో పేకాట, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

## నాటక అకాడమీ డైరెక్టర్ ఏసుపాదంకు సత్కారం



**సీతానగరం, ఆగస్టు 16, (ప్రభాతవార్త) :** ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్‌గా మద్దాల ఏసుపాదం ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా స్థానిక జీవీకే ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఆయన సతీమణి వెంకటలక్ష్మి, టీడీపీ యువ నాయకుడు పెందుర్తి అభిరామ్ ముఖ్య అతిథులుగా హాజరై, ఆయనను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలరామకృష్ణ మాట్లాడుతూ, జనసేన పార్టీ బలోపేతానికి, సిద్ధాంతాల వ్యాప్తికి నిరంతరం కృషి చేసిన ఏసుపాదం సేవలకు తగిన గుర్తింపు లభించిందన్నారు. ప్రజాక్షేత్రంలో ఆయన చేసిన కృషికి ప్రతిఫలంగానే కూటమి ప్రభుత్వంలో ఈ బాధ్యత దక్కిందన్నారు. నాటక అకాడమీ డైరెక్టర్‌గా కళలకు, కళాకారులకు పూర్తి స్థాయిలో సేవలు అందిస్తూ నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, ఆయనకు అభినందనలు తెలిపారు.

## డీ జ్యూర్ ట్రాన్స్‌ఫర్ డే సందర్భంగా యానాంలో ఘన నివాళులు



**యానాం, ఆగస్టు 16: (ప్రభాతవార్త)** డీ జ్యూర్ ట్రాన్స్‌ఫర్ డే సందర్భంగా యానాంలో స్వాతంత్ర్య సమరయోధుల స్మారక చిహ్నం వద్ద ఘనంగా నివాళులర్పించారు. పుదుచ్చేరి పీడబ్ల్యూడీ మంత్రి మల్లాడి కృష్ణారావు స్మారక చిహ్నానికి పుష్పమాల సమర్పించి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో యానాం రీజినల్ అడ్మినిస్ట్రేటర్ శివరాజ్ మీనా, పోలీస్ శాఖ ఉన్నతాధికారులు, యానాం మున్సిపల్ అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి స్వాతంత్ర్య సమరయోధులకు ఘన నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్య పరిరక్షణకు వారు చేసిన కృషి చిరస్మరణీయమని వక్తలు పేర్కొన్నారు.

## సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజా దర్బార్

**ప్రజాదర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే బండారు**





**కొత్తపేట, ఆగస్ట్ 16, (ప్రభాతవార్త)** ప్రజల సమస్యలను తత్వరమే పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వాడపాలెం గ్రామంలో ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదివారం ప్రజాదర్బార్ నిర్వహించారు నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుండి వినతులు స్వీకరించారు18 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు సమస్యల పరిష్కారానికి ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు వివరించారు

## బాలల హక్కుల పరిరక్షణలో విశిష్ట సేవలకు "అలర్ట్" స్వచ్ఛంద సంస్థకు ప్రశంసా పత్రం



**ముమ్మిడివరం ఆగస్టు 16 (ప్రభాతవార్త)** డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నివారణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల అక్రమ రవాణా నిరోధం తదితర అంశాలపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ విశిష్ట సేవలు అందిస్తున్న అలర్ట్ స్వచ్ఛంద సంస్థ ను 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా యంత్రాంగం ఘనంగా సత్కరించారు అని ఆ సంస్థ కోఆర్డినేటర్ కె.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. 2026 ఆగస్టు 15న అమలాపురంలో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి శ్రీ వాసంశెట్టి సుభాష్, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ రవిరాల, ఐ.ఏ.ఎస్., జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శ్రీ రాహుల్ మీనా, ఐ.పి.ఎస్.,మరియు ఇతర ఉన్నతాధికారుల సమక్షంలో అలర్ట్ స్వచ్ఛంద సంస్థకు ప్రశంసా పత్రంఅందజేశారు.ఈ సందర్భంగా అలర్ట్ స్టేట్ కో–ఆర్డినేటర్ శ్రీ ఎస్. శ్రీనివాస్ మరియు జిల్లా కో–ఆర్డినేటర్ శ్రీ కె. వెంకటేశ్వరరావు సంస్థ తరపున ప్రశంసా పత్రాన్ని స్వీకరించారు.ఈ గుర్తింపు అలర్ట్ స్వచ్ఛంద సంస్థకు మరింత బాధ్యతను, ఉత్సాహాన్ని అందించిందని, భవిష్యత్తులో కూడా జిల్లాలో బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, బాలల అక్రమ రవాణా నిర్మూలనతో పాటు బాలల హక్కుల పరిరక్షణ కోసం మరింత విస్తృతంగా పనిచేస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

## గెయిల్ ఇండియా పైప్‌లైన్ మనఅందరిదీ



**రామచంద్రపురం,ఆగస్టు16 (ప్రభాతవార్త):** గెయిల్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన ఆర్.ఓ.యు.గ్యాస్ పైప్‌లైన్ వెంబడి ఉన్న గ్రామాల్లో పైప్‌లైన్ భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆదివారం బుర్రకథ కార్యక్రమాలు నిర్వహించారు.రామచంద్రపురం కళాబృందానికి చెందిన గొర్రెల రాము,కృష్ణా,శ్రీనివాసరావు బ్రదర్స్ బృందాలు ఉండ్రాజవరం మండలంలోని వెలగదుర్రు,పసలపూడి పోదూరు మండలంలోని పెనుమదం గ్రామాల్లో బుర్రకథలు ప్రదర్శించి ప్రజలను చైతన్యపరిచాయి.ఈ సందర్భంగా గ్యాస్ పైప్‌లైన్ ప్రాధాన్యత,పైప్‌లైన్ పరిసర ప్రాంతాల్లో పాటించాల్సిన భద్రతా నిబంధనలు, సంబంధిత అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి తవ్వకాలు చేపట్టరాదనే విషయాలను వివరించారు.అలాగే పైప్‌లైన్ వద్ద గ్యాస్ లీకేజీ లేదా ఇతర అసాధారణ పరిస్థితులు గమనించిన వెంటనే గెయిల్ టోల్‌ఫ్రీ నంబర్ 15101కు సమాచారం అందించాలని గ్రామస్తులకు సూచించారు.

## సంజీవమ్మ మృతికి ఎమ్మెల్యే శిరీషాదేవి దంపతులు సంతాపం



**రాజవొమ్మంగి, ఆగస్టు 16, ప్రభాతవార్త** ప్రముఖ ఉపాధ్యాయుడు మఠం ఆదియ్య మాస్టర్ మాతృవియోగం బాధాకరమని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. రాజవొమ్మంగి మండలం అనంతగిరి గ్రామానికి చెందిన మఠం సంజీవమ్మ (70) శనివారం మృతి చెందారు. మృతురాలి పార్థివదేహానికి ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, భర్త నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయ్ భాస్కర్ పూలమాలలను వేసి నివాళులను అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. సంజీవమ్మ మృతి కుటుంబానికే కాకుండా పార్టీకి కూడా తీరని లోటని, కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే తెలిపారు. మఠం విజయ్ భాస్కర్ స్వయంగా పాడె మోసి నివాళులను అర్పించారు. కార్యక్రమంలో వాణిజ్య పన్నుల విభాగ అధికారి సింహాచలం, మాజీ ఎంపీటీసీ బొరగ ప్రశాంత్‌కుమార్, ఉపాధ్యాయ సంఘాల నేతలు బొంకు దొరబాబు, వి. పాల్‌బాబు, డి. బిక్షం, మాజీ సర్పంచ్ మఠం డియసమ్మ, స్థానిక పెద్దలు కొక్కుల ఆనందరావు, దూలి పురుషోత్తం, వాసా సత్యనారాయణ, గ్రామస్తులు, పలువురు పాల్గొన్నారు.

## నీతివంతమైన రాజకీయ వేత్త వాజ్ పేయ్

**అటల్ బీహార్ వాజ్ పేయ్ వర్ధంతిలో పాలూరి**



**కొత్తపేట, ఆగస్ 16, (ప్రభాతవార్త)** బిజెపి మండల ప్రధాన కార్యదర్శి కోటిపల్లి వెంకట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బిజెపి వ్యవస్థాపక అధ్యక్షులు భారతరత్న,మాజీ ప్రధాని అటల్ బీహార్ వాజ్ పేయ్ వర్ధంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ఐఆర్ నియోజకవర్గ కన్వీనర్ పాలూరి సత్యానందం విచ్చేశారు ముందుగా పార్టీ కార్యకర్తలు నాయకులు వాజపేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వాజ్ పేయ్ 18 సంవత్సరాల వయసులో క్విట్ ఇండియా ఉద్యమం లో పాల్గొని 23 రోజులపాటు బ్రిటిష్ జైల్లో శిక్ష అనుభవించారని భారతదేశానికి ఆయన ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ప్రజలకోసం అనేక పథకాలు అమలు చేసారని వాటిలో సర్వ శిక్ష అభియాన్ ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కిసాన్ క్రెడిట్ కార్డ్ అన్నపూర్ణ యోజన స్వర్ణ చతుర్భుజి జాతీయ రహదారుల అభివృద్ధి ఇలా ఎన్నో ప్రజలకు అవసరమైన పథకాలను తీసుకుని వచ్చిన మహనీయుడు అన్నారు ఈ సందర్భంగా ఆయనను స్మరించుకోవడం భారతీయులు అందరి బాధ్యత అని అన్నారు ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ పాలాటి మాధవస్వామిబిజెపి యువమోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు కోటిపల్లి దామోదర్ యువ మోర్చా జిల్లా కార్యదర్శి వలపశెట్టి కిరణ్ తేజ్ జిల్లా కార్యవర్గ సభ్యులు అన్యం సత్యనారాయణ యువ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి చోడపనీడి ముఖేష్ ఓబీసీ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి వెన్నేటి రామకృష్ణ అభిమానులు బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు

## ప్రకృతి వ్యవసాయశీతో తక్కువ పెట్టుబడి అధిక దిగుబడులు.... రైతులకు అవగాహన..



**ఆత్రేయపురం, ఆగస్టు 16,(ప్రభాత వార్త)** మండలంలోని మెర్లపాలెం శివారు సిపి రెడ్డి గోసాల లో జరిగిన ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం వేలిచేరుకు చెందిన పకృతి వ్యవసాయ రైతు మానే రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా విజయ రామ్ పాల్గొని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగుల మందులు వాడకుండా, ప్రకృతి సిద్ధమైన పద్ధతుల్లో చేసే సేద్యం. ఇది నేల సారాన్ని పెంచుతూ, తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడిని ఇస్తుంది. దీనివల్ల ఆరోగ్యకరమైన పంటలు పండుతాయని అలాగే పర్యావరణం కాపాడబడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు జీవామృతం తయారు చేసుకోవడానికి రైతులకు ప్లాస్టిక్ డ్రమ్స్ పంపిణీ చేసారు. ఈ కార్యక్రమం లో మానే రాంబాబు, మిద్దె వెంకటేశ్వరావు, వరదా సూరిబాబు, వీరా రెడ్డి ప్రకృతి వ్యవసాయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు దుస్తులు, పసుపు కుంకుమలు పంపిణీ



**గండేపల్లి. ఆగస్టు 16. ప్రభాతవార్త** పెళ్లి అనేది నూరేళ్ల ఆనందమైన జీవితం.ఈ సమయంలో ఇచ్చే కానుకలు జీవితాంతం గుర్తుండడమే కాకుండా ఇచ్చిన వారి పట్ల మరింత బశీధం మెరుగు పడుతుంది.గండేపల్లి మండలం జెడ్ రాగంపేట గ్రామానికి చెందిన ఉండవల్లి ప్రసాద్ దంపతులు గ్రామంలో జరిగే ప్రతి వివాహానికి పెళ్ళికొడుకు,పెళ్ళి కుమార్తె కు దుస్తులు,పసుపు, కుంకుమలు, 25 కేజీల బియ్యం ఇవ్వాలని నిశ్చయించుకున్నారు.ఈ కార్యక్రమాన్ని శ్రావణమాసం సందర్భంగా ఓ నూతన దంపతులకు ఇవ్వడంతో మొదలుపెట్టారు.గ్రామంలో ఏటా ఎన్ని పెళ్లిళ్లు జరిగితే అన్ని పెళ్లిళ్లకు ఈ కానుక ఇవ్వనున్నట్లు,తమ జీవితాంతం ఈ కానుకలను నూతన దంపతులకు ఇస్తామని వారు ఆనందంతో తెలియ చేశారు.

## గొల్లప్రోలు ప్రధాన రహదారిపై ప్రమాదకర గోతులు..



**గొల్లప్రోలు, ఆగస్ట్ 16, (ప్రభాతవార్త)** గొల్లప్రోలు పట్టణంలో ప్రధాన రహదారి ఎస్బిఐ బ్యాంక్ సమీపంలో ప్రమాదకర గోతులు ఏర్పడ్డాయి వర్షం కారణంగా గోతుల్లో నీరు నిలిచిపోవడం వల్ల వాహనదారులకు రాత్రి వేళల్లో ఆ గోతులు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి ఈ సమస్యను అధికారులు దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిష్కారం కాలేదని స్థానికులు తెలిపారు.

## తాళ్ళూరులో పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్

**15 ద్విచక్ర వాహనాలు సీజ్**
**- అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు**
**- తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు**



**తుని, ఆగస్టు 16,( ప్రభాతవార్త )** తుని మండలం తాళ్లూరు గ్రామంలో జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు, రూరల్ ఎస్సై కృష్ణమాచారి, పట్టణ ఎస్ఐ విజయబాబు ల ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్ లో సరైన ధ్రువపత్రాలు లేని 15 ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. నిబంధనలకు లోబడి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా తుని రూరల్ సిఐ చెన్నకేశవరావు గ్రామస్తులతో మాట్లాడుతూ ఎవరైనా గంజాయి డ్రగ్స్ వంటి ముత్తు పదార్థాలు సేవించడం,సరఫరా, రవాణావంటి చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు వాహనాలను నడిపే సమయంలో ట్రాఫిక్ నియమాలను పాటించాలని, వాహనాలకు సంబంధించిన సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో తుని నియోజకవర్గంలోని తుని, తుని రూరల్, కోటనందూరు, తొండంగి పోలీస్ స్టేషన్ల పరిధిలోని పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు 6లో

## చినబొడ్డు హైస్కూల్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



**తాళ్ళరేవు, ఆగస్టు 16 (ప్రభాతవార్త):** తాళ్లరేవు మండలం బొడ్డు చిన వెంకటాయపాలెం జడ్పీ హైస్కూల్లో పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఐదుగురు విద్యార్థులకు స్థానిక నాయకులు బొడ్డు సత్యనారాయణ సమకూర్చిన నగదు ప్రోత్సాహకాలను పుదుచ్చేరి మంత్రి మల్లాడి కృష్ణారావు ఆయా విద్యార్థులకు అందజేశారు. హైస్కూల్ హెచ్ఎం సాయి ప్రసాద్ అధ్యక్షతన బొడ్డు సత్యనారాయణ కళ్యాణ మండపం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులను మంత్రి మల్లాడి అభినందించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి ఈ ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు బొడ్డు సత్యనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ చైర్మన్ కొపనాతి దత్తాత్రేయ వర్మ ,కోరంగి మాజీ సర్పంచ్ బర్రె లక్ష్మీ నరసింహ రాజు, బొడ్డు సత్యనారాయణ (చిన్ని) తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పాడలో ఒకరోజు 4 దొంగతనాలు

**యు.కొత్తపల్లి, ఆగస్టు 16** (ప్రభాతవార్త) : మండలంలోని ఉప్పాడ ఒకరోజు 4 దుకాణాలలో దొంగతనాలు జరగడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దొంగలు ఉప్పాడ బీచ్ రోడ్డు కూడలిలో ఉన్న సెల్ పాయింట్ లో 4 సెల్‌ఫోన్లు, 2 ట్యాబ్‌లు, చెప్పుల షాపుతో పాటు మరో దుకాణంలోను, అమీనాబాదు సెంటర్లో ఉన్న ఐరన్ శానిటరీ దుకాణంలో సుమారు 8వేల నగదు అపహరించుకు పోయారు. దీంతో బాధితులు పోలీసులకు పిర్యాదు చేసినట్లు తెలిపారు. దొంగతనాలకు పాల్పడిన వ్యక్తులు పైకప్పులు బద్దలుకొట్టి దుకాణాల్లో ఉన్న సీసీ కెమెరాలు దిశను మార్చి దొంగతనాలకు పాల్పడటం గమనార్హం.

## కాకినాడ గ్రామీణ గణేశ ఉత్సవ సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రంభాల

### సెప్టెంబర్ 14 నుంచి అత్యంత భక్తిశ్రద్ధలతో గణపతి నవరాత్రులు



**కాకినాడ రూరల్, ఆగస్టు 16 (ప్రభాతవార్త):** కాకినాడ గ్రామీణ గణేశ ఉత్సవ సమితి 38వ వార్షిక సమావేశం కార్యనిర్వాహక అధ్యక్షుడు రంభాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామీణ ప్రతినిధులతో నిర్వహించారు. సమితి అధ్యక్షుడు దూసర్లపూడి రమణరాజు ముఖ్య అతిథిగా హాజరై తొలుత విఘ్నేశ్వర పూజ నిర్వహించారు. అనంతరం లోకమాన్య బాలగంగాధర్ తిలక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమణరాజు మాట్లాడుతూ, సమితి విజ్ఞప్తి మేరకు ఈ నెల 18న జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రభుత్వ శాఖల అధికారులతో గణేశ ఉత్సవాల నిర్వహణపై ముందస్తు సమావేశం జరగనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 14 నుంచి 22 వరకు గణపతి నవరాత్రులు, 23, 24 తేదీల్లో గణేశ విగ్రహాల నిమజ్జనం నిర్వహించే అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ఆహ్వాన కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రంభాల వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఈ ఏడాది కాకినాడ సిటీ, రూరల్, తుని, పెద్దాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు, పిఠాపురం నియోజకవర్గాల్లోని నగరాలు, పట్టణాలు, మండలాలు, గ్రామాల్లో చవితి ఉత్సవ నిర్వాహకులతో సమన్వయ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రంభాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, గత 12 ఏళ్లుగా రూరల్ వాకలపూడి తీరంలో భారీ స్థాయిలో గణేశ నిమజ్జన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాదికి సమితి జిల్లా కమిటీని మరింత పటిష్టంగా, నిర్మాణాత్మకంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. రూరల్, సిటీ ఎమ్మెల్యేలు పంతం నానాజీ, వనమాడి కొండబాబు సూచనలు తీసుకుని, తుని, పెద్దాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు, పిఠాపురం ఎమ్మెల్యేల సహకారంతో అన్నవరం పంపా తీరం నుంచి సామర్లకోట కెనాల్ వరకు ప్రతి నిమజ్జన రేవులో ప్రభుత్వ ఏర్పాట్లకు వారధిగా పనిచేస్తామని అన్నారు. రూరల్ ఆహ్వాన కమిటీలో ప్రతి గ్రామం నుంచి సభ్యత్వం ఉండేలా చర్యలు తీసుకుంటామని, చవితి ఉత్సవ నిర్వాహకులను సమితిలోకి సాదరంగా ఆహ్వానిస్తామని రంభాల తెలిపారు. ఈ సమావేశంలో బొలిశెట్టి వెంకట రామకృష్ణ, పెండెం సత్యనారాయణ, నాగిరెడ్డి సతీష్, కవికొండల భీమశంకర్, పితాని లీలావతి తదితరులు పాల్గొన్నారు.

## 80 ఏళ్ల స్వాతంత్ర్యం, సమకాలీన భారతం. అంశం పై స్టడీ సర్కిల్



**తాళ్లరేవు, ఆగస్టు 16 (ప్రభాతవార్త):** స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో బేకుమాడి ఈశ్వరరావు సమన్వయకర్తగా" 80 ఏళ్ల స్వాతంత్ర్యం --- సమకాలీన భారతం "అనే అంశంపై స్టడీ సర్కిల్ జరిగింది .ఈ సమావేశంలో స్వతంత్ర పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల త్యాగాలను గుర్తుచేసి శ్రద్ధాంజలి ఘటించారు .అనంతరం ప్రస్తుత భారతదేశంలో జరుగుతున్న ప్రజాస్వామ్య, ప్రజా వ్యతిరేక విధానాలపై దేశంలో ఏ వర్గాలు అభివృద్ధి అయ్యాయి, శ్రామిక వర్గాలు దోపిడీకి గురవుతున్నాయని తెలిపారు. అప్పటి పరాయి బ్రిటిష్ పాలకులు భారత ప్రజలను జైల్లో పెట్టి ఏ విధంగా హింసించారు అప్పటి ఘటనలను వివరించారు. ప్రస్తుతం భారత దేశ పాలకులు అటువంటి పద్ధతులను అనుసరిస్తూ ప్రశ్నించే వారిని, ప్రజల కోసం పోరాడే మేధావులను ,నాయకులను అకారణంగా, అనాగరికంగా, ప్రజాస్వామ్య విరుద్ధంగా కేసులు పెట్టి జైల్లో ఉంచుతున్నారని అన్నారు. అటువంటి అప్పుడు బ్రిటిష్ వాళ్లకు ,మన పాలకులకు తేడా ఏముందని ప్రశ్నించారు. అందుకునే ప్రజాస్వామ్యవాదులు, ప్రజా సంఘాలు, అభ్యుదయవాదులు భారత రాజ్యాంగంలో ఉన్న స్వేచ్ఛ, సమానత్వం ,సామాజిక న్యాయం కోసం ఉమ్మడిగా పోరాటం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు కే .రవీంద్ర, కె ఈశ్వరి, పి అనంతలక్ష్మి, ఆర్ నాగలక్ష్మి ,జి భాస్కరరావు, ఎం నారాయణ రావు, టి రాంబాబు ,ఎన్ వెంకటలక్ష్మి, డి అదృష్టదీపుడు, విమల, దేవి తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీ పాఠశాల విద్యార్థినిలు రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటారు.



**గోకవరం :ఆగస్టు 16 (ప్రభాత వార్త)** తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం కామరాజుపేట జడ్పీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిలు రాష్ట్రస్థాయి (ఊషూ) పోటీల్లో పాల్గొని స్టేట్ లెవెల్ గోల్డ్ మెడల్ అందుకున్నారు. ఈ సందర్భంగా కామరాజుపేట జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేంద్ర కుమార్ ఆదేశాల మేరకు జడ్పీ పాఠశాల పి.డి. మజ్జూరి మనీష్, ఆధ్వర్యంలో ఒంగోలులో జరిగిన పోటీలకు కామరాజుపేట జడ్పీ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థినిలు గోల్డ్ మెడలు సాధించారు. ఒకరు కామరాజుపేట గ్రామస్తులు పిదుం దుర్గాప్రసాద్ కుమార్తె పిదుం వెంకటలక్ష్మి, ఎనిమిదో తరగతి నుంచి పోటీలో పాల్గొన్నారు. అలాగే రెండవ విద్యార్థిని ఠాకూర్ పాలెం గ్రామస్తులు కర్నాటి చిన్నబాబు కుమార్తె కర్నాటి భాను, తొమ్మిదో తరగతి విద్యార్థిని పోటీలో పాల్గొన్నారు. ఇద్దరు విద్యార్థినీలు రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించారు. కామరాజుపేట జడ్పీ పాఠశాలకు ఇంత గొప్ప పేరు ప్రతిష్టలు తీసుకొచ్చిన ఇరువురు చిన్నారిలకి కామరాజుపేట గ్రామ ప్రజానీకం తరపున జడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరు వారికి అభినందనలు తెలియజేస్తున్నారు.

## స్త్రీ శక్తితో మహిళలకు ప్రయాణ భరోసా: మంత్రి సుభాష్



**రామచంద్రపురం, ఆగస్టు16 (ప్రభాతవార్త):** మహిళల సాధికారతే రాష్ట్ర అభివృద్ధికి పునాదని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు.స్త్రీ శక్తి పథకం అమలై ఏడాది పూర్తయిన సందర్భంగా ఆదివారం రామచంద్రపురంలో ఆర్టీసీ బస్సులో మహిళలతో కలిసి ప్రయాణించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణంతో నెలవారీ రవాణా ఖర్చులు తగ్గి కుటుంబాలకు ఆర్థికంగా ఊరట లభిస్తోందన్నారు.విద్యార్థినులు,ఉద్యోగినులు,స్వయం ఉపాధి మహిళలకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతోందని తెలిపారు.మంత్రి సుభాష్ మాట్లాడుతూ మహిళల ప్రయాణ భారాన్ని తగ్గించడంతో పాటు విద్య,ఉద్యోగం,వైద్యం,స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా స్త్రీ శక్తి పథకం దోహదపడుతోందన్నారు.మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు స్వయం సహాయక సంఘాల బలోపేతం, నైపుణ్యాభివృద్ధి,ఉపాధి అవకాశాల కల్పన వంటి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు.కార్యక్రమంలో కూటమి నాయకులు,మహిళలు పాల్గొన్నారు.

## సింగంపల్లిలో గంజాయి, రోడ్డు భద్రతపై అవగాహన



**రాజవొమ్మంగి, ఆగస్టు 16, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలం సింగంపల్లి గ్రామ సెంటర్‌లో ఆదివారం రాజవొమ్మంగి ఎస్ఐ వెంకట్రావు ఆధ్వర్యంలో సి. ఐ. సన్యాసినాయుడు ప్రజలకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళా చట్టాలు, శక్తి యాప్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతపై మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ ధరించాలని, జాగ్రత్తగా ప్రయాణించాలన్నారు. పశువులను రోడ్లపైకి విడిచిపెట్టకూడదని సూచించారు. గంజాయి వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, గంజాయి రవాణాకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని ఆయన వివరించారు. గ్రామస్తులు, పోలీసులు పాల్గొన్నారు.

## బీజేపీ పాలనకు 12 ఏళ్లు.. ప్రజా సమస్యలు పరిష్కారం కాలేదు



**రామచంద్రపురం, ఆగస్టు16 (ప్రభాత వార్త)** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 12 ఏళ్లు పూర్తి చేసుకున్నా ప్రజా సమస్యలు పరిష్కారం కాలేదని టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్.డి.ఖాన్ విమర్శించారు.నిరుద్యోగం,రైతుల సమస్యలు,విద్యార్థుల ఇబ్బందులు కొనసాగుతున్నాయని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని,రైతులకు ఎంఎస్‌పీపై చట్టబద్ధమైన హామీ కల్పించలేదని ఆరోపించారు.పోటీ పరీక్షల్లో పేపర్ లీకేజీలతో లక్షలాది మంది విద్యార్థులు నష్టపోతున్నారని ఖాన్ అన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ విద్య,వైద్య సదుపాయాలు మరింత మెరుగుపర్చాల్సిన అవసరం ఉందన్నారు.ఆదివాసీ ప్రాంతాల్లో భూములు,జీవనోపాధి కోల్పోతున్న వారికి సరైన పునరావాసం కల్పించడం లేదని ఖాన్ విమర్శించారు.ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించాలని, ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించాలని, పేపర్ లీకేజీలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.స్థానభ్రంశం చెందిన రైతులు, ఆదివాసీలకు తగిన పరిహారం,పునరావాసం కల్పించాలని ఆయన కోరారు.

## ఘనంగా భారత మాజీ ప్రధాని వర్ధంతి




**కె గంగవరం, ఆగస్టు 16, (ప్రభాతవార్త):** కె గంగవరం మండలం అముజూరు గ్రామంలో భారతీయజనతాపార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు రాష్ట్రీయ స్వయం సేవకులు నిగర్వి నిస్వార్ధ పరుడు మాజీ భారత బిజెపి ప్రధాని భారతరత్న,స్వర్గీయ అటల్ బిహారి వాజ్ పాయ్ వర్ధంతి గంగవరం బిజెపి మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి చంద్రరావు ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ముందుగా వాజ్ పాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఆయన దేశానికి చేసిన సేవలగురించి జిల్లాకార్యవర్గ సభ్యులు ఎ వి రమణమూర్తి మాట్లాడుతూ అవినీతిరహిత పాలననందించిన డిసెంబర్ 25 1924 లో మధ్యప్రదేశ్ గ్వాలియర్ లో జన్మించి దేశ పదవ ప్రధానిగా అందించిన గొప్ప రాజకీయ వేత్త అని,కాంగ్రెసేతర ప్రధాని అయిన ఆయన నాయకత్వంలో భారత్ అనేకరంగాలలో అభివృద్ధి చెందిందని,స్వర్ణ చతుర్భుజి ద్వారా జాతీయ రహదార్లు అబివృద్ధిచెందాయి అని,తద్వారా రోడ్డుప్రమాదాలు అరికట్టడమేకాక డ్రైవర్లకు సమయం కలసివచ్చేదని,సర్వశిక్షా అబియాన్ ద్వారా పాఠశాలలకు మౌలికసదుపాయాలు కలుగజేయడంద్వారా విద్యఅభివృద్ధి చెందిందని,ప్రభుత్వ పాఠశాలలో కళాశాలలో బాలికలకోసం మరుగుదొడ్లు నిర్మించడం ద్వారా, బేటీబచావో బెటీ పడావోల ద్వారా బాలికల విద్యాభివృద్ధిజరిగిందని అన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన, కిసాన్ క్రెడిట్ కార్డ్,అన్నపూర్ణ యోజన వంటి మొదలైన ఎన్నో పథకాలను ప్రజలకు అందించిన ఘనుడని అన్నారు. ఒకసారి కాంగ్రెస్ బిజెపిగురించి అవహేళనగా మాట్లాడితే వాజ్ పాయ్ తన కవితాధోరణిలో సూర్యుడు ఉదయిస్తాడు,అంధకారం అంతరిస్తుంది. కమలంవికసిస్తుంది. దేశం కాషాయమయం కాబోతుంది.కాంగ్రెస్ ముక్త భారత్ అవతరిస్తుంది అంటూ కాంగ్రెస్ పార్టీ నాయకుల నోర్లు మూయించారు.అలాగే కార్గిల్ యుద్ధం, ఫోక్రాన్ అణు పరీక్షలద్వారా పొరుగు దేశాలకు భారత్ రక్షణ రంగంలో తీసిపోదనే సంకేతం పంపారన్నారు.ఈ కార్యక్రమంలో సలాది రామకృష్ణ, కౌలూరి వెంకటకృష్ణ, అవసరాల నారాయణమూర్తి, నున్న సత్యన్నారాయణ, గంగిశెట్టి సత్తిబాబు సలాది శేఖర్,మణికంఠ మండల బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొని వాజ్ పాయ్ కి నివాళులర్పించగా బిజెపి సీనియర్ నాయకుడు, అనకాపల్లి జిల్లా బిజెపి ఇంచార్జ్ కర్రి చిట్టిబాబు 10వసారి బిజెపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు గా నియమింపబడినందుకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. పదిమంది రాష్ట్ర బిజెపి అధ్యక్షులు దగ్గర పదిసార్లు రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా పనిచేసిన ఘనత చిట్టి బాబు ది అని కొనియాడారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని, ఈ బాధ్యత చెప్పిన రాష్ట్ర ప్రధాని మోడీ కి, దేశ సీనియర్ నాయకులు వెంకయ్య నాయుడు కి,రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పి ఎన్ వి మాధవ్,రాష్ట్ర మంత్రి సంఘటన మధుకర్జి,ఎమ్మెల్సీ సోము వీర్రాజులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కాత్రేనికోన హైస్కూల్లో విజేతలకు ఖాళీ సర్టిఫికెట్ల పంపిణీ!



**కాత్రేనికోన ఆగస్టు 16 (ప్రభాత వార్త)** మండల కేంద్రమైన కాత్రేనికోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఉపాధ్యాయుల తీవ్ర నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం బహిర్గతమై స్థానికుల, తల్లిదండ్రుల తీవ్ర ఆగ్రహానికి దారితీసింది. విద్యార్థుల్లో దేశభక్తిని, ఉత్సాహాన్ని నింపేందుకు నిర్వహించిన ఆటల పోటీలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో ప్రతిభ కనబరిచిన విజేతలకు వేదికపై ప్రజాప్రతినిధులు, ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారని, అయితే తీరా ఇంటికెళ్లి చూసేసరికి ఆ ప్రశంసా పత్రాలపై కనీసం విద్యార్థి పేరు, తరగతి, కనీసం ప్రధానోపాధ్యాయురాలి సంతకం కూడా లేని 'ఖాళీ' సర్టిఫికెట్లు ఇవ్వడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఇక్కడ 20 మంది పైనే ఉపాధ్యాయ సిబ్బంది పనిచేస్తున్నారు. ఏ ఒక్క ఉపాధ్యాయుడికి బాధ్యత అప్పగించినా నిమిషాల్లో పూర్తయ్యే చిన్న పనిని కూడా చేయకుండా, జాతీయ పండుగను ఇంత అగౌరవపరిచేలా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై పాఠశాల హెచ్ఎం అంబ స్పందిస్తూ సమయాభావం వల్లే ఇలా జరిగిందని, ఆ సర్టిఫికెట్లను తిరిగి సేకరించి పూర్తి వివరాలు, సంతకంతో అందజేస్తామని వివరణ ఇచ్చారు .ఈ దారుణ నిర్లక్ష్యంపై జిల్లా విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి విచారణ జరిపి, బాధ్యులైన ఉపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి పునరావృతం కాకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రతిభకు ప్రోత్సాహం



**రామచంద్రపురం, ఆగస్టు16 (ప్రభాతవార్త):** 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శ్రీ కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో పాఠశాల ప్రథమస్థానం సాధించిన మెహర్ విలేఖ్యను అభినందించారు.జర్నలిస్టు గంగరాజు కుమార్తె అయిన విలేఖ్యకు రూ.10 వేల నగదు బహుమతి అందజేసి ప్రోత్సహించారు.ఈ సందర్భంగా ఆమెను పలువురు ప్రముఖులు,ఉపాధ్యాయులు,పాఠశాల సిబ్బంది అభినందించారు.

# దేవుడి సన్నిధిలో భక్తుడికే అవమానమా?

## భక్తి ముందు ఉద్యోగ అహంకారం!



**పిఠాపురం, ఆగస్టు 16 ( ప్రభాతవార్త )** ఆధ్యాత్మికతకు ఆలవాలమైన పాదగయ క్షేత్రంలో భక్తుడి మనసు గాయపడితే.. అది ఒక్క వ్యక్తి అవమానం కాదు.. ఆలయ పవిత్రతకే మచ్చ. దేవుడి దర్శనం కోసం వచ్చే భక్తుడిని దేవుడి ప్రతిరూపంగా భావించాలన్న సనాతన సంప్రదాయం ఉన్న చోటే ఆలయ సిబ్బంది దురుసు ప్రవర్తనకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు రావడం తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. భక్తి, సేవ, సంస్కారం కలగాల్సిన చోట అధికార దర్పం, నిర్లక్ష్యం, అహంకారం తాండవిస్తే.. పవిత్ర క్షేత్రం పరువు ఎక్కడ మిగులుతుంది? ఆలయానికి జీవనాడి. భక్తుడి కానుకలతో ఆలయ నిర్వహణ సాగుతుంది. భక్తుడి రాకతోనే ఆలయ ప్రాంగణానికి కళ వస్తుంది. అలాంటి భక్తుడినే అవమానిస్తే.. గర్భగుడిలో ఎంత ఘనంగా పూజలు చేసినా ఆ సేవకు పరిపూర్ణత ఎక్కడ? దేవుడి విగ్రహానికి పూలు వేసే చేతులు.. భక్తుడి మనసుపై రాళ్లు వేయకూడదు. భక్తుడి కన్నీరు పడే చోట తీర్థం ఎంత పవిత్రమైనా.. ఆ కన్నీటి చేదు మిగిలిపోతుంది.

**చిల్లర లేదంటే.. చిందులెందుకు?**

కుక్కుటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తుడు టికెట్ తీసుకునేందుకు వంద రూపాయల నోటు అందించగా చిల్లర లేదంటూ ఉద్యోగి ఆగ్రహంగా స్పందించారన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఫోన్‌పే ద్వారా చెల్లిస్తానని భక్తుడు చెప్పినా పట్టించుకోకుండా, టికెట్ కౌంటరులోని నగదు కట్టలను టేబుల్‌పై బలంగా కొట్టడం నిజంగా జరిగి ఉంటే.. అది చిల్లర సమస్య కాదు.. సేవా సంస్కృతి చిల్లరబారిన దుస్థితికి నిదర్శనం. భక్తుడితో రెండు మృదువైన మాటలు మాట్లాడటం చేతకాకపోతే.. ఆలయంలో ఉద్యోగం ఎందుకు? దర్శనానికి వచ్చిన వ్యక్తిపై కోపం చూపించడానికి కౌంటర్ ఏమైనా అధికార పీఠమా? భక్తుడు అడిగింది దానం కాదు.. దర్శనం కోసం టికెట్.

**సీసీ కెమెరా ముందు.. నిజం బట్టబయలు!**


భక్తుడి ఫిర్యాదుపై ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ సీసీ ఫుటేజీ పరిశీలించగా ఉద్యోగి అనుచితంగా ప్రవర్తించినట్లు ప్రాథమికంగా నిర్ధారణ కావడం వ్యవహార తీవ్రతను తెలియజేస్తోంది. ఉద్యోగిపై తదుపరి చర్యలు తీసుకుంటామని ఈవో హామీ ఇవ్వడం స్వాగతించదగ్గ పరిణామమే. అయితే చర్యలు కేవలం ఒక ఘటనకు ముగింపు కాకుండా.. ఆలయంలో సేవా సంస్కృతికి శ్రీకారం కావాలి. భక్తుడు ఆలయానికి వచ్చిన అతిథి కాదు..

**భక్తుల గదుల్లో సిబ్బంది విశ్రాంతా?**

భక్తుల సౌకర్యార్థం నిర్మించిన వసతి గదులను సిబ్బంది విశ్రాంతి, కాలక్షేపానికి వినియోగిస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఇవన్నీ నిజమైతే మరింత విచారణ అవసరం. భక్తుల కోసం నిర్మించిన సదుపాయాలు భక్తులకే అందాలి. ఉద్యోగుల సౌకర్యాల కోసం వాటిని మలచడం సేవ కాదు.. స్వార్థం.

**దేవుడి ముందు ఉద్యోగి.. భక్తుడి ముందు అధికారి?**

ఆలయంలో ఉద్యోగం అంటే హోదా కాదు.. హరిసేవ. కౌంటర్ వెనుక కూర్చున్న వ్యక్తికి అధికారం ఉండొచ్చు.. కానీ ఆ అధికారం భక్తుడిని అవమానించే హక్కును ఇవ్వదు. దేవుడి సన్నిధిలో ప్రతి ఒక్కరూ సమానమే. అక్కడ ఉద్యోగి కూడా సేవకుడే.. భక్తుడు కూడా దేవుడి బిడ్డే. భక్తుడి మనసు నొప్పించి దేవుడిని ప్రసన్నం చేసుకోలేరు. భక్తుడి కంట కన్నీరు తెప్పించి.. గర్భగుడిలో హారతులు పట్టడం ఎంతవరకు ఆధ్యాత్మిక సేవ? పాదగయ క్షేత్ర పవిత్రతను కాపాడాలంటే ముందుగా భక్తుడి గౌరవాన్ని కాపాడాలి. ఒక్క ఉద్యోగిపై చర్యతో సమస్య ముగియదు. ప్రతి సిబ్బందిలో సేవాభావం, సంయమనం, సంస్కారం నింపేలా ఆలయ యంత్రాంగం చర్యలు తీసుకోవాలి. లేదంటే.. గుడిలో దేవుడు ఉన్నా, భక్తుడి హృదయంలో మాత్రం ఆ దేవాలయంపై నమ్మకం క్రమంగా కరిగిపోతుంది.



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం. డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## సమాజ హితం కోసం కృషి చేయాలి.. ఎమ్మెల్యే గిడ్డి..



**అంబాజీపేట,ఆగస్టు 16,(ప్రభాతవార్త):** సమాజ హితం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి కనీస ధర్మమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన జనసేన పార్టీ సీనియర్ నాయకులు పద్మజ టవర్స్ అధినేత మైపాల తాతాజీ పుట్టినరోజు వేడుకలను ఆయన అభిమానులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాచవరంలోని తాతాజీ స్వగృహం వద్ద జరిగిన పుట్టినరోజు కార్యక్రమంలో ముఖ్య అతిథి పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తో పాటు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, నియోజకవర్గ టిడిపి కో-కన్వీనర్లు మోకా ఆనందసాగర్, దాసరి వీర వెంకట సత్యనారాయణ, కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు శిరిగినీడి వెంకటేశ్వరరావు, మట్టపర్తి బాల భారతి, అంబటి భూలక్ష్మి, జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, టీటీడీ మాజీ డైరెక్టర్ డొక్కా నాద్ బాబులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాతాజీ అభిమానులు ఏర్పాటుచేసిన భారీ కేకును కోసి తాతాజీ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకలు జరుపుకునే సమయంలో తన సంతోషంతోపాటు కనీస అవసరాలకు దూరమైన కొంతమందికైనా సహాయం చేయాలనే ఆలోచన కలగాలన్నారు. దీనిలో భాగంగా బండారులంక శ్రీ షిరిడి సాయి మందిరం సమీపంలోని నిత్య అన్నదాన సత్రంలో బీదలకు అన్నదానం,దుప్పట్లు పంపిణీ చేయడం,అలాగే అమలాపురంలోని మానస వికాస కేంద్రంలో విద్యార్థులకు విద్యాసామాగ్రి అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం తాతాజీ పద్మావతి దంపతులను ఘనంగా సన్మానించి,విందు ఆరగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, కృషివల చైర్మన్ గణపతి వీర రాఘవులు, డాక్టర్ మానస, కల్వకొలను తాతాజీ,ప్రత్తిపాటి ఉమామహేశ్వరి,రవణం రాము, నాగాబత్తుల శాంతకుమారి-వెంకట సుబ్బారావు, కొర్లపాటి గోపి,దొమ్మేటి వెంకట రామారావు,గుత్తుల చంటి, కొర్లపాటి ఢిల్లీ, దొమ్మేటి సాయికృష్ణ,దొమ్మేటి సత్యమోహన్,నాగవరపు నాగరాజు,ములపర్తి మోహన్రావు, వాకపల్లి దొరబాబు అడబాల తాతయ్య నాయుడు, పెనమరెడ్డి నాయుడు, నాగవరపు నాగరాజు,అక్కల సత్తిబాబు,పితాని కేశవ పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల్లో అభివృద్ధి



**కాత్రేనికోన, ఆగస్టు16(ప్రభాత వార్త)** కూటమి ప్రభుత్వం తోనే రాష్ట్రంలో అన్ని గ్రామాల్లో అభివృద్ధి సాధ్యపడుతుందని మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగిడి నాగేశ్వరరావు పేర్కొన్నారు. రెండేళ్ల పాలన -అభివృద్ధి, సంక్షేమం ఇంటింటికి కార్యక్రమం కాత్రేనికోన మండలంలోని గచ్చకాయల పోర, రాజానగరం,నాగాపట్నం,నీళ్ళరేవు, మర్రి చెట్టు కాలనీ తదితర గ్రామాలలో నాగిడి, టిడిపి మండల అధ్యక్షుడు చెల్లి సురేష్ గారి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఆయా గ్రామాల లో ప్రతి ఇంటికి వెళ్లి ఈ రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి వారు ప్రజలకు వివరించారు. అలాగే ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ప్రకారం సూపర్ సిక్స్ పథకాలు అన్ని ఒక్కొక్కటి అమలు చేస్తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు రాష్ట్ర అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారన్నారు. మన నియోజకవర్గ అభివృద్ధికి మన శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు గారు పాటుపడుతున్నారని కొనియాడారు.

## మద్దిబందల శ్రీకోదండ రామాలయంలో ఏకాహం



**రాజవొమ్మంగి, ఆగస్టు 16, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలం చికిలింత పంచాయితీ మద్దిబంధల గ్రామ శ్రీ కోదండ రామాలయం ఎనిమిదో వార్షికోత్సవ సందర్భంగా ఆదివారం ఉదయం ఆరు గంటలు నుండి సోమవారం ఉదయం ఆరుగంటలు వరకూ ఏకాహం భజన కార్యక్రమాలు కొనసాగుతున్నట్లు గిరిజన అర్చకులు కాకర అర్జునరావు తెలిపారు. వెంకటనగరం, కిమ్మూరు, చేరుకుంపాలెం, అన్నవరం, లక్ష్మీపురం, జడ్డంగి, చెరుకుంపాలెం, సర్రంపేట, చికిలింత, గర్రంగి, వనకరాయి గ్రామాల భజన బృందాలు హరినామ సంకీర్తన చేస్తారని కాకర చంద్రుడు అన్నారు. ఈకార్యక్రమంలో కాకర అర్జునరావు, కాకర రామలక్ష్మి, కాకర చంద్రుడు, చలుమర్తి విశ్వనాద్ రెడ్డి, కాకర రాజులబాబు, జర్తా పెంటయ్య, సాగర సత్యవేణి, కుప్పిలి కృష్ణారెడ్డి, జనుమూరి చిన్నబ్బాయి, జీడెం అర్జునరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేడు ఎ పి యు డబ్ల్యు జె ఆధ్వర్యంలో కంటి దంత వైద్య శిబిరం

**రాజవొమ్మంగి, ఆగస్టు 16, ప్రభాతవార్త** రాజవొమ్మంగి, మండల కేంద్రంలోని స్థానిక మల్లిరెడ్డి గోవింద్ కళ్యాణ మండపంలో ఎ పి యు డబ్ల్యు జె ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9 గం.ల నుంచి సాయంత్రం 3గం.ల వరకు ఉచిత కంటి, దంత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు రాజవొమ్మంగి మండల అల్లూరి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఆరిపాక సూరిబాబు ఓ ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎ పి యు డబ్ల్యు జె ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ అగర్వాల్ ఆసుపత్రి వారిచే కంటి శిబిరం, దంత వైద్య శిబిరం అలాగే రెడ్ క్రాస్ సంస్థ ద్వారా రక్త దాన శిబిరం నిర్వహణ జరుగుతుందన్నారు. వైద్య శిభిరానికి వచ్చే రోగులకు భోజన వసతి కలదని తెలిపారు మండలంలోని ప్రజలు కంటి, దంత సమస్యలు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps